దాశరథీ శతకము

Rama & Co. 111 | S/No 8 Series No. 80.

DASARADHI SATAKAM.

WITH

MEANINGS AND NOTES &c.

దాశరథీశతకము.

(టీకాతాత్పర్యసహితము.)

పబ్లిషర్సు:

రామా అండ్ కో

హెడ్డాఫీసు—ఏలూరు,

కృష్ణాజిల్లా.

PRINTED AT THE RAMA PRESS, ELLORE,

1917.

 [వెల 0-4-0.

రామా అండ్ కో వారి
అప్రూవ్డు నాటకకథలు, భూగోళములు.

ఈ క్రింది గ్రంథములు డైరెక్టరుగారిచే అప్రూవుకాబడినవి.

శిశుతరగతి నాటకముల కథలు	(అప్రూవుడు)		...	0-1-6
మొదటితరగతి	,,	డిటో	...	0-2-0
రెండవతరగతి	,,	డిటో	...	0-2-6
మూడవతరగతి	,,	డిటో	...	0-3-0
నాల్గవతరగతి ,,	,,	డిటో	...	0-4-0
ప్రభుభక్తికీర్తనలు, పద్యములు		డిటో	...	0-1-0
సుదతీసునీతిశతకము-బాలికలకు తెలుగుపద్యములు				0-1-3
సివిక్సుమ్యాన్యుయల్. 3. 4. తరగతులకు		డిటో	...	0-5-0
కిండరుగార్టెనుడ్రిల్లు. (బొమ్మలతో)		డిటో	...	0-5-0
నూతనగంజాముజిల్లాభూగోళము.		డిటో	...	0-2-6
నూతనవిశాఖపట్టణముజిల్లాభూగోళము		డిటో	...	0-2-6
నూతనగోదావరిజిల్లాభూగోళము.		డిటో	...	0-3-0
నూతనకృష్ణాజిల్లాభూగోళము.		డిటో	...	0-3-0
నూతనగుంటూరుజిల్లాభూగోళము		డిటో	...	0-3-0
నూతననెల్లూరుజిల్లాభూగోళము		డిటో	...	0-3-0

ఈ క్రింది గ్రంథములు డైరెక్టరుగారికి అప్రూవుకొరకు పంపడమైనది.

నూతనకర్నూలుజిల్లాభూగోళము	...	0-3-0
నూతనకడపజిల్లాభూగోళము	...	0-3-0
నూతనబళ్ళారిజిల్లాభూగోళము	...	0-3-0
నూతనఅనంతపురముజిల్లాభూగోళము	...	0-3-0
నూతనచిత్తూరుజిల్లాభూగోళము	...	0-3-0
నూతనచెంగల్పట్టుజిల్లాభూగోళము	...	0-3-0
మృగముల డ్రాయింగుబుక్కు	...	0-2-6

వలయువారు:—రామా అండ్ కో,

హెడ్డాఫీసు—ఏలూరు, కృష్ణాజిల్లా.

బ్రాంచి—తర్లపాడు, నెల్లూరుజిల్లా.

శ్రీరస్తు.

కంచెర్ల గోపకవిప్రణీతంబగు

దాశరథీశతకము.

టీకాతాత్పర్యసహితము.

రామా అండ్ కో,

ఏలూరు-కృష్ణాజిల్లా.

రామా ముద్రాక్షరశాల,

ఏలూరు.

1917.

వె. | [అణాలు ౪

శ్రీరస్తు.

దాశరథీ శతకము.

:o:

సటీకము.

శ్రీ రఘురామ, చారుతుల ♦ సీదళదామ, శమక్ష
మాదిశృం । గారగుణాభిరామ, త్రిజ ♦ గన్నుత
శౌర్యరమాలలామ, । దుర్వారకబంధరాక్షసవి♦
రామ, జగజ్జనకల్మషార్ణవో । త్తారకనామ, భ
ద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 1

టీ. శ్రీ=సంపద్యుక్తుఁడైన, రఘు = రఘుమహారాజుయొక్క. ఇక్ష్వాకువంశమునందు కూటస్థపురుషుఁడైన రఘురాజుయొక్క - కులమున పుట్టినట్టి, రామ= రామ, చారు=మనోహరమైన, తులసీ=తులసియొక్క, దళ =పత్రముచేతనైన, దామ=దండగలవాఁడా, శమ=శాంతి, క్షమ = ఓర్పు, ఆది=మొదలైన, శృంగార=మనోజ్ఞములగు, గుణ = గుణములచేత, అభిరామ=మనోహరుఁడైనవాఁడా, త్రిజగత్ = మూఁడులోకములచేతను, నుత=పొగడబడిన శౌర్య=పరాక్రమముయొక్క, రమా=సంపత్తియనెడి - లలామ=ఆభరణముగలవాఁడా - శౌర్యరమా=పరాక్రమ లక్ష్మిచేత, లలామ=మనోజ్ఞుఁడైనవాఁడా - దుర్వార=వారింపరాని కబంధరాక్షస= కబంధుఁడనురాక్షసుని. విరామ =హరించినవాఁడా - జగత్ = లోకమునందలి, జన= జనులయొక్క, కల్మష=పాపములనెడి, అర్ణవ=

సముద్రమును, ఉత్తారక=దాఁటించునట్టి, నామ= పేరుగలవాఁడా - కరుణాపయోనిధీ=దయాసముద్రుఁడును, భద్రగిరి= భద్రాచలమందు వేంచేసియున్న,దాశరథీ = దశరథునికుమారుఁడైన శ్రీరామా.

తా. శ్రీ రఘుమహారాజు వంశమునపుట్టి, అందమైన తులసిదండదాల్చి శమదమాది కల్యాణగుణములచేత నొప్పి, మూడులోకములందును పొగడ్తకెక్కిన పరాక్రమసంపత్తిచే శోభిల్లి, కబంధుఁడను రాక్షసుని అణఁచి, లోకులపాపములను దొలఁగించుచు, కరుణాసముద్రుఁడవై భద్రాచలమందు వేంచేసియున్న దశరథ కుమారుఁడవైన రామా.

ఉ. రామ, విశాలవిక్రమ ప ♦ రాజిత భార్గవరామ, సద్గుణ
స్తోమ, పరాంగనావిముఖ ♦ సువ్రతకామ, వినీలనీరద
శ్యామ, కకుత్స్థవంశకల ♦ శాంబుధిసోమ, సురారిదోర్బలో
ద్దామవిరామ, భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 2.

టీ. రామ = సర్వజనుల రమింపఁజేయువాఁడా, - విశాల = అధికమైన, విక్రమ = పరాక్రమముచేత, పరాజిత = ఓడింపఁబడిన, భార్గవరామ = భృగువంశమునఁబుట్టిన (పరశురాముఁడు గలవాఁడా)సద్గుణస్తోమ- సత్ + గుణ= మంచిగుణములయొక్క, స్తోమ = సమూహమైనవాఁడా - పరాంగనా = పరస్త్రీలయందు, విముఖ= పెడమొగముగల-సువ్రత = మంచివ్రతమునందు కామ=రక్తిగలవాఁడా, వినీల=మిక్కిలినల్లనైన, నీరద = మేఘమువలె, శ్యామ= నల్లనైనవాఁడా, కకుత్స్థ = ఇక్ష్వాకువంశ్యులలో నొకఁడైన వంశ=వంశమనెడి, కలశ + అంబుధి = పాలసముద్రమునకు, సోమ=చంద్రుఁడైనవాఁడా, సురారి= దేవతలకు శత్రువులైన రాక్షసులయొక్క, దోర్బల = బాహుబలములయొక్క, ఉద్దామ= అత్యంతమైన, విరామ = ఉడుగుటగలవాఁడా, కరుణాపయోనిధీ= దయాసముద్రుఁడా, భద్రగిరిదాశరథీ=భద్రాచలవాసుఁడైన రామా.

తా. సౌందర్యాదులచే సర్వజనులనురంజింపఁజేయుచు, అధికపరాక్రమముచే పరశురాముని గెలిచి, పరస్త్రీలయందాసక్తిలేనివాఁడవై నల్లనిమబ్బువంటి దేహకాంతితోనొప్పి, కాకుత్స్థవంశమును వర్ధిల్లఁజేసి, రాక్షసులబలము నడంచి దయకలవాఁడవై యొప్పుచున్న భద్రాద్రిరామా.

చ. అగణితసత్యభాష, శర ♦ ణాగతపోష, దయాలసఝ్ఝరీ
విగతసమస్తదోష, పృథి ♦ వీసురతోష త్రిలోకపూతకృ
ద్గగనధునీమరందపద ♦ కంజవిశేష మణిప్రభా ధగ
ద్ధగితవిభూష భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. అగణిత = ఎన్నరాని, సత్య = సత్యము, భాష = పలుకువాఁడా, లేక, భాష = వాక్కులుగలవాఁడా, శరణాగత = శరణుజొచ్చిన వారిని, పోష = పోషించువాఁడా, దయా = కరుణయనెడి, లసత్ = ప్రకాశించుచున్న, ఝరీ = ప్రవాహముచేత, విగత = పోయిన, సమస్త = సకలమైన, దోష = ఆశ్రితులయొక్క దోషములుగలవాఁడా, పృథివీసుర = బ్రాహ్మణులను, తోష = సంతోషపెట్టువాఁడా, త్రిలోక = మూడులోకములను, పూతకృత్ = పవిత్రము చేయుచున్న, గగనధునీ = ఆకాశనదియైన గంగయనెడు, మరంద = పూఁదేనెగల, పదకంజవిశేష = చరణపద్మవిశేషములు గలవాఁడా - మణి = రత్నములయొక్క, ప్రభా = కాంతులచేత, ధగద్ధగిత = ధగధగమని ప్రకాశింపఁజేయఁబడిన, విభూష = ఆభరణములుగల వాఁడా, కరుణాపయోనిధీ = దయాసముద్రుఁడా, భద్రగిరిదాశరథీ = భద్రాచలవాసుఁడైన రామా.

తా. సత్యవచనుఁడును, శరణాగతులను బోషించువాఁడును, ఆశ్రితుల దోషములన్నిటిని యొక్కదయచేత బోఁగొట్టువాఁడును, బ్రాహ్మణులను, సంతోషపెట్టువాఁడును, మూడులోకములను పవిత్రముగాఁజేయునట్టి గంగ పుట్టిన చరణారవిందములు గలవాఁడును, రత్నములయొక్క కాంతులచే

ధగధగ మెఱయుచున్న యాభరణములను ధరించినవాఁడును, దయగలవా
డును, భద్రాచలవాసియునగు శ్రీరామా.

ఉ. రంగదరాతిభంగ, ఖగ♦రాజతురంగ, విపత్పరంపరో
త్తుంగతమఃపతంగ, పరి♦తోషితరంగ, దయాంతరంగ, స
త్సంగ,ధరాత్మజాహృదయ♦సారసభృంగ,నిశాచరాబ్జమా
తంగ, శుభాంగ, భద్రగిరి♦దాశరథీ కరుణాపయోనిధీ 4

టీ. రంగత్=ప్రకాశించుచున్న-అరాతి = శత్రువులను, భంగ= భజించువాఁడా,ఖగరాజ=పక్షిరాజగు గరుత్మంతుఁడనెడి, తురంగ=గుఱ్ఱముగలవాఁడా - విపత్ = ఆపదలయొక్క, పరంపరా = ఎడతెగని వరుసయనెడి - ఉత్తుంగ=మిక్కిలియైన, తమః=చీఁకటికి, పతంగ=సూర్యుఁడైనవాఁడా - పరితోషిత=మిక్కిలి సంతోషపెట్టఁబడిన, రంగ=రంగస్వామి గలవాఁడా - దయాంతరంగ = దయగల మనస్సు గలవాఁడా, సత్ + సంగ = సజ్జనులతోడి సహవాసముగలవాఁడా - ధరాత్మజా = భూదేవికూఁతురైన సీతాదేవియొక్క, హృదయ=మనస్సుఅనెడి, సారస= పద్మమునకు, భృంగ=తుమ్మెదయైనవాఁడా - నిశాచర=రాక్షసులనెడి, అబ్జ=తామరలకు మాతంగ=ఏనుఁగు అయినవాఁడా - శుభాంగ=మంగళప్రదమైన అవయవములుగలవాఁడా- కరుణాపయోనిధీ, భద్రగిరి దాశరథీ-

తా. శత్రువుల గర్వమునడంచువాఁడును, గరుడవాహనారూఢుఁడును, ఆశ్రితుల యాపదలను పోఁగొట్టువాఁడును, రంగనాథుని సంతోషపెట్టినవాఁడును, దయతోఁగూడిన మనస్సు గలవాఁడును, సత్పురుషులచేఁగొలువఁబడినవాఁడును, సీతయొక్క ప్రేమకును ధ్యానమునకును విషయమైనవాఁడును, దయాసముద్రుఁడునగు భద్రాచలరామా.

ఉ. శ్రీద సనందనాదిముని ♦ సేవితపాద దిగంతకీర్తి సం
పాద సమస్తభూతపరి ♦ పాలవినోద విషాదవల్లి కా

చ్ఛేద ధరాధినాథకుల ♦ సింధుసుధామయపాద నృత్తగీ
తాదివినోద భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 5

టీ. శ్రీద=సంపదను, ఇచ్చువాఁడా, సనందనాది=సనందనుఁడు మొదలైన, ముని=ఋషులచేత, సేవిత=కొలువఁబడిన, పాద=చరణములు గలవాఁడా, దిగంత=దిక్కుకొనలయందలి, కీర్తి=యశస్సుయొక్క, సంపాద=సంపాదనముగలవాఁడా- సమస్త=సకలమైన, భూత=ప్రాణులయొక్క, పరిపాల=రక్షించుటయందు, వినోద=వేడుకగలవాఁడా, మహాప్రసాద=మిక్కిలిఅనుగ్రహముగలవాఁడా, భవ=జన్మమనెడి-పాశ=త్రాడును విభేత=భేదించువాఁడా, విషాద=దుఃఖమనెడి, వల్లికా=తీఁగను, ఛేద=త్రెంచువాఁడా - ధరాధినాథ=రాజులయొక్క, కుల=వంశమనెడు సింధు=సముద్రమునకు, సుధామయ=అమృతమయములైన, పాద=కిరణములు గల చంద్రుఁడైనవాఁడా- నృత్త=నాట్యము, గీత=పాట, ఆది=మొదలైన, వినోద=వేడుకలుగలవాఁడా.

తా. ఆశ్రితులకు సంపదల నిచ్చుచు, సనకస నందనాదిఋషులు కొలుచునట్టిపాదములుగలిగి, దిక్కులయం దెల్లఁబ్రసిద్ధిగాంచి, సకలప్రాణులను లీలమెయిని బ్రోచుచు, దుఃఖములను బోఁగొట్టుచు, రాజకులమునందుద్భవించుటచే దానికి అభివృద్ధికలిగించి నృత్తగీతాదులగు వేడుకలందాసక్తుఁడైనదయాసముద్రుండగుభద్రాచలరామా.

ఉ. ఆర్యుల కెల్ల మ్రొక్కి వి ♦ నతాంగుఁడనై రఘునాథభట్టరా
చార్యులకంజలెత్తి కవి ♦ సత్తములన్ వినుతించి కార్యసా
కర్య మెలర్ప నొక్కశత ♦ కంబొనఁగూర్చి రచింతునేఁడు తా
త్పర్యమునన్ గ్రహింపుమిది ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 6

టీ. ఆర్యులకున్ ఎల్లన్=పూజ్యులగు పెద్దలకందఱికిని, వినతాంగుఁడనై=అవనతచేత వినమ్రములైన అవయవములుగలవాఁడనై, మ్రొ

క్కి, రఘునాథభట్టరాచార్యులకున్ = రఘునాథభట్టరుఅనెడి గురువునకు, అంజలెత్తి = చేయిమోడ్చి, కవిసత్తములకున్ = కవిశ్రేష్ఠులను, వినుతించి = కొనియాడి, కార్యసౌకర్యము = కార్యము సులభముగాచేయఁగూడుటను, ఎలర్పన్ = కలుగఁ ఒక్కశతకంబు = ఒకశతకమును, ఒనఁగూర్చి = పొందికచేసి, నేఁడు = నేఁటిదినము ఇప్పుడనుట, రచింతున్ = చేసెదను, కరుణాపయోనిధీ = కరుణాసముద్రా, భద్రగిరిదాశరథీ = భద్రాచలవాసియగు, శ్రీరామా, ఇది = ఈశతకమును, తాత్పర్యమునన్ = ఆసక్తితోడ, గ్రహింపుము = కయికొనుము.

తా. నేను వినయముతో పెద్దలకందఱికిని మ్రొక్కి, మాగురువులైన రఘునాథభట్టరువారికి నమస్కరించి శ్రేష్ఠులను బొగడి, వారియాశీస్సుచే నాకార్యము సుకరముకాఁగా, యిపుడు ఒకశతకమును మాత్రమే రచించుచున్నాను. కరుణాసముద్రుఁడవైన భద్రాద్రిరామా, నాయీశతకమును ఆసక్తితోఁ బరిగ్రహింపుము.

చ. మసకొని రేఁగుబండ్లకును ♦ మౌక్తికముల్ వెలవోసినట్లు దు
ర్వ్యసనము జెంది కావ్యము దు ♦ రాత్ములకిచ్చితిమోసమయ్యె నా
రసనకుఁ బూతవృత్తిసుక ♦ రంబుగఁ జేకుఱునట్లు వాక్సుధా
రసములుచిల్కఁబద్యముఖ♦రంగమునందు నటింపవయ్య సం
తసమును జెంది భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 7

టీ. మసకొని=ఆసపడి, రేఁగుబండ్లకును, మౌక్తికముల్ = ముత్తెములను, వెలవోసినట్లు=ఖరీదిచ్చినవిధమున, దుర్వ్యసనమున్ = చెడ్డఆసక్తిని, చెంది=పొంది, కావ్యము=కావ్యమును, దురాత్ములకున్=దుష్టులకు, ఇచ్చితిన్=అంకితముగా ఇచ్చితిని, మోసముఅయ్యె= దానిచే మోసపోతివనుట నారసనకు=నాలుకకు, పూతవృత్తి = పరిశుద్ధమైనవర్తనము = సుకరంబుగన్ = సులువుగా, చేకుఱునట్లు=కలుగునట్లు, వాక్సుధారసములు=వాక్కు

లనెడి యమృతరసములు, చిల్కన్ = ఒలుకునట్లు, పద్యముఖరంగమునందు = పద్యములుగల నాముఖమనెడి నాట్యరంగమునందు, సంతసమును = సంతోషమును, చెంది, భద్రగిరిదాశరథీ, కరుణాపయోనిధీ. నటింపవయ్యా = నాట్యము సేయుమా.

తా. ముత్యాలు వెలగాపోసి రేగిపండ్లకుఆసపడినట్లు, దుష్టులకాసపడి వారికి కావ్యములను చెప్పి పురుషార్థమును చెందక మోసపోయితిని, వానిని వర్ణించుటచే నానాలుక మలినమైనది. కావున దానికి సులువుగాపరిశుద్ధికలుగునట్లు నీకంకితముగా కావ్యము సేయఁగోరెద. అప్పుడు నానాలుకయనెడి రంగమునందు నీవునిలిచి నటించి అమృతములొలుకునట్టి పద్యములను జెప్పునట్లుచేయవలయును.

ఉ. శ్రీరమణీయహార యత ♦ సీకుసుమాభశరీర, భక్తమం
దార, వికారదూర, పర ♦ తత్త్వవిహార, త్రిలోకచేతనో
ద్ధార, దురంతపాతకవి ♦ తానవిదూర, ఖరారిదైత్యకాం
తారకుఠార భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 8

టీ. శ్రీ = కాంతిచేత, రమణీయ = మనోజ్ఞమైన, హార = హారముగలవాఁడా, అతసీకుసుమ = అగిసెపువ్వులతో, అభ = సాటియైనశరీర = దేహముగలవాఁడా, భక్తమందార = భక్తులకు కల్పవృక్షమైనవాఁడా = వికారదూర = వికారము లేనివాఁడా = పరతత్త్వవిహార — పరతత్త్వ = పరమాత్మ స్వరూపముయొక్క, విహార = అవతారాది విహారము తెవవాఁడా, త్రిలోక = మూఁడులోకములందలి, చేతన = జీవులను, ఉద్ధార = ఉద్ధరించువాఁడా, దురంత = అంతములేని, పాతక = పాపములయొక్క, వితాన = సమూహమునకు, విదూర = మిక్కిలి దూరమైనవాఁడా, ఖరాది = ఖరుఁడు మొదలుగాఁగల, దైత్య = రాక్షసులనెడి, కాంతార = అడవికి, కుఠార = గొడ్డలియైనవాఁడా- కరుణాపయోనిధీ, భద్రగిరిదాశరథీ.

తా. కాంతిచేతమనోజ్ఞమైన హారములు దాల్చి; అగిసెపూలవంటి మేనికాంతిగలిగి, భక్తులకోర్కులుదీర్చుచు, నీపరతత్త్వస్వరూపమునందురమిం చుచు, ముల్లోకములందలిచేతనుల రక్షించుచు, సకలపాపములకు దూరుఁడై, ఖరుఁడు మొదలగు రాక్షసులను దునుమాడి దయాసముద్రుఁడై యొప్పు భద్రాద్రిరామా.

చ. దురితలతాలవిత్ర, ఖర ♦ దూషణకాననవీతిహోత్రభూ
భరణకళావిచిత్ర, భవ ♦ బంధవిమోచనసూత్ర చారువి
స్ఫురదరవిందనేత్ర, ఘన ♦ పుణ్యచరిత్ర వినీలభూరికం
ధరసమగాత్ర, భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 9

టీ. దురిత = పాపము నెడి, లతా = తీఁగలకు, లవిత్ర = అంపమైన వాఁడా - ఖరదూషణ = ఖరుఁడు దూషణుఁడుఅను, కానన = అడవికి, వీతిహోత్ర = అగ్నియైనవాఁడా-భూ = భూమియొక్క, భరణ = భరిం చుటయను, కళా = విన్నాణముచేత, విచిత్ర = విచిత్రుఁడైనవాఁడా, భవ = పుట్టుకయనెడి, బంధ = ముడిని, విమోచన = విడిచి పుచ్చుట యను, సూత్ర = విధిగలవాఁడా- చారు = సుందరమై, విస్ఫురత్ = మిక్కి లి ప్రకాశించుచున్న, అరవింద = తామరలవంటి, నేత్ర = నేత్రములుగల వాఁడా, ఘన = మిక్కిలియు, పుణ్య = పవిత్రమైన, చరిత్ర = చరిత్ర ముగలవాఁడా, వినీల = మిక్కిలినల్లనై, భూరి = అధికమైన, కంధర = మబ్బుతోడ, సమ = సమానమైన, గాత్ర = దేహముగలవాఁడా.

తా. తీఁగలనెడి పాపములను అంపమువలె దుంచుచు, అగ్ని అడవి నివలె ఖరదూషణులను నాశముచేసి, నానావిధలీలలచే భూమిని భరించు చు, జన్మపరంపరలను దూలించుచు, తామరలవంటి సొగసైనకన్నుఁగవ గ లిగి, మిక్కిలి పావనమైనచరిత్రమునం బ్రవర్తిల్లి. నల్లనిమబ్బువంటి శరీరము నుదాల్చి కరుణాసముద్రుఁడవైన భద్రాచలరామా.

చ. కనకవిశాలచేల భవ ♦ కానన శాతకుఠారధార స
జ్జనపరిపాలశీల దివి ♦ జస్తుతసద్గుణకాండ కాండ సం
జనితపరాక్రమక్రమ వి ♦ శారద శారదకందకుందచం
దనఘనసారసారయశ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 10

టీ. కనక = బంగారుమయమైనను, విశాల = విరివియైనదియును, అగు, చేల = వస్త్రముగలవాఁడా, భవ = పుట్టుకయనెడి, కానన = అడవికి, శాత = వాఁడియైన, కుఠార = గొడ్డలియొక్క, ధార = వాదరయైనవాఁడా సజ్జన = సత్పురుషులను, పరిపాల = రక్షించుటయే, శీల = స్వభావముగాఁగలవాఁడా, దేవతలచేత, స్తుతస్తోత్రము చేయబడిన, సద్గుణ = మంచిగుణములయొక్క, కాండ = సమూహముగలవాఁడా, కాండసంజనిత = నీటియందుపుట్టిన అగ్నియొక్క, పరాక్రమ = శౌర్యముయొక్క, క్రమ = విధమునందు, విశారద = పండితుఁడైనవాఁడా, శారద = శరత్కాల సంబంధియైన, కంద = మేఘము, కుంద = మొల్లలు, చందన = చందనము, ఘనసార = పచ్చకర్పూరము, సార = శ్రేష్ఠమైన, యశ = కీర్తిగలవాఁడా.

తా. విరివియైనబంగరు వస్త్రమునుగట్టి, పదునైనగొడ్డలిచే అడవిని నఱకునట్లు జన్మపరంపరను నాశముచేసి, సత్పురుషులను రక్షించుటయే స్వభావముగలిగి దేవతలు పొగడునట్టి గుణగణముచే రాణించి, అగ్నివంటి పరాక్రమముతోఁగూడి, శరత్కాలమేఘములు మల్లె చందనము పచ్చకపురము వలె తెల్లనై మెఱయుచున్న కీర్తిగలిగి, కరుణానిధివైన భద్రాచలరామా.

ఉ. శ్రీరఘువంశతోయధికి ♦ శీతమయూఖుఁడ వైననీపవి
త్రోరుపదాబ్జముల్ వికసి ♦ తోత్పలచంపకవృత్తమాధురీ
పూరితవాక్ప్రసూనములఁ ♦ బూజలొనర్చెదఁ జిత్తగింపుమీ
తారకనామ భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 11

టీ. శ్రీ = సంపత్కరమైన, రఘువంశ = రఘురాజువంశమనెడి, తోయధిశక్ = సముద్రమునకు, శీతమయూఖుఁడవు = చంద్రుఁడవు — ఐన = అయినట్టి, నీ = నీయొక్క, పవిత్ర = పావనములును, ఉరు = గొప్పవియును శ్రేష్ఠపదాబ్జముల్ = తామరలవంటి యడుగులను, వికసిత ప్రకాశించిన, ఉత్పల = ఉత్పలమాలికలు, చంపక = చంపకమాలికలు, అనెడి, వృత్త = ఛందోవృత్తములయొక్క, మాధురీ = తీయఁదనముచేత పూరిత = నింపబడిన, వాక్ = వాక్కులనెడి, వికశిత = వికసించిన, ఉత్పల = నల్లగలువలయు, చంపక = సంపెంగలయు, వృత్త = వర్తనముగలవియు, మాధురీ = చక్కదనముచేత, పూరిత = నిండినవియు, అగు, ప్రసూనములక్ = పువ్వులచేత, ఒనర్చెదను = చేసెదను, తారక = సంసారమునుతరింపఁజేయునట్టి, నామ = దివ్యనామముగలవాఁడా, చిత్తగింపుమీ = అంగీకరింపుమా.

తా. చంద్రుఁడు తాను పుట్టిన సముద్రమును వర్ధిల్ల జేయునట్లు రఘుమహారాజువంశమునంబుట్టి దానిని వృద్ధిజేయువాఁడవైన నీయొక్కపాదారవిందములను ఉత్పలచంపకమాలికా వృత్తము లందలి వాక్కులనెడి ఉత్పల సంపెగ పువ్వులచేతఁ బూజించుచున్నాను. గయికొనుమా.

చ. గురుతరమైన కావ్యరస♦గుంభనకబ్బురమంది ముష్కరుల్
సరసులమాడ్కి సంతసిల♦జాలుదురోటు శశాంకచంద్రికాం
కురముల కిందుకాంతమణి♦కోటిస్రవించిన భంగివింధ్యభూ
ధరమునజాఱునే శిలలు♦దాశరథీకరుణాపయోనిధీ. 12

టీ. గురుతరము = మిక్కిలిగొప్పది, ఐన, కావ్య = కావ్యమునందలి, రస = శృంగారాదిరసములయొక్క, గుంభనకుక్ = కూర్పునకు, ముష్కరుల్ = రసజ్ఞతలేనిమూఢులు, సరసులమాడ్కి = రసికులవలె, అబ్బురము అంది = ఆశ్చర్యమునుపొంది, సంతసిలక్ = సంతోషించుటకు, చాలుదురో టు = శక్తులగుదురా, శశాంక = (జింకను గుఱుతుగాఁగల) చంద్రునియొ

క్కు, చంద్రిక = వెన్నెలలయొక్క, అంకురములకుఁ = మొలకలకు, ఇందుకాంతమణి = చంద్రకాంతమణులయొక్క, కోటి = సమూహము, ద్రవించినభంగిఁ = కరఁగి జాఱినరీతిని, వింధ్యభూధరమున = వింధ్యపర్వతమునందు, శిలలు = ఱాలు, జాఱునే = కరఁగునా.

తా. చంద్రకాంతమణులు చంద్రునికిరణములకు కరఁగునట్లు వింధ్యపర్వతపు శిలలుకరఁగి ద్రవింపజాలవు. ఇట్లేగొప్పకావ్యమునందలి రసస్ఫూర్తికి రసికులవలె మూఢులుమెచ్చి సంతోషింపఁజాలరు. కావునే నాకావ్యమును నరనుఁడవైన నీకు అంకితము సేయుచున్నాను.

చ. తరణికులేశ నానుడులఁ దప్పులు గల్గిన నీదునామ స
ద్విరచిత మైనకావ్యము పవిత్రముగాదె వియన్నదీజలం
బరుగుచు వంకయైనమలినాకృతిఁ బాఱినఁ దన్మహత్వముం
దరమె గణింపనెవ్వరికి దాశరథీకరుణాపయోనిధీ. 13.

టీ. తరణికులేశ = సూర్యవంశమున జనించినవారిలో శ్రేష్ఠుఁడైనవాడా, నానుడులఁ = నామాటలందు, తప్పులు = దోషములు కల్గినఁ = కలిగినప్పటికిని, నీదు = నీయొక్క, నామ = పేరితోడ, సత్ = శ్రేష్ఠమైనదియు, విరచిత = రచింపఁబడినదియు, ఐనకావ్యము = అయినట్టికావ్యము, పవిత్రముకాదె = పావనమే యగునుకాదా, వియన్నదీజలంబు = ఆకాశగంగయొక్కనీరు, అరుగుచుఁ = ప్రవహించుచు, వంకయైన = వంకరగానైన, మలిన ఆకృతిఁ = మురికిగల ఆకారముతో, పాఱినఁ = ప్రవహించినను, తన్మహత్వముఁ = దానిమహాత్మ్యమును, గణింపఁ = ఎన్నుటకు, తరమె = శక్యమా, శక్యముకాదనుట.

తా. సూర్యవంశమున జనించినవారిలో శ్రేష్ఠుడైనవాడా నామాటలందు దోషము లెన్నియున్నను నీయొక్క నామముతోడ శ్రేష్ఠమయినదియు రచియింపబడినదియు కావ్యము పవిత్రమైనదికాదా. (అగునసుట) అనగా

ఆకాశగంగయొక్క నీరు ప్రవహించుచు శంకరగాపాతీసను, ముతికిగల ఆ కారముతో ప్రవహించినను దానిమహాత్మ్యము ఎన్నుటకు శక్యమా. (కాద నుట.)

ఉ. దారుణపాతకాబ్ధికి స ♦ దాబడబాగ్ని భవాకులార్తి వి
స్తారదవానలార్చికి ను ♦ ధారసవృష్టి దురంతదుర్మతా
చారభయంకరాటవికిఁ ♦ జండకఠోరకుఠారధార నీ
తారకనామ మెన్నుకొన ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 14

టీ. నీతారకనామము = సంసారమునుతరింపఁజేయునట్టినీయొక్క రామ నామము, ఎన్నుకొనఁగా = తలఁపఁగా, దారుణ = భయంకరమైన, పాతక = పాపములుఅనెడి, అబ్ధికిన్ = సముద్రమునకు, సదా = ఎప్పుడును, బడ బాగ్ని = బడబాగ్నియైనది-సంసారముయొక్క, ఆకుల = వ్యాప్తమై యు న్న, ఆర్తి = పీడయొక్క, విస్తార = బాహుళ్యమనెడి, దవానల = కాఱు చిచ్చుయొక్క, అర్చికిన్ = సెగకు, సుధారసవృష్టి = అమృతద్రవవర్షము- దురంత = మితిమీఱిన, దుర్మత = దుష్టమతులయొక్క, ఆచార = ఆచా రములనెడి, భయంకర = భయంకరమును గలిగించునట్టి,అడవికిన్ = అడవికి, చండ = తీక్ష్ణమును, కఠోర = కటువైనదియు ,అగు,కుఠార = గొడ్డలి యొ క్క, ధార = మొన-

తా. సంసారతారకమైన నీరామనామము, బడబాగ్ని సముద్రమును పీల్చునట్లుభయంకరములైనపాతకములను బోఁగొట్టును; అమృతద్రవవర్షము కా ఱుచిచ్చును చల్లార్చునట్లు సంసారబాధలనుఉపశమింపఁజేయును; పదునైన గొడ్డలిచేభయంకరమైనఅడవిని నఱుకునట్లు, మితిమీరిన దుర్మతాచారముల ను నిర్మూలము చేయును.

చ. హరునకు నవ్విభీషణున ♦ కద్రిజకుం దిరుమంత్రరాజమై
కరికి నహల్యకున్ ద్రుపద ♦ కన్యకునార్తి హరించుచుట్టమై

పఁరగినయట్టి నీపతిత ♦ పావననామము జిహ్వపై నిరం
తరము నటింపఁజేయు మిఁక ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 15

టీ. హరునకుఁ = శివునకును, ఆవిభీషణునకుఁ = విభీషణునికిని, అద్రిజకుఁ = పార్వతికిని, తిరమంత్రరాజము = తిరము = శ్రేష్ఠమైన, మంత్రరాజము = శ్రేష్ఠమైనమంత్రము, ఐ = అయి, కరికిఁ — ఏనుఁగునకును, అహల్యకుఁ = అహల్యకును, ద్రుపదకన్యకుఁ = ద్రౌపదికిని, ఆర్తిఁ = మనోవ్యథనుఅయి, పరగినయట్టి = ప్రసిద్ధినొందినట్టి, నీ = నీయొక్క పతిత = పతితులైనవారిని, పావన = పరిశుద్ధులను జేయునట్టి, నామము = పేరు, ఇఁకఁ, జిహ్వపైఁ = నాలుకమీఁద, నిరంతరము = ఎడతెగక, నటింపఁజేయుము = నృత్యము సేయునట్లు చేయుము.

తా. దశరథరామా! శివునికిని విభీషణునికిని, పార్వతికిని శ్రేష్ఠమైనమంత్రమై; గజేంద్రునికి, అహల్యకును, ద్రౌపదికిని చుట్టమువలె చిక్కులనుదొలగించునదై; పాపులను ప్రవిత్రులను జేయునట్టినీనామమును నానాలుకయందు నటించునట్లు చేయుమా.

ఉ. ముప్పునఁ గాలకింకరులు ♦ ముంగిట వచ్చినవేళ, రోగముల్
గొప్పరమైనచోఁ, గఫము ♦ కుత్తుకనిండినవేళ, బాంధవుల్
గప్పినవేళ, మీస్మరణ ♦ గల్గునొ గల్గదొ నాఁటి కిప్పుడే
తప్పకచేతు మీభజన ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 16

టీ. ముప్పునఁ = ముసలితనమందు, కాలకింకరులు = యమదూతలు, ముంగిటఁ = ఇంటిముంగిటికి, వచ్చినవేళఁ = వచ్చినట్టిసమయమునను, రోగముల్ = తెవుళ్లు, కొప్పరము = అతిశయించినవి, ఐనచోఁ = అయినప్పుడును, కఫము, కుత్తుకఁ = కంఠమునందు, నిండినవేళఁ = పూర్ణమైనసమయమందును, బాంధవుల్ = చుట్టములు, కప్పినవేళఁ = క్రమ్ముకొన్నప్పుడును, మీస్మరణ = మిమ్మును స్మరించుట, నాఁటికిఁ = అప్పటికి, కల్గునో,

కల్గదో, యేమో, ఇప్పుడే, తప్పక = విడువక, మీభజన = మిమ్ముభజించుట, చేతుఁజ = చేయుదును.

తా. శ్రీరామా! ముసలితనమువచ్చి సేనున్నచోటికి యమదూతలు వచ్చినపుడు, రోగములు మిక్కిలి ముమ్మరమైనపుడును, మరణము సమీపింపఁగా కఫము గొంతుకయందు నిండియున్నపుడును, అప్పుడు చుట్టములుచుట్టును కమ్ముకొనియుండఁగాను, మిమ్ము స్మరించుట నాకుఁ గలుగునో కలుగదో చెప్పఁజాలను. కనుక ఇప్పుడే తప్పకనిన్ను భజనచేసెదను.

చ. పరమదయానిధే పతిత ♦ పావననామ హరేయటంచు సు
స్థిరమతులై సదాభజన ♦ సేయుమహాత్ములపాదధూళి నా
శిరమున దాల్తుమీరటకు ♦ జేరకుడంచు యముండుకింకరో
త్కరముల కానఁబెట్టునఁట ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. పరమ = మిక్కిలియైన, దయా = కృపకు, నిధే = నిధానమైనవాఁడా, పతిత = పాపాత్ములను, పావన = పవిత్రులనుగాఁజేయునట్టి, నామ = పేరుగలవాఁడా, హరే = శ్రీహరీ, అటంచుఁజ = అని, సదా = ఎప్పుడును, సుస్థిర = మిక్కిలి నిలుకడగల, మతులు = మనస్సు గలవారు, ఐ = అయి, భజన = భజించుట, చేయుమహాత్ముల = చేయునట్టిమహనీయులయొక్క, పాదధూళి = అడుగులదుమ్ము, నాశిరమునఁజ = నాతలయందు, తాల్తుఁజ = ధరింతును, మీరు, అటకుఁజ = వారికడకు, చేరకుఁడు = పోవకుడు, అంచుఁజ = అనుచు, యముండు = యముఁడు, కింకరోత్కరములకుఁజ = తన సేవకుల సమూహములకు, ఆనఁబెట్టునఁట = ఒట్టు పెట్టునని చెప్పుదురు.

తా. పాపాత్ములను పవిత్రులనుగాజేయునట్టి పేరుగలవాఁడా, హరీ అని ఎప్పుడును మిక్కిలి నిలకడగల మనస్సుగలవారయి భజించునట్టి మహా

నీయులయొక్క పాదధూళి వారలయందు ధరింతును. మీరు వారికడకు పోవకుడనుచు యముఁడు తన సేవకసముదాయములకు ఒట్టుపెట్టునని చెప్పుదురు.

చ. అజునకుఁ దండ్రివయ్యు సన♦కాదులకుంబరతత్త్వమయ్యు స
ద్ద్విజమునికోటికెల్లఁ గుల ♦ దేవతవయ్యు దినేశవంశభూ
భుజులకు మేటివయ్యుఁ బరి♦పూర్ణుఁడవై వెలుఁగొందు పక్షిరా
డ్ధ్వజమిముఁబ్రస్తుతించెదను ♦ దాశరథీకరుణాపయోనిధీ.

టీ. అజునకున్ = బ్రహ్మకు, తండ్రివయ్యున్ = తండ్రివిగాను. సనకాదులకున్ = పరతత్త్వవేత్తలైన సనకుఁడు సనందుఁడు మొదలయినవారికి, పరతత్త్వము అయ్యున్, ఉత్కృష్టవస్తువుగాను, సత్ = శ్రేష్ఠులయిన ద్విజ = బ్రాహ్మణులయొక్క, ముని = ఋషులయొక్క, కోటికిన్ ఎల్లన్ = సమూహమునకు, పరదేవతవుఅయ్యు = శ్రేష్ఠమైన దైవముగాను, దినేశ = సూర్యునియొక్క, వంశ = కులమందలి, భూభుజులకున్ = రాజులకు, మేటివయ్యున్ = శ్రేష్ఠుఁడవుగాను, పరిపూర్ణుఁడవు = నిండినవాఁడవు, ఐ = అయి, వెలుఁగొందు = ప్రకాశించుచున్న, పక్షిరాడ్ధ్వజ = పక్షులకెల్లరాజైనగరుత్మంతుఁడు వాహనముగాఁగలవాఁడా, మిమున్ = మిమ్ము, ప్రస్తుతించెదను = మిక్కిలిస్తోత్రముచేసెదను.

తా. బ్రహ్మకు తండ్రివిగాను, సనకసనందనాది మహర్షులు ధ్యానము సేయు పరతత్త్వముగాను, విప్రమునిసమూహములు కొలుచునట్టి పరదైవముగాను, ఇట్లుఅన్నిలక్షణములను పరిపూర్తినొందిన వాఁడవై గరుడుఁడు ధ్వజముగాఁగలిగి ప్రకాశించు దయానిధీ నిన్నుమిక్కిలి ప్రస్తుతించెదను.

ఉ. "పండితరక్షకుం, డఖల♦పాపవిమోచనుఁ, డబ్జసంభవా
ఖండలపూజితుండు, దశ♦కంఠవిలుంఠన చండకాండకో
దండకలాప్రవీణుఁ "డను♦తావకకీర్తివధూటికిత్తుఁ బూ
దండలు గాఁగ నాకవిత♦దాశరథీ కరుణాపయోనిధీ. 19

టీ. పండితరక్షకుండు = పండితులనురక్షించువాఁడు, అఖిలపాప = సమస్తపాపములనుండి, విమోచనుఁడు = విడిచిపుచ్చువాఁడు, అబ్జసంభవ = బ్రహ్మచేతను, అఖండల = ఇంద్రునిచేతను, పూజితుండు = పూజింపఁబడువాఁడు, దశకంఠ = రావణాసురుని పదితలలను, విలుంఠన = కొల్లగొనుటచేత, చండ = తీక్ష్ణమైన, కాండ = బాణములుగల, కోదండకలా = విలువిద్యయందు, ప్రవీణుఁడు = నేర్పరియైనవాఁడు, అను = అనెడి, తావక = నీయొక్క, కీర్తిన్ = యశస్సుఅనెడి, వధూటికిన్ = స్త్రీకి, నాకవిత = నాకవిత్వమును- గాఁగ = పూలసరములు అగునట్లుగా- ఇత్తున్ = ఇత్తును.

తా. కరుణాసముద్రుఁడవైన రామా ! పండితులను రక్షించువాఁడు; సమస్తపాపములను దొలగించువాఁడు; బ్రహ్మేంద్రాదులచే పూజింపఁబడువాఁడు; రావణాసురునితలలు దునుమునట్టి వాఁడిబాణములను వేయు నేర్పువిలువిద్యయందు నేర్పరియైనవాఁడు, అనెడు నీకీర్తికి నాకవిత్వమును ఇచ్చిదకపడఁతికి పూదండలిచ్చి యలంకరింపఁజేసినట్లు ఆకీర్తిని శోభిల్లఁజేయుదును.

ఉ. శ్రీరమ సీత గాఁగ, నిజ ♦ సేవకబృందము వీరవైష్ణవా
చారజనంబు గాఁగ, విర ♦ జానది గౌతమిగాఁగ, వికుంఠము
న్నారయ భద్రశైలశిఖ ♦ రాగ్రముగాఁగ, వసించు చేతనో
ద్ధారకుఁడైనవిష్ణుఁడవు ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 20

టీ. శ్రీరమ = లక్ష్మీదేవి, సీతకాఁగన్ = సీతాదేవికాఁగా, నిజ = తనదైన, సేవకబృందము = పరిజనులసమూహము- వీరవైష్ణవ- ఆచార = ఆచారముగల- జనంబుకాఁగన్ = జనులు కాఁగా, విరజానది-గౌతమికాఁగన్ = గోదావరి కాగా, వికుంఠముకన్ = వైకుంఠమును, ఆరయన్ = విచారింపఁగా, భద్రశైల = భద్రాచలముయొక్క, శిఖర = శిఖరముయొక్క, అగ్రము కాఁగన్ = కొనకాఁగా, వసించి = నెలకొని, చేతనోద్ధారకుఁడు = చేతనులను ఉద్ధరించువాఁడు, ఐనవిష్ణుఁడవు = అయినట్టి సాక్షాద్విష్ణుదేవుఁడవు.

తా. దశరథరామా! నీవు పరమపదమందున్న లక్ష్మీదేవిని ఇచటసీత గాఁజేసికొని, అందలి పరివారము ఇచటవీరవైష్ణవజనులుగా వచ్చి కొలుచుచుండఁగా, అచట విరజానది యిచట గోదావరిగా ప్రవహింపఁగా, ఆవైకుంఠమె యిచట భద్రగిరిఁగొమ్మ్కొనఁయై రాణింపఁగా, వేంచేసి చేతనులను ఉద్ధరించుచున్న శ్రీవిష్ణుదేవుఁడవేకాని వేఱుకావు.

ఉ. కంటి నదీతటంబుఁ, బొడ ♦ గఁటిని భద్రనగాధివాసముం,
గంటి నిలాతనూజ, నురు♦కార్ముకమార్గణ శంఖచక్రముల్
గంటిని, మిమ్ము లక్ష్మణునిఁ ♦ గంటిఁ గృతార్థుఁడనైతి,నోజగ
త్కంటక దైత్యనిర్దళన ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 21

టీ. జగత్ = లోకములకు, కంటక = హింసించువారైన, దైత్య = రాక్షసులను, నిర్దళన = సంహరించువాఁడా, కరుణాపయోనిధీ, దాశరథీ, నదీతటంబు = నదియొక్క తీరమును, కంటిని = చూచితిని, భద్రనగాధివాసముం = భద్రాచలము అనెడినివాసస్థానమును, కంటిని = చూచితిని, ఇలాతనూజన్ = భూదేవి కూఁతురైన సీతాదేవిని, కంటిని = చూచితిని, ఉరు = గొప్పలైన, కార్ముక = విల్లు, మార్గణ = బాణములు, శంఖచక్రముల్ = శంఖమును చక్రమును- కంటిని = చూచితిని, కృతార్థుఁడను = ధన్యుఁడను, ఐతిని = అయితిని.

తా. లోకహింసకులైన రాక్షసులను రూపుమాపి దయాసముద్రుఁడవైయొప్పు శ్రీరామా! నీవు వేంచేసియున్న భద్రగిరియొద్దనున్న గోదావరిగట్టును, నీవు వేంచేసియున్న భద్రాచలవాసమును, సీతాదేవిని, నీవిల్లును, బాణములను, శంఖచక్రములను, నిన్నును, లక్ష్మణునిని సేవించికృతార్థుఁడనైతిని.

చ. హలికునకున్ హలాగ్రమున ♦ నర్థము సేకురుభంగి దప్పిచే
నలమటఁ జెందువానికి సు ♦ రాపగలో జల మబ్బినట్లు, దు

ర్మలినమనోవికారి నగు♦మర్త్యుని నన్నొడఁగూర్చి నీపయిం
దలఁపు ఘటింపఁజేసితివి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 22

టీ. దాశరథీ, హలిపనకున్ = మడఁక దున్ను వానికి, హలాగ్రహము నన్ = నాఁగలి మొనయందు-అర్థము = ధనము చేకురుభంగిన్ = లంభించినవిధమున- దప్పిచేన్ = దాహతిచేత, అలమటన్ = బడలికను, చెందువానికిన్ = పొందువానికి, సురాపగలోన్ = గంగలో, జలము = నీరు, అబ్బినట్లు = దొరకినవిధమున- దుర్మలిన = మిక్కిలిదోషయుక్తమైన, మనో = మనస్సుయొక్క, వికారిని = వికారములుగలవాఁడను- అగుమర్త్యునిన్ = అయినమనుష్యుని, నన్నున్, ఒడఁగూర్చి = సవరించి, నీపయిన్ = నీమీఁద, తలఁపు = చింతనము, ఘటింపఁజేసితివి = కలుగఁజేసితివి.

తా. మడఁకదున్నుకొను బీదకు మడఁకముంగల భూమిలో ధనము దొరకినట్లును, దప్పిగొని బడలినవానికి గంగానదిలోని నీరులభించినట్లును, దుష్టమనస్సుగల మనుష్యుండనైనన్ను చక్కఁజేసి నీపయితలఁపు కలిగించి ధన్యునిజేసితివి.

ఉ. కొంజక తర్కవాద మను ♦ గుద్దలిచేఁ బరతత్త్వభూస్థలిన్
రంజిలఁద్రవ్వికన్గొనని ♦ రామనిధాన ము నేఁడు భక్తిసి
ద్ధాంజనమందు హస్తగత♦మయ్యెభళీయనఁగా మదీయహృ
త్కంజమునన్ వసింపుమిఁక ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. కొంజక = సంకోచింపక, తర్కవాదము = తర్కముచేచేయు వివాదము, అను గుద్దలిచేత- పరతత్త్వభూస్థలిన్ = పరతత్త్వము అనెడి భూప్రదేశమును, రంజిలన్ = ఒప్పఁగా, త్రవ్వి, కన్గొనని రామనిధానము = చూడనిరాముఁడుఅనెడినిధి, నేఁడు = ఇపుడు, భక్తిసిద్ధాంజనమందు = భక్తియనెడి సిద్ధకృతమైన కాటుకయందు, హస్తగతము = చేతికి దొరకినది, అ

ర్యేక = అయెను-అనఁగాక=అనునట్లు, ఇకక=ఇఁకమీఁద-భక్తి చేతమదీయహృత్కంజమునక = నాహృదయకమలమందు, వసింపుము = నెలకొనుము.

తా. భూమినిగుడ్డలచే త్రవ్వినను కనఁబడనినిధి అంజనముచే లభించునట్లు, పరతత్త్వము తర్కవాదములచే ఎంతపరిశీలించినను అందు తెలియరాని రాముఁడ వగునీవు భక్తిచేసులభముగా నాకు వశమైతివి. ఇఁక నాహృదయమునందు వసింపుమా.

ఉ. రాముఁడు ఘోరపాతకవి ♦ రాముఁడు సద్గుణకల్పవల్లికా
రాముఁడు షడ్వికారజయ ♦ రాముఁడు సాధుజనావనవ్రతో
ద్దాముఁడు రాముఁడేపరమ♦ దైవముమాకనిమీయడుంగు గెం
దామరలే భజించెదను ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 24

టీ. రాముఁడు = రమింపఁ జేయువాఁడు, ఘోర = భయంకరములైన, పాతక = పాతకములను, విరాముఁడు=తొలఁగించువాఁడు, సద్గుణ= మంచిగుణములు అనెడి, కల్పవల్లికా = కల్పవృక్షపుతీఁగలకు, ఆరాముఁడు= తోఁటయైనవాఁడు సజ్జన కల్పవల్లికారాముడు, షడ్వికార= పుట్టుట పెరుఁగుట మొదలైన ఆఱువికారములయొక్క, జయ=గెలుపుచేత, రాముఁడుక= మనోజ్ఞుఁడైనవాఁడు, సాధుజన = సజ్జనులను, అవన = రక్షించుట అనెడి, వ్రత= నియమముచేత, ఉద్దాముఁడు = అధికుఁడైనవాఁడు = రాముఁడే=శ్రీరాముఁడే, మాకు, పరమ దైవము, అని, మీ అడుంగు కెందామరలను = మీ పాదము లనెడి ఎఱ్ఱతామరలను-ఏను= నేను, భజించెదను=కొలిచెదను.

తా. సకలజనులను రమింపఁజేయువాఁడును, ఘోరమైన పాపములను తొలఁగించువాఁడును, కల్యాణగుణములను అవ్వారిగాఁ గలవాఁడును. వికారరహితుఁడై ప్రకాశించువాఁడును, సాధుజనులను రక్షించునట్టి వాఁడును, రాముఁడే మాకు పరమదైవమని మీపాదారవిందములను కొలిచెదను

చ. చక్కెరమాని వేముదినఁ ♦ జాలినకైవడి మానవాధముల్
పెక్కురు బక్కదైవముల ♦ వేమఱుఁగొల్చెదరట్లకాదయా
మ్రొక్కిన నీకమ్రొక్కవలె♦మోక్షమొసంగిననీవయీవలెం
దక్కినమాట లేమిటికి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 25

టీ. చక్కెరన్ = పంచదారను, మాని = విడిచి, వేమున్ = వేఁపచెట్టును, చేఁదును, తినన్ = తినుటకును, చాలినకైవడిన్ = నేర్చినవిధమున, మానవాధముల్ = హీనులు, పెక్కురు = అనేకులు, బక్కదైవములన్ = అల్పదేవతలను, వేమఱున్ = పలుమాఱు, కొల్చెదరు = సేవించెదరు, అట్ల = అవిధమే, కాదయా = కాదు, మ్రొక్కినన్ = మ్రొక్కినయెడల, నీక = నీకే, మ్రొక్కవలెన్ = నమస్కరింపవలెను. మోక్షము = ముక్తిని, ఒసంగినన్ = ఇచ్చినను, నీవ = నీవే, ఈవలెన్ = ఇయ్యావలెను తక్కినమాటలు = ఇతరవిషయములు, ఏమిటికిన్ = ఎందుకు.

తా. హీనులైనవారు అనేకులు నిన్ను వదలి దేవతలనేకములను గొలిచెదరు, అనగా తియ్యని చక్కెరనువిడిచి చేఁదైనవేమును దినుటకు నేర్చినట్లున్నది. యిది సరికాదు. మ్రొక్కఁదగిన వాఁడవు నీవే మోక్షమిచ్చువాఁడవునునీవే.

ఉ. 'రా'కలుషంబులెల్ల బయ♦లంబడఁద్రోచిన 'మా'కవాటమై
దీకొనిప్రోచునిక్కమని ♦ ధీయుతులెన్నఁ దదీయవర్ణముల్
గైకొనిభక్తిచే నుడువఁ♦గానరు గాక విపత్పరంపరల్
దాకొనునే జగజ్జనుల ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 26

టీ. "రా"="రామ" అనెడి పేరునందలి రేఫము, కలుషంబులెల్లన్ = దోషములను అన్నిటిని, బయలన్ = వెలుపల, పడన్ తోయఁగాన్ = పడునట్లుతోసిపుచ్చఁగా, "మా"="మ" అనుఅక్షరము, కవాట

మై=తలపై, దీని=తాఁకి, పోఁచుఁగా = కాపాడును, నిక్కము=ఇది నిజము, అని, ధీ=బుద్ధితోడ, యుతులు=కూడిన వారు=జ్ఞానులు, ఎన్నఁగా= తలఁపఁగా, తదీయవర్ణముల్=ఆయక్షరములను, కైకొని= చేకొని గ్రహించి, భక్తిచే=భక్తి పూర్వకముగా, నుడుఁగా= చెప్పుటకుకానరు = తెలియరు, కాక = కానిచో, విపత్ = ఆపదలయొక్క, పరంపరల్ = ఎడతెగనివరుసలు, జగత్ + జనులఁగా = జగమునందలి వారిని-లోకుల ననుట, పైకొను నే = ఆక్రమించునా.

తా. "రామ" అనుదివ్యనామములోని రేఫము పాపములన్నిటిని బయటికిఁ దఱుమఁగా "మ" అనెడి అక్షరము తలుపువలె అడ్డపడి వానిని ఎదిరించి లోపలికి రాకుండునట్లుచేసి ఆశ్రితులను గాపాడును. ఇది నిజమని జ్ఞానవంతులు చెప్పఁగా మూఢులాయక్షరములను గ్రహించి జపింప నేరకున్నారు. ఇట్లుకాక లోకులు వానిని జపించిరేని ఎడతెగక వచ్చు ఆపదలు వారికి కలుగవు.

ఉ. రామ హరే కకుత్స్థకుల ♦ రామహరే రఘురామరామశ్రీ
రామ హరేయటంచు మది ♦ రంజిల భేకగళంబులీల నీ
నామము సంస్మరించిన జ ♦ నంబు భవంబెడఁబాసి తత్పరం
ధామనివాసులౌదు రఁట ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 27

టీ. రామ = రామా, హరే = హరీ, కకుత్స్థకులరామ = కాకుత్స్థవంశమునపుట్టిన రామా, హరే = హరీ, రఘురామ = రఘురాజు సంతతివాఁడవైన రామా, రామ = రామా, శ్రీరామ = శ్రీరామా, హరే = హరీ, అటంచుఁగా = అని, మది=మనస్సు, రంజిలఁగా=రంజిల్లునట్లు భేక = కప్పయొక్క, గళంబులీలఁగా = గొంతువిధమున, సంస్మరించినజనంబు = మనస్సులో తలంచినజనులు, భవంబు=జన్మమును, ఎడఁబాసి = విడిచి, తత్ = ఆ - ప్రసిద్ధమైన, పరంధామ = శ్రేష్ఠమైనపట్టు అగుపరమపదమునందు, నివాసులు = నివసించువారు, ఔదురు అఁట=అగుదురు.

తా. రామ! హరే! కాకుత్స్థరామ! రఘురామ! శ్రీరామ! హరే! అని నీనామమును కప్పగొంతువలె మనస్సున మాటిమాటికిఁ దలంచుజనులు ఇఁక జన్మమెత్తుటను విడిచి పరమపదమందు వసింతురుగదా..

ఉ. చక్కెరలప్పకుఁ మిగుల ♦ జవ్వని కెంజిగు రాకుమోవికిం
జొక్కపుజుంటి తేనియకుఁ ♦ జొక్కలుచుం గనలేరు గాక నేఁ
డక్కట రామనామమధు ♦ రామృతమానుటకంటె సౌఖ్యమా
తక్కినమాధురీమహిమ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 28

టీ. చక్కెరలప్పకుఁ = పంచదారయొక్క రాశికిని, జవ్వని = యౌవనముగల స్త్రీయొక్క, కెంపు + చిగురాకు మోవికిఁ = ఎఱ్ఱనిచిగురువంటి అధరమునకును, చొక్కపుజుంటి తేనియకుఁ = అచ్చమైనజుంటీఁగలుగూర్చిన తేనెకును, మిగులఁ = మిక్కిలి, చొక్కిలిచుఁ = చొక్కుచు కనలేరుగాక = (రామనామముయొక్క మాధుర్యమును) తెలిసికొనలేరుగాని, అక్కట = అకటా, రామనామ = రామ అనెడినామముయొక్క, మధుర = తీయనైన, అమృతము, ఆనుటకంటెఁ = ఆస్వాదించుటకంటెను, తక్కిన = ఇతరమైన, మాధురీ = తీపియొక్క, మహిమ = పేరిమి- సౌఖ్యమా = సుఖమైనదా.

తా. రామా! చక్కెరరాశికిని, ఎలప్రాయముగల స్త్రీల చిగురాకువంటి యెఱ్ఱని పెదవికిని, తేనెటీఁగలు గూర్చిన అచ్చతేనెకును, చొక్కి రామనామముయొక్క మాధుర్యమును తెలిసికొనక జనులున్నారుగాని అమృతమువలె అతిభోగ్యమైన రామనామమును ఆస్వాదించుటకంటెను తక్కినవానిమాధుర్యాతిశయము సుఖప్రదము కానేరదు. రామనామమే అన్నిటికంటెను మధురమైనది.

ఉ. అండజవాహ నిన్ను హృద ♦ యంబున నమ్మినవారిపాపముల్
కొండలవంటివైన వెసఁ ♦ గూలినశింపక యున్నె సంతతా

ఖండలవైభవోన్నతులు ♦ గల్గక మానునె మోక్షలక్ష్మికై
దండ యొసంగకున్నె తుద ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. అండజవాహ = పక్షివాహనా, నిన్నుక్, హృదయంబునక్ = మనస్సునందు, నమ్మినవారిపాపముల్ = నమ్మినట్టివారలయొక్క పాపములు, కొండలతంటివి = కొండలవలె మిక్కిలి గొప్పరాసులయినవి, ఐనక్ = అయినను, వెసక్ = త్వరితముగా, కూలి = క్రిందుపడి, నశింపకయున్నె = చెడిపోకయుండునా. సంతత = ఎడతెగనట్టి, అఖండల = ఇంద్రునియొక్క, వైభవ = విభవముయొక్క, ఉన్నతులు = అతిశయములు, కల్గకమానునె = లభింపకపోవునా, తుదక్ = కడపట, మోక్షలక్ష్మి = ముక్తిరూపమైన లక్ష్మి, కైదండ = సాహాయ్యము, ఒసంగకయున్నె = ఇయ్యకుండునా.

తా. పక్షివాహనా! మనసునందు నిన్ను నమ్మినవారికి మొదట కొండలవలె పెద్దకుప్పలు గొనియున్న వారిపాపములు నశించిపోక మానవు. ఇంద్రుని యైశ్వర్యమువంటి మహదైశ్వర్యము కలుగకపోదు. పిమ్మట మోక్షము లభింపకపోదు.

ఉ. చిక్కనిపాలపై మిసిమిఁ ♦ జెందినమీఁగడ పంచదారతో
మెక్కినభంగి నీవిమల ♦ మేచకరూపసుధారసంబు నా
మక్కువపళ్లెరంబున సమాహితదాస్య మనేటిదోయిటన్
దక్కనటంచు జుఱ్ఱెదను ♦ దాశరథీకరుణాపయోనిధీ. 30

టీ. చిక్కనిపాలపై = చిక్కనగుపాలమీఁద, మిసిమిఁజెందిన మీఁగడక్-మిసిమిక్ = కాంతిని, చెందిన = పొందిన- మిసమిసలాడునట్టిదియను టు, మీఁగడక్ = మీఁగడను, పంచదారతోక్ = చక్కెరతోడఁగూర్చి, మెక్కినభంగిక్ = తిన్నవిధముగ, నీ = నీయొక్క, విమల = అచ్చమయిన, మేచక = నల్లని, రూప = ఆకారమనెడి, సుధారసంబుక్ = అమృతరసమును, నా = నాయొక్క, మక్కువ = ప్రేమయనెడి, పళ్లెరంబునక్ =

భోజనపాత్రమున, సమాహిత = పొహ్చరికగల, దాస్యము = కొలువు, అనే టి = అనునట్టి- దోయిటన్ = దోసిలియందు, దక్కును = లభించెను, అ టంచున్ = అనుచు, జుఱ్ఱెదను = జుఱ్ఱుచున్నాను.

తా. చిక్కనిపాలమీఁద మిసమిసలాడు మీఁగడను చక్కరతోఁ గలిపి తిన్నట్లు మిక్కిలి అమృతరసమువలెనుండు నీవల్లనిరూపమును నేను ప్రేమతోఁగైకొని దాస్యరూపమైన కైంకర్యమును అవ్వారిగా చేసి అను భవించెదను.

చ. సిరులిడసీత, పీడ లెగఁ◆జిమ్ముటకున్ హనుమంతుఁ,డార్తి సో
దరుఁడుసుమిత్రసూతి, దురి◆తంబులుమానుప రామనామముం,
గరుణ దలిర్ప మానవులఁ◆గావఁగఁ బన్నినవజ్రపంజరో
త్కరముగదా భవన్మహిమ◆దాశరథీ కరుణాపయోనిధీ. 31

టీ. సిరులు = సంపదలు, ఇడన్ = ఇచ్చుటకు, సీత = సీతాదేవి, పీడలు = బాధలు, ఎగఁజిమ్ముటకున్ = అవలీలఁబోఁగొట్టుటకు, హనుమంతుఁ డు = ఆంజనేయుండు, అగును, ఆర్తిన్ సంకటమునందు, సోదరుఁడు = తోఁ బుట్టువు-సుమిత్రసూతి = లక్ష్మణుఁడు, దురితంబులు = పాపములను, మాను పన్-తొలఁగించుటకు, రామనామమున్ = రామ అనెడి నీనామమును, అగు ను, కరుణ = దయ, తలిర్పన్ = మీఱఁగా, మానవులన్ = మనుష్యులను, కావఁగన్ = కాపాడుటకు, పన్నిన = చేసిన, వజ్ర = వజ్రముచేతనైన, పంజ ర = గూండ్లయొక్క, ఉత్కరము = సమూహము, భవత్ + మహిమ = నీ మాహాత్మ్యము.

తా. దశరథరామా ! సిరు లిచ్చుటకు నీభార్యయయిన సీతాదేవియు బాధలను తొలఁగించుటకు భృత్యుఁడైన హనుమంతుఁడును, సంకటములందు తోడఁబుట్టువలె పరిచరించుటకు నీతమ్ముఁడగులక్ష్మణుఁడును, పాపముల తొలఁగించుటకు నీనామమును, చిలుకలు మొదలయినవానిని వజ్రపుఁగూండ్ల లో పెట్టికాపాడునట్లు మనుష్యులను కాపాడుటకు నీమహత్త్వమును, గలదు.

చ. హలకులిశాంకుశధ్వజశ♦రాసనశంఖరథాంగకల్పకో
జ్జ్వలజలజాతరేఖలను ♦ సాంకములై కనుపట్టుచున్న మీ
కలితపదాంబుజద్వయము♦గౌతమపత్ని కొసంగినట్లు నా
తలఁపునఁ జేర్చి కావఁ గదె♦దాశరథీ కరుణాపయోనిధీ. 32

టీ. హల = నాఁగేలు, కులిశ = వజ్రాయుధము, అంకుశ = అంకుశము, ధ్వజ = టెక్కెము, శరాసన = విల్లు, శంఖ = సంకువు, రథాంగ = చక్రము, కల్పక = కల్పవృక్షము, ఉజ్జ్వల = ప్రకాశించుచున్న, జలజాత = తామర, ఇవియనెడి, రేఖలను = రేకలచేత-సాంకములు = గుఱుతులతోఁ గూడినవి-ఐ = అయి, కనుపట్టుచున్న = అగపడుచున్న, మీ = మీయొక్క, కలిత = ఒప్పుచున్న, పద + అంబుజ-అడుగుఁదమ్ములయొక్క- ద్వయము = జంటను, గౌతమపత్నికిన్ = గౌతమునిభార్యయయిన అహల్యకు, ఒసంగినట్లు=ఇచ్చినట్లు, నాతలఁపునన్ = నాచింతనమందు, చేర్చి = కూర్చి, కావన్ కదె = రక్షింపుము.

తా. అహల్యకు, నాఁగేలు, వజ్రాయుధము, అంకుశము, మొదలయిన వానిరూపములు గలరేఖలు దాల్చియున్న మీపాదారవిందములను ఇచ్చి ఆమెను కృతార్థురాలినిగా చేసినట్లు నాహృదయమందు చేరినన్ను కృతార్థునిగా చేయుము.

చ. జలనిధిలోన దూఁటి కుల♦శైలము మీటి ధరిత్రిఁ గొమ్మునం
దలవడ మాటి రక్కసుని♦యంగము గీటి బలీంద్రునిన్ రసా
తలమున మాటి పార్థివక♦దంబముఁ గూల్చిన మేటి రామ నా
తలఁపున నాటి రాఁ గదవె♦దాశరథీ కరుణాపయోనిధీ. 33

టీ. జలధిలోనన్ = సముద్రములోపల, దూఁటి = చొచ్చి, కులశైలమున్ = కులపర్వతమును-మీటి = ఎగనెత్తి, ధరిత్రిన్ = నీళ్లలో మునిఁగియుండినభూమిని; కొమ్మునందున్, అడవడన్ = పొందికగా, మాటి = త

గెల్చి, రక్కసులయంగము = రాక్షసుండైనహిరణ్యకశిపుని, గీటి = చీల్చి, బలీంద్రునిన్ = ఇంద్రుఁడుగానుండిన బలిచక్రవర్తిని, రసాతలమునన్ = రసాతలమందు, మాటి = మఱుఁగుచేసి- పార్థివకదంబమున్ - పార్థివ = రాజులయొక్క, కదంబమున్ = సమూహమును, కూల్చిన = నాశము చేసినట్టి, మేటి = దిట్టఁడవు అయిన, రామ = రామచంద్రా, నాతలఁపునన్ = నా చింతనమందు, నాటి = నెలకొని, రాఁగదవే = రమ్మా.

తా. శ్రీరామా ! మత్స్యమవై సోమకాసురునికొఱకు సముద్రముఁ జొచ్చి, కూర్మమవయి మందర పర్వతమును పాలసముద్రములో మునిఁగినదానిని ఎత్తినిలపి, వరాహమై ప్రళయజలములలో రసాతలము నంటినభూమిని కోఱకొమ్మున నెత్తికొనవచ్చి, నరసింహుఁడవై హిరణ్యకశిపుని దేహము చీల్చి, వామనుఁడవై బలిచక్రవర్తిని రసాతలమునకు అడఁగఁద్రొక్కి, పరశురాముఁడవై రాజసమూహమును సంహరించినట్టి నీవు నామనసునందు దృఢముగా నిలిచియుండుము.

ఉ. భండనభీముఁ డార్తజన ♦ బాంధవుఁడుజ్జ్వల బాణతూణకో
దండకళాప్రచండభుజ ♦ తాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవసాటిదైవ మిఁక ♦ లేదనుచున్ గడగట్టి భేరికా
దాండదదాండదాండ నిన ♦ దంబు లజాండమునిండమత్తవే
దండము నెక్కి చాటెదను ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. భండన = యుద్ధమందు, భీముఁడు = భయంకరుఁడు, ఆర్తజన = సంకటమునొందినవారిసమూహమునకు, బాంధవుఁడు = చుట్టము, ఉజ్జ్వల = ప్రకాశించుచున్న, బాణ = బాణములును, తూణ = పొదులునుగల, కోదండకళా = విలువిద్యయందు, ప్రచండ = తీవ్రమయిన, భుజ = బాహువులయొక్క, తాండవ = నటనముచేతఁగలిగిన, కీర్తికిన్ = యశస్సుగలవాఁడగు-రామమూర్తికిన్ = రామచంద్రునికి, రెండవసాటిదైవము = సమానమయినమఱి

యొకదైవము, ఇకన్ = ఇంకను, లేదు అనుచున్, గడగట్టి = స్తంభము నాటి, భేరికా = భేరియొక్క, దాండదదాండదాండ = దాండదదాండదాండ అనెడి, నినదంబులు = శబ్దములు, అజాండము = బ్రహ్మాండము, నిండఁగ = నిండునట్లు, మత్తవేదండము = మదించినయేనుగును, ఎక్కి, ఎల్లెడలను, ప్రకటించెను.

తా. రాముడు శత్రువులకు యుద్ధమందు భయంకరుఁడు; భక్తులకు చుట్టమువంటివాఁడు. కావున, బాణములును అమ్ములపొదులును ప్రకాశించుచున్న విలువిద్యనెఱపుతీవ్రమయినభుజముల లాఘవముచే పొగడ్తగన్న శ్రీరామమూర్తికి సాటిదైవము మఱియొకటిలేదనుచు బ్రహ్మాండము మ్రోయునట్లు ధాంధాం అని భేరికొట్టుచు మదపుటేనుఁగునెక్కి చాటెదను.

చ. అవనిజకన్నుదోయి తొగ ♦ లందు వెలింగెడుసోమ జానకీ
కువలయనేత్రిగబ్బిచనుఁ ♦ గొండల నుండుఘనంబు మైథిలీ
నవనవయౌవనం బను వ ♦ నంబునకున్ మదదంతివీవె కా
దవిలి భజింతు నెల్లపుడు ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 35

టీ. అవనిజ = సీతయొక్క, కన్నుదోయి = రెండుకన్నులనెడు, తొగలందు = కలువపూవులయందు, వెలింగెడుసోమ = ప్రకాశించుచున్న చంద్రుఁడైనవాఁడా, జానకీ = జనకునికూతురైన సీతఅనెడి, కువలయనేత్రి = కలువపూవులవంటికన్నులుగల, గబ్బి = ఉబ్బులయిన, చనుఁగొండలన్, ఉండు ఘనంబు = ఉండునట్టిమేఘము, మైథిలీ = మిథిలరాజుకూఁతురయిన సీతాదేవియొక్క, నవనవ = మిక్కిలిక్రొత్తయయిన, యౌవనంబు = ప్రాయము, అను వనంబునకున్ = అనుతోఁటకు, మదదంతివి = మదించినయేనుఁగవు. నీవె కాన్ = నీవేఅని, తవిలి = ఆసక్తిగొని, ఎల్లపుడున్ = ఎప్పుడును, భజింతున్ = సేవింతును.

తా. రామా, నిన్ను సీతాదేవికన్నుదోయి యనెడి కలువలను వికసింపఁజేసెడు చంద్రుఁడుగాను, జానకీదేవి యుబ్బుచన్నులనెడి కొండలయం

చుండు మేఘముగాను, మిథిలాధిపతికుమారి యెలప్రాయమునతోఁటకు వద పుటేనుఁగుగాను, తలఁచి, ఎప్పుడును నిన్నే సేవించెదను.

చ. ఖరకరవంశజా విను మ ♦ ఖండితభూతపిశాచఢాకినీ
జ్వరపరితాపసర్పభయ ♦ వారక మైన భవత్పదాబ్జవి
స్ఫురదురువజ్రపంజరముఁ ♦ జొచ్చితి నీయెడ దీనమానవో
ద్ధరబిరుదాంక మేమఱకు ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 36

టీ. ఖరకర = సూర్యునియొక్క, వంశ = వంశమునందు, జా = పుట్టినవాఁడా, అఖండిత = కొట్టుపడని, భూత = భూతములు, పిశాచ = పిశాచములు, ఢాకినీ = ఢాకినులు, జ్వర = జ్వరములు, పరితాప = తాపములు, సర్ప = సర్పములు, భయ = భయములను, వారకము = పోఁగొట్టునది, అయిన = అయినట్టి, భవత్ = నీయొక్క, పదాబ్జ = పాదపద్మములనెడి, విస్ఫురత్ = మిక్కిలిప్రకాశించుచున్న, ఉరు = గొప్పయయిన, వజ్రపంజరముఁ = వజ్రముతోచేయఁబడినగూటిని, చొచ్చితిని = ప్రవేశించితిని, నీయెడన్ = నీయందు, దీన = దీనులయిన, మానవ = జనులను, ఉద్ధర=ఉద్ధరించువాఁడనెడి, బిరుద + అంకము = బిరుదురూపమయినచిహ్నము, ఏమఱకు = కోలుపోకుము.

తా: సూర్యవంశమునఁబుట్టినశ్రీరామా! భూతములు పిశాచములు ఢాకినులు తాపములు సర్పములు మొదలగువానివలనిభయమును పోఁగొట్టునదై, వజ్రపంజరమువలె రక్షించునీచరణారవిందముల శరణుఁజొచ్చితిని, నీవుదీనమానవోద్ధారకుఁడనుబిరుదుగలవాఁడవుకాబట్టి నను ఉద్ధరింపనివాఁడనై యాబిరుదును బోఁగొట్టుకొనకుమా.

ఉ. జుఱ్ఱెద మీకథామృతము ♦ జుఱ్ఱెదమీపదకంజతోయముల్
జుఱ్ఱెద రామనామమున ♦ జొబ్బిలుచున్న సుధారసంబు నే

జుఱ్ఱెద జుఱ్ఱుజుఱ్ఱఁగ రు ♦ చుల్ గనువారిపదంబుఁ గూర్పవే
తుఱ్ఱులతోడిపొత్తిడక ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 37

టీ. మీకథామృతము = మీయొక్క కథలనెడి యమృతమును, జుఱ్ఱెద = జుఱ్ఱుచున్నాను, మీపదకంజ = మీపాదారవిందములయొక్క, తోయముల్ = జలమును, జుఱ్ఱెద = జుఱ్ఱుచున్నాను, రామనామమునన్ = రామనామమునందు, బొబ్బిలుచున్న సుధారసంబు = స్రవించుచున్న అమృతరసమును, జుఱ్ఱెద = జుఱ్ఱుచున్నాను, జుఱ్ఱుజుఱ్ఱఁగన్ = జుఱ్ఱఁగాజుఱ్ఱఁగా, రుచుల్ = చవులు, కనువారి = ఎఱిఁగినట్టివారియొక్క, పదంబుల్ = స్థానమును, తుఱ్ఱులతోడిపొత్తు = నీచులతోడిస్నేహము, ఇడక = పెట్టక, కూర్పవే = చేర్పుమా.

తా. శ్రీరామా! నీచరిత్రములనెడియమృతమును నీపాదతీర్థమును నీనామమునందు స్రవించుచున్నయమృతమును జుఱ్ఱెదను. నీచరిత్రాదులయమృతమును జుఱ్ఱిరుచితెలిసికొనిన మహనీయులదివ్యగతిని నాకుఁ గలిగింపుము. నీచులతోడిపొత్తుమాన్పుము.

ఉ. ఘోరకృతాంతవీరభట ♦ కోటికి గుండెదిగుల్, దరిద్రతా
కార పిశాచసంహరణ ♦ కార్యవినోది, వికుంఠమందిర
ద్వారకవాటభేది, నిజ ♦ దాసజనావళి కెల్లప్రొద్దు నీ
తారకనామ మెన్నుకొన ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 38

టీ. నీతారకనామము = సంసారమును దాఁటఁజేయు నీనామమును, ఎన్నుకొనఁగ = తలఁచుకొనఁగా, ఘోర = భయంకరుఁడైన, కృతాంత = యమునియొక్క, వీర = శూరులైన, భటకోటికిన్ = కింకరులసమూహమునకు-గుండెదిగుల్ = గుండెలోనిభయము = దరిద్రతా = దారిద్ర్యముయొక్క, ఆకార = రూపముగల, పిశాచ = పిశాచమును, సంహరణ = చంపుటయనె

డి, కార్య = కార్యమునందు, వినోది = క్రీడించునది, నిజ = నీవారైన, దాసజన = కైంకర్యముసేయుజనులయొక్క, ఆవళికి = సమూహమునకు, ఎల్ల ప్రొద్దుఁ = ఎప్పుడును, వికుంఠ = విష్ణుదేవునివాసస్థానమయిన పరమపదమనెడి, మందిర = గృహముయొక్క, ద్వార = వాకారమునందలి, కవాట = తలుపును, భేది = భేదించునది.

తా. రామా! నీతారకనామము భయంకరులయిన యమదూతలను గుండెలదురఁజేయును. దరిద్రత అనెడిపిశాచమును బోగొట్టును. ఎల్లపుడును నీదాసజనులు పరమపదమునకుపోవుటకుఁ గలయడ్డములను తొలగించును.

ఉ. విన్నప మాలకించు రఘు ♦ వీర నహి ప్రతిలోకమందు నా
కన్నదురాత్ముఁడుం బరమ ♦ కారుణికోత్తమ వేల్పులందు నీ
కన్నమహాత్ముఁడుం బతిత ♦ కల్మషదూరుఁడు లేఁడు నాకు వి
ద్వన్నుత నీవె నాకు గతి ♦ దాశరథీ కరుణాపయోనిధీ 39

టీ. రఘువీర = రఘురాజుకులమునఁబుట్టినశూరుఁడైనవాఁడా, విన్నపము = ఒకమనవిని, ఆలకింపు = వినుము, ఆమనవియేమనఁగా, ప్రతిలోకమందుఁ = ఒక్కొక్కజగత్తునందును, నాకన్నఁ = నాకంటెను, దురాత్ముఁడు = దుష్టుఁడు, నహి = లేఁడు, కారుణికోత్తమ = కరుణగలవారిలోనెల్ల శ్రేష్ఠుఁడైనవాఁడా, వేల్పులందుఁ = దేవతలందు, నీకన్నఁ = నీకంటెను, మహాత్ముఁడుఁ = గొప్పవాఁడును, పతిత = పాపాత్ములయొక్క, కల్మష = పాపములను, దూరుఁడు = దవ్వుగాఁజేయువాఁడును, నాకుఁ, లేఁడు = కలుగఁడు, విద్వన్నుత = పండితులచేత కొనియాడఁబడువాఁడా, నీవు, నాకుఁ, గతి = దిక్కు.

తా. రఘువీరా! ఒక మనవి ఆలకింపుడు. ఏలోకమందును నాకంటె దుష్టుఁడులేఁడు. దేవతలందు నీకంటె మహాత్ముఁడును పాపరహితుడు

ను లేదు. కాఁబట్టి దుష్టులలో శ్రేష్ఠుఁడనైననాకు, దేవతలలో శ్రేష్ఠుఁడవైన నీవే దిక్కుయి గుర్తింప శక్తుఁడగుదుగాని మఱియొకరు గానేరరు.

ఉ. పెంపను దల్లివై కలుష ♦ బృందసమాగమ మొందకుండ ర
క్షింపను దండ్రివై మెయిన ♦ సించు దశేంద్రియ రోగముల్ నివా
రింపను వెజ్జవై కృప గు ♦ ఱించి పరంబు దిరంబు గాఁగ స
త్సంపద లియ్య నీవె గతి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 40

టీ. పెంపను = పోషింపను, తల్లివి, ఐ = అయి, కలుష = పాపములయొక్క, బృంద = సమూహముయొక్క, సమాగమము = కూడికను, ఒందకుండఁగ = చెందకుండునట్లు, రక్షింపను = కాపను, తండ్రివి, ఐ = అయి, మెయిన్ = దేహమునందు, వసించు = ఉన్నట్టి, దశేంద్రియ = పదియింద్రియముల వెడి, రోగముల్ = తెవుళ్ళను, నివారింపను = పోగొట్టను, వెజ్జవై = వైద్యుడవై, కృప = దయను, గుఱించి = కలిగి, పరంబుఁగ = మోక్షమును, థిరంబు గాఁగఁ = స్థిరముగునట్లుగా, సత్సంపదలు = మేలయినసంపత్తులను, ఇయఁగ = ఇచ్చుటకు, నీవె, గతి = దిక్కు.

తా. పోషించుటకు తల్లివలెను, దోషములను పొందకుండుటకు తండ్రివలెరక్షింపను, దేహమునందలి పదియింద్రియములనెడు రోగములను తొలగించుటకు వైద్యునివలెను, మేలయినసంపద లియ్యను, నీవే నాకుదిక్కు.

ఉ. కుక్షి నజాండపంక్తులొనఁ ♦ గూర్చి చరాచరజంతుకోటి సం
రక్షణ సేయుతండ్రివి ప ♦ రంపర సీతనయుండనైన నా
పక్షము నీవు గావలదె ♦ పాపము లెన్ని యొనర్చినన్ జగ
ద్రక్షక కర్త వీవెకద ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 41

టీ. కుక్షిఁగ = ఉదరమునందు, అజాండ = బ్రహ్మాండములయొక్క, పంక్తులు = సమూహములు, ఒనఁగూర్చి = పొందిక పఱచి అనుట,

చర = చరించునట్టి చేతనములును, అచర = చరింపని అచేతనములును, జంతు = ప్రాణులయొక్క, కోటిన్ = సమూహమును, రక్షణ = కాపాడుట ను, చేయుతండ్రివి = చేయునట్టితండ్రివి, పరంపరన్ = వరుసగా-తరతరముగా, నీతనయుండను = నీకొడుకను, ఐన = అయినట్టి, నాపక్షము = నాయొక్క పాలిటివాఁడవు, ఎన్నిపాపములు, ఒనర్చినన్ = నేనుచేసినను, నీవు, కావలదె = కావలదా, జగత్ = లోకములను, రక్షణ = రక్షించుట యందు, కర్త = కర్తయైనవాడవు, నీవెకద = నీవేకదా.

తా. కుక్షిలోపల బ్రహ్మాండసమూహములను పొందికగా పెట్టుకొని చేతనములను అచేతనములైన సకలప్రాణిసమూహములను రక్షించునట్టి తండ్రివి కాఁబట్టి తరతరముగ నీకొడుకైయున్ననాపాలిట నీవు పక్షపాతివై యుండవలయును. నేను పాపములు చేసితినని నీవు నన్ను విడువరాదు. ఎన్నిపాపములుచేసినను లోకమెల్ల రక్షించువాఁడవు నీవొక్కఁడవే గనుక నీవే నన్ను కాపాడవలయును.

ఉ. గద్దరియోగిహృత్కమల ♦ గంధరసానుభవంబుఁ జెందు పె
న్నిద్దపుగండుఁదేఁటిధర ♦ ణీసుతకౌఁగలి పంజరంబునన్
ముద్దులుగుల్కురాచిలుక ♦ ముక్తినిధానము రామ రాఁగదే
తద్దయు నేఁడు నాకడకు ♦ దాశరథీకరుణాపయోనిధీ. 42

టీ. గద్దరి = దిట్టలయిన, యోగి = యోగీశ్వరులయొక్క, హృత్ = హృదయమనెడి, కమల = తామరయందలి, గంధ = వాసనతోఁగూడిన, రస = మకరందముయొక్క, అనుభవంబున్ = ఆస్వాదనమును, చెందు = పొందునట్టియు, పెను = మిక్కిలి, నిద్దపు = నిగనిగయనెడి మిసిమిగల, గండు = మదించిన, తేఁటి = తుమ్మెదయైనవాఁడు, ధరణీసుత = సీతాదేవి యొక్క, కౌగిలి = ఆలింగనమనెడి, పంజరంబునన్ = గూఁటియందు, ముద్దులుగుల్కు = మనోజ్ఞముగానుండు, రాచిలుక = రాచచిలుక, ముక్తినిధాన

యము = మోక్షముండెడిచోటు, రామ = శ్రీరామా, నాకడకున్ = నాయొద్దకు, నేఁడున్, రద్దయున్ = మిక్కిలి, రాఁగదే = రమ్మా.

తా. తామరలయందలి తేనెను అనుభవించు తుమ్మెదవలె యోగశీలుర హృదయములందు భక్తిరసమును అనుభవించువాఁడును, గూఁటియందలి రాచిల్కవలె సీతాదేవికౌఁగిలియందు సొంపు గులుకువాఁడును, మోక్షమిచ్చువాఁడును, అగు శ్రీరామా, నేఁడు నాయొద్దకు వేగరమ్మా.

ఉ. కలియుగమర్త్యకోటి నినుఁ ♦ గన్గొన రానివిధంబొ, భక్తవ
త్సలత వహింపవో, చటుల ♦ సాంద్రవిపద్దశ వార్ధిఁ గ్రుంకువోఁ
బిలిచినఁ బల్కవింతమఱ ♦ పే నరు లిట్లన రాదు గాక నీ
తలఁపున లేదె సీతచెఱ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 43

టీ. కలియుగ = కలియుగమందలి, మర్త్యకోటి = మనుష్యసమూహము, నినున్ = నిన్ను, కన్గొనరానివిధంబొ = తెలిసికొనరానివిధమో, భక్తవత్సలతన్ = భక్తులయెడ వాత్సల్యము కలిగియుంటను, వహింపవో = తాల్పవో, చటుల = మిక్కిలి యయిన, సాంద్ర = దట్టమైన, విపత్ = ఆపదయొక్క, దశ = అవస్థ యనెడి, వార్ధిన్ = సముద్రమునందు, గ్రుంకుచోన్ = నేనుమునుఁగునపుడు, పిలిచినన్ = నిన్నుపిలువఁగా, పల్కవు = పలుకవు, ఇంతమఱపే = ఇంతనన్ను మఱచిపోవుటమా, నరులు = నాబోఁటిమనుష్యులు, ఇట్లు = ఈప్రకారము – ఇంతమఱపా అనిఅనరాదుగాక = చెప్పరాదుగాని, నీతలఁపునన్ = నీచింతయందు, సీతచెఱ = రావణునిచేత సీతపొందినచెఱ, లేదె = లేదా.

తా. రామా! నేను మిక్కిలి ఆపత్సముద్రమున మునుఁగుచు నిన్నెంత పిలిచినను మాఱుపలుకవు. ఇదేల. కలియుగమందు మనుష్యులకు కనబడరాదనియా? లేక భక్తజనులయెడ నీకువాత్సల్యము కలుగదా? ఇటులనన్న మ

అచిపోవచ్చునా? నీకు మఱపని మాబోఁటులు చెప్పరాదు. సీతాదేవికి కలిగిన చెఱను మఱవవుగదా. అట్లైమా చెఱను నీకు మఱపు ఎక్కడిది?

చ. జనవర మీకథాళి విన ♦ సైఁపక కర్ణములందు ఘంటికా
నినదవినోదముల్ సలుపు ♦ నీచునకున్ వరమిచ్చినావు ని
న్ననయము నమ్మికొల్చిన మహాత్ములకేమియొసంగెదో సనం
దనసుత మాకొసంగుమయ ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. జనవర = ఓరాజా, మీకథాళి = మీకథలయొక్క, సమూహము, వినన్ = వినుటకు, సైఁపక = ఓర్వక, కర్ణములందున్ = చెవులయందు, ఘంటికా = గంటలయొక్క, నినద = శబ్దములయొక్క, వినోదముల్ = వేడుకలను, సలుపు నీచునకున్ = చేయుచున్న అల్పునికి, వరము = కోరినకోరిక, ఇచ్చినావు, నిన్ను, అనయమున్ = ఎప్పుడును, నమ్మి, కొల్చిన మహాత్ములకున్ = సేవించునట్టి మహనీయులకు, ఏమి, ఒసంగెదో = ఇచ్చెదవో, సనందనసుత = సనందనుఁడు అనుఋషిచేత కొనియాడఁబడినవాఁడా, మాకున్, ఒసంగుమయ = ఇయ్యవయ్యా.

తా. ఓరాజా! మీకథలనువినుటకు ఓర్వక చెవులయందు ఘంటలధ్వనియొక్క వేడుకలను సలుపు నీచునికి కోరినవరము యిచ్చినావు. ఎప్పుడు నినునమ్మిసేవించునట్టి వారికి ఏమియిచ్చెదవో సనందుడను ఋషిచేత కొనియాడబడినవాడా! వారికిచ్చునట్లె నాకును యిమ్ము.

ఉ. పాపము లొందువేళ రణ ♦ పన్నగభూతభయజ్వరాదులం
దాపద నొందువేళ భర ♦ తాగ్రజ మిమ్ము భజించువారికిం
బ్రాపుగ నీవుదమ్ముఁడిరు ♦ పక్కియలం జనితద్విపత్తి సం
తాపము మాన్పి కాతురఁట ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. పాపములు, ఒందువేళన్ = పొందెడి సమయమందు పన్నగ = సర్పము, భూతభయ = భూతములవలన కలుగు భయమును, జ్వర =

జ్వరములు, ఆదులంగుక్ = మొదలయిన వానియందు, ఆపదక్ = విపత్తున, ఒందువేళక్ = పొందుసమయమునను, భరతాగ్రజ = భరతునికి అన్నయైన శ్రీరామా, మిమ్ముక్ = మిము, భజించువారికిక్ = కొలుచువారికి, నీవుక్ = నీవును, తమ్ముఁడు = తమ్ముఁడైన లక్ష్మణుఁడును, ఇరుపక్కియలక్ = రెండుప్రక్కలను, ప్రాపుగక్ = సహాయముగ, చని = పోయి, తత్ = వారియొక్క, విపత్తి = ఆపదచేతనైన, సంతాపముక్ = ఉడుకును, మాన్పి = పోఁగొట్టి, కాతురఁట = కాపాడుదు రందురు.

తా. దశరథరామా ! పాపములు పొందునప్పుడును, యుద్ధము, సర్పములు, భూతములు, జ్వరములు మొదలయినవానిచేత ఆపదగలిగినప్పుడును, నిన్నుగొలుచునట్టివారికి సహాయము సేయబోయి నీవును, నీతమ్ముఁడైన లక్ష్మణుఁడును రెండుప్రక్కలనిలిచి వారియాపదలను పోఁగొట్టి రక్షింతురని లోకులు చెప్పుదురు. కాఁబట్టి నన్నును కాపాడవలయును.

చ. అగణితజన్మకర్మ దురి ♦ తాంబుధిలో బహుదుఃఖవీచికల్
దెగిపడనీఁదలేక జగ ♦ తీధవ నీపదభక్తినావచేఁ
దగిలి తరింపఁగోరితిఁ బ ♦ దంపడి నాదుభయంబు మాన్పవే
తగదని చిత్తమందిడక ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 46

టీ. జగతీధవ = భూనాథా, అగణిత = లెక్కింపరాని, జన్మ = జన్మములందలి, కర్మ = కర్మపరంపరచేఁగలిగిన, దురిత = పాపములనెడి, అంబుధిలోక్ = సముద్రమందు, బహు = అనేకములైన, దుఃఖ = దుఃఖములనెడి, వీచికల్ = అలలను, తెగిపడక్ = కడచునట్లు, ఈఁదలేక = ఈఁదజాలక, పదంపడి = పిమ్మట, నీపదభక్తినావచేక్ = నీయొక్కపాదములందలి భక్తిఅనెడి ఓడచేత, తగిలి = ఆసక్తితోడ, తరింపఁగోరితిక్ = దాటను ఇచ్ఛగించితిని, తగదు అని = తగినదికాదు అని, చిత్తమందు = నీమనస్సునందు,

ఇడక = ఉంచుకొనక, నాభయంబుల్ = నాయొక్క భయమును, పోన్ప వే = పోఁగొట్టుమా.

తా. భూనాథా! లెక్కింపరాని జన్మములందలి కర్మపరంపరచేఁగలిగిన పాపములు సముద్రమువలె అపారమై నాయంతటఁపోగొట్టుకొనుటకు శక్యముగాక, నీయందలిభక్తికలిగి ఈదరానిసముద్రమును ఓడచేనులువుగా దాటునట్లు తొలఁగింపరాని నాపాపములను సులువుగా నీభక్తిచేఁబోగొట్టుకొనగోరితిని. గాన శరణుజొచ్చిన నాయొక్క భయమును పోగొట్టుమా.

ఉ. నేనొనరించుపాపము ల♦ నేకము లైనను నాదుజహ్వకుం
బానకమయ్యె మీపరమ♦ పావననామము దొంటిచిల్క రా
మా ననుఁగావుమన్న తుది♦మాటకు సద్గతిఁజెందెగావునన్
దానిధరింపఁ గోరెదను ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 47

టీ. నేను, ఒనరించు పాపములు = చేయఁబట్టిపాపములు, అనేకములు = పెక్కులు, ఐనను, నాదుజిహ్వకున్ = నాయొక్కనాలుకకు, మీ పరమపావననామము = మీయొక్కమిక్కిలి పవిత్రమైన పేరు, పానకము అయ్యెన్ = పానకమువలె రుచియైనదని. తొంటిచిల్క = పూర్వకాలపుచిలుక, రామా, నన్నున్ కావుము = నన్ను రక్షింపుము, అన్న తుదిమాటకున్ = అనిపలికినట్టి కడపటి పలుకునకు, సద్గతిన్ = మోక్షమును, చెందెన్ = పొందెను, కావునన్ = కనుక, దానిన్ = ఆరామనామమును, ధరింపన్ కోరెదను = తాల్చుటకు ఇచ్ఛగించెదను.

తా. దశరథరామా! పాపములనేకములు నేను చేయుచున్నవాఁడను. ఇట్టిపాపాత్ముఁడనైనను నీదివ్యనామము ఉచ్చరించుటకు నానాలుకకు పానకమువలె మిక్కిలి రుచ్యమైనది. ఎట్లనఁగా పూర్వమొకచిలుక 'రామా నన్నుఁగావుము' అనికడపట నొకమాట చెప్పగానే మోక్షము నొందెను గదా. అట్టిస్థితిని యిచ్చునది గావున నాకు అతిరుచిగల నీనామమును ధరించెదను.

చ. పరధనముల్ హరించి పర♦భామల నంటి పరాన్న మబ్బినన్
మురిపముకాని మీఁదనగు♦మోసమెఱుంగదుమానసంబు దు
స్తర మిది కాలకింకర గ♦దాహతిపాల్పడ నీకమమ్ము నే
తఱి దరిఁ జేర్చి కాచెదవొ♦దాశరథీ కరుణాపయోనిధీ. 48

టీ. పరధనముల్ = యితరులధనములను, హరించి = అపహరించి, పరభామలన్ = ఇతరులయిల్లాండ్రను, అంటి = తాఁకి, పరాన్నము = ఇతరుల కూడు, అబ్బినన్ = దొరకఁగా మురిపము కాని = విలాసమేకాని, మీఁదన్ = పిమ్మట, అగుమోసము = కలుగునట్టిమోసమును, మానసంబు = మనస్సనకు, ఎఱుఁగదు = తెలియదు, ఇది = ఇట్లు తెలియకుండుట, దుస్తరము = తరింపరానిది, కాలకింకర = యమదూతలయొక్క, గదా = గదిలయొక్క, హతి = దెబ్బలయొక్క, పాలు = ఆధీనత, పడనీక = పొందనీయక, మమ్మున్, ఏతఱిన్ = ఎప్పుడు, దరిజేర్చి కాచెదవో = రక్షింతువో.

తా. దశరథరామా! పరులధనములను దొంగిలించుట పరస్త్రీలను గూడుట, పరాన్నమును దినుట మొదట సుఖముగా నుండినను వెనుక నరకము కలిగించును. ఇది మనస్సుకు తెలియదు. మనస్సును జయించుట కష్టము గనుక మనస్సుపోయినదారిని పోయి నరకమున బడకుండునట్లు మమ్ము నెప్పుడు కడతేర్చికాపాడెదవో.

ఉ. చేసితి ఘోరకృత్యములు ♦ చేసితి భాగవతాపచారముల్
చేసితి నన్యదైవములఁ ♦ జేరిభజించినవారిపొందు నేఁ
జేసిన నేరముల్ దలఁచి♦ చిక్కులు బెట్టకు మయ్యయయ్య నీ
దాసుడనయ్య భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 49

టీ. ఘోరకృత్యములు = భయంకరములైన కార్యములను, చేసితిని, భాగవతాపచారముల్ = భాగవతజనులయెడ అపరాధములను, చేసితిని, అన్యదైవములన్ = ఇతరదేవతలను, చేర = ఆశ్రయించి, భజించినవారి పొం

దుక్ = కొలిచినట్టివారి సాంగత్యమును, చేసితిని, నేన్ = నేను, చేసిన నేరముల్ = కావించినట్టితప్పులను, తలఁచి = ఎంచి, చిక్కులన్ పెట్టకుము అయ్యా = సంకటములందు తగల్పకుమయ్యా, అయ్య = అయ్యా, నీదానుఁడను అయ్యా = నీయొక్క దాసుఁడను.

తా. దశరథరామా ! నేనుఘోరమైన కార్యములను జేసితిని ; భాగవతులకు అపచారములు చేసితిని ; అన్య దైవములను గొలుచువారితో సాంగత్యము జేసితిని. నేను చేసినట్టితప్పులను తలఁచి సంకటములు పెట్టవద్దు. నేను నీకుదాసుడను.

చ. పరులధనంబుఁజూచి పర ♦ భామలఁజూచి హరింపఁగోరు మ
ద్గురుతరమానసంబనెడు ♦ దొంగనుబట్టి నిరూఢదాస్యవి
స్ఫురితవివేకపాశములఁ ♦ జుట్టి భవచ్చరణంబనెడు
త్తరువునఁ గట్టివేయఁగదె ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 50

టీ. పరులధనంబున్ = ఇతరులసొత్తును, చూచి, పరభామలన్ = స్త్రీలను, చూచి, హరింపన్ = అపహరించుటకు, కోరునట్టి, మత్ = నా యొక్క, గురుతర = మిక్కిలిగొప్పదైన, మానసంబు = మనస్సు, అనెడుదొంగను = అనునట్టిదొంగను, పట్టి = పట్టుకొని, నిరూఢ = మిక్కిలి పెరిఁగిన దాస్య = కైంకర్యమునందు, విస్ఫురిత = మిక్కిలిప్రకాశించిన, వివేక = తెలివి యనెడి, పాశములన్ = త్రాళ్ళచేత, చుట్టి = బంధించి యనుట, భవచ్చరణంబు = నీపాదము, అనే మరుత్ తరువున్ = అనెడి దేవతావృక్షమున కట్టి వేయన్ కదె = బంధించివేయుమా.

తా. ఇతరులసొత్తులను చూచి, స్త్రీలనుచూచి అపహరించుటకు కోరునట్టినాయొక్కమనస్సు అనునట్టి దొంగనుపట్టుకొని నీయొక్క కైంకర్యము ప్రకాశించునట్టి తెలివియనెడి కల్పవృక్షమునకు గట్టివేయుము.

చ. సలలితరామనామజప ♦ సార మెఱుంగను, గాశికాపురీ
నిలయుఁడ గానుఁ మీచరణ ♦ నీరజరేణు మహాప్రభావముం
దెలియనహల్యగాను జగ ♦ తీవర నీదగుసత్యవాక్యముం
దలఁపఁగ రావణాసురుని ♦ తమ్ముఁడఁగాను భవద్విలాసముల్
తలఁచి నుతింప నాతరమె ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 51

టీ. సలలిత = మిక్కిలిఒప్పుచున్న, రామనామ = రామనామము యొక్క, జప = జపముయొక్క, సారము = సత్త్వువును, ఎఱుంగను = తెలియుటకు, కాశికాపురీనిలయుఁడను = కాశీపట్టణము వాసస్థానముగాఁ గలశివుఁడను, కాను. మీచరణనీరజ = మీపాదపద్మములయొక్క, రేణు = దుమ్ముయొక్క, మహాప్రభావము = గొప్పమహత్త్వమును, తెలియఁగ = తెలియుటకు, అహల్యను కాను = అహల్యనుకానేరను. జగతీవర = భూనాథా! నీదగుసత్యవాక్యముఁ = నీదైనట్టి నిజమైనమాటను, తలపఁగఁ = ఎన్నుటకు, రావణాసురునితమ్ముఁడను = విభీషణుఁడను, కాను. భవత్ విలాసముల్ = నీయొక్క మహాత్త్వపువైచిత్ర్యములు, తలఁచి = ఎన్ని, నుతింపఁ = పొగడుటకు, నాతరమె = నాకుశక్యమా.

తా. దశరథరామా! నీ నామమును జపముసేయుటవలనిపస శివునికే తెలియునుగాని నాకు తెలియదు. నీపాదధూళి యొక్క ప్రభావము అహల్యకే తెలియును. నీసత్యసంధత్వము విభీషణునికే తెలియును. కానినీలీలలు నాబోటికి తెలిసి వర్ణించుటకు అలవికాదు.

ఉ. పాతకులైనమీకృపకుఁ ♦ బాత్రులు కారె తలంచిచూడఁగఁ
జ్రాతికిఁగల్గెఁ భావన మ ♦ రాతికి రాజ్యసుఖంబు గల్గె దు
ర్జాతికిఁబుణ్యమబ్బెఁగపి ♦ జాతిమహత్త్వము నొందె గావునన్
దాతవమెట్టివారలకు ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 52

టీ. పాతకులైనన్ = పాపాత్ములైనను, మీకృపన్ = మీదయను, పాత్రులకారె = అర్హులే కారా, తలంచిచూడన్ = ఎన్నిచూడఁగా, పాతకులు నీదయకుపాత్రులో కారోయని విచారించిచూడఁగా ననుట, చట్రాతికిన్ = చట్టుబాయిగానున్న అహల్యకనుట, పావనము=పవిత్రత్వము, కల్గెన్ = కలిగెను, అరాతికిన్ = శత్రువైన విభీషణునికి, రాజ్యసుఖంబు = రాజ్యప్రాప్తిచే నెడుసుఖము, కల్గెన్ = కలిగెను, దుర్జాతికి=నీచజాతులవారికిని పుణ్యము = సుకృతము, అబ్బెన్ = లభించెను, కపిజాతి = వానరజాతి, మహత్త్వము = మహిమను, పొందెన్ = ఒందెను, కావునన్ = కనుక, ఎట్టివారలకున్ = ఎంతటివారలకైనను, దాతవ = కోరినకోర్కెలు ఇచ్చువాఁడవే.

తా. దశరథరామా! పాపాత్ములయినను మీకృపకు పాత్రులైయున్నారు. ఎట్లనఁగా రాయిగానుండిన అహల్య నీపాదరజముచే నిజరూపము నొంది కృతార్థురాలైనది. పగవారివర్గములోఁ జేరిన విభీషణుఁడు నీవలన లంకారాజ్యమునొందినాఁడు. జటాయువు శబరి మొదలయిన తక్కువజాతులకును నీయనుగ్రహము గలిగినది. సుగ్రీవాదులైన వానరులకు గూడమహత్వము గలిగినది. ఇవన్నియుఁజూడఁగా నీవు ఎక్కువలు తక్కువలు పాటింపక ఎట్టివారికైన కోరినకోర్కెలనిచ్చుదాతవని తెలియుచున్నది. కాబట్టి నాకోర్కెయు నొసఁగుమా.

ఉ. మామకపాతకవ్రజము ♦ మాన్పనగణ్యము చిత్రగుప్తులే
మేమని వ్రాతురో శమనుఁ ♦ డేమి విధించునో కాలకింకర
స్తోమ మొనర్చుటేమొ వినఁ ♦ జొప్పడ దింతకుమున్నె దీనచిం
తామణియెట్లుగాచెదవొ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 53

టీ. మామక = నాయొక్క, పాతక వ్రజము = పాప సమూహము, మాన్పన్ = పోగొట్టుటకు, అగణ్యము = లెక్కింపరానిది, (చిత్రగుప్తులు = యమునివద్దనుండి జీవుల పుణ్యపాపముల లెక్కలు వ్రాయుచుండు కరణమై

న, ఏమి ఏమి అని = ఏయేవిధముగా, వ్రాతురో = వ్రాయుదురో, శమనుఁడు = యముఁడు, ఏమి = ఏఫలము, విధించునో = ఆజ్ఞాపించునో, కాలకింకరస్తోమము = యమదూతల సమూహము, ఒనర్చుట = చేయుట, ఏమో = ఏదియో, వినఁగ = వినుటకు, చొప్పడదు = సరిపడదు, ఇంతకుమున్నె = దీనికిపూర్వమే, దీనచింతామణీ = దీనులైనవారిని చింతామణివలె కోరికలు ఇచ్చువాఁడా, ఎట్లు = ఏవిధమున, కాచెదవో = కాపాడెదవో.

ఉ. దాసినచుట్టమా శబరి ♦ దానిదయామతి నేలినావు నీ
దాసునిదాసుఁడా గుహుఁడు ♦ తావక దాస్యమొసంగినావు నే
జేసినపాపమో వినుతి ♦ సేసినగావవు గావుమయ్య నీ
దాసులలోన నేనొకఁడ ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. శబరి, దాసిన = దగ్గఱి, చుట్టమా = వియ్యమా, దయామతిన్ = దయతోఁగూడినబుద్ధితో, ఏలినావు = రక్షించినావు, గుహుఁడు, నీదాసునిదాసుఁడా = నీ సేవకుని సేవకుఁడా, తావకదాస్యము = నీదైనదాస్యమును ఒసంగినావు = ఇచ్చితివి, వినుతిన్ = స్తోత్రమును, చేసినన్ = నేనుచేసినప్పటికిని, కావవు = రక్షింపవు, నేన్ = నేను, చేసినపాపమో = చేసికొన్నట్టి దోషమా, నీదాసులలోనన్ = నీ సేవకులలోపల నేను ఒక్కఁడన్ = ఒక్కఁడను, కావవయ్య = రక్షింపుమా.

తా. రామా! శబరినీకు దగ్గఱిచుట్టముకాక పోయినను దానిని దయతోఁగాపాడితివి. గుహుఁడు నీదాసునికి గూడ దాసుడుగాడు. కాకపోయినను దాసునిగా జేసికొంటివి. నేను నీదాసవర్గములో ఒకడుగాను వ్వాడను. మఱియు నిన్ను నేనుస్తోత్రము చేసినను నేనుచేసికొన్న పాపమేమోగాని నన్నుగాపాడవు. ఇకనయినను కాపాడుమా.

ఉ. దీక్షవహించి నాకొలఁది ♦ దీనుల నెందఱిఁ గాచితో జగ
ద్రక్షక తొల్లి యాద్రుపద ♦ రాజతనూజ తలంచినంత నే

యక్షయమైనవల్వ లిడి ♦ తక్కటనా మొఱచిత్తగించి ప్ర
త్యక్షము గావ వేమిటికి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 55

టీ. జగద్రక్షక = జగమును రక్షించువాఁడా, దీక్షన్ = నియమము
ను, వహించి = తాల్చి, నాకొలఁదిదీనులన్ = నన్బోలిన దిక్కులేనివారిని,
ఎందఱిని, కాచితో = కాపాడితివో, తొల్లి = ముందు, ఆద్రుపదరాజత
నూజ = ద్రుపదరాజుకూఁతురైన యాద్రౌపది, తలంచినంతనే = స్మరించినం
తమాత్రముననే, అక్షయము = తఱుఁగనిది. అయినవల్వలు = అయినట్టిచీరలు
ఇడితి = ఇచ్చితివి, అక్కట = అయ్యో, నా మొఱన్ = నామనవిని, చిత్తగిం
చి = ఆలించి, ప్రత్యక్షము = సాక్షాత్తుగా, కావవు ఏమిటికి = ఏలకాపా
డవు.

తా, జగద్రక్షకా ! నీవు ఆశ్రితులను రక్షించునియమమును, పూని
యెందఱిని కాపాడితివో నాకు తెలియదు. నేనువిన్నంతవరకు, పూర్వము
ద్రౌపది దుర్యోధనునిసభలో చీరలు ఒలుచునపుడు నిన్ను స్మరించినంతనే
లెక్కలేని చీరలిచ్చితివఁట. అయ్యో ! నామనవి చిత్తగించి నా మొఱ యా
లించి నన్నేలకాపాడవు.

ఉ. నీలఘనాభమూర్తి వగు ♦ నిన్నుఁగనుంగొనఁ గోరి వేడినన్
జాలము సేసి డాఁగెదవు ♦ సంస్తుతికెక్కిన రామనామ మే
మూలను దాఁచుకోఁగలవు ♦ ముక్తికిఁ బ్రాపది పాపమూలకు
ద్దాలము గాదె మాయెడల ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. నీల = నల్లని, ఘన = మేఘముతో, ఆభ = సాటియైన, మూర్తి
వి = దేహముగలవాఁడవు. అగునిన్నున్ = అయినట్టినిన్ను, కనుంగొనన్ =
చూచుటకు, కోరి = అపేక్షించి, వేఁడినన్ = ప్రార్థింపఁగా, జాలముసేసి=
మాయచేసి, డాఁగెదవు = దాచుకొనెదవు. సంస్తుతికిన్ = పొగడ్తకు, ఎక్కి
నరామనామము = వచ్చినట్టి రామనామము, ఏమూలను = ఏమూలయందు

దాచుకోఁ గలవు = దాచుకొననేర్తువు, అది = ఆరామనామము, మాయెడ లన్ = మావిషయమందు, ముక్తికిన్ = మోక్షమునకు, ప్రాపు = ఊఁతపట్టు, పాప = పాపములయొక్క, మూలవేళ్ళకు, కుద్దాలము = గుద్దలి, కాదె = కదా

తా. రామా! నల్లమేఘమువలె నీవిగ్రహమును కన్నారఁజూడవల యునని యెంత ప్రార్థించినను మాయముచేసి, దాఁచుకొనెదవు: మంచిది! నీవుదాగినను ప్రసిద్ధమైవ్యాపించియున్న నీరామనామమును నీవు ఎక్కడ దాఁచిపెట్టుకొనలేవు. మాపాపములను, గుద్దలి వేళ్ళను పెల్లగించునట్లు, స మూలముగాఁ బోగొట్టి మోక్షమిచ్చుటకు అదియొకటియే కాన అదియేచా లును.

చ. వలదు పరాకుభక్తజన ♦ వత్సల నీచరితంబు వమ్ముగా
వలదు పరాకు నీబిరుదు ♦ వజ్రమువంటిది కావ కూరకే
వలదు పరాకు నాదురిత ♦ వార్ధికి దెప్పవుగా మనంబులోఁ
దలఁతుమెకా నిరంతరము ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 57

టీ. భక్తజన = భక్తసమూహములకు, వత్సల = వాత్సల్యము గలవాఁడా, నీచరితంబు = నీచరిత్ర, వమ్ము = వ్యర్థము, వలదువలదు = కాకుండనిమ్ము పరాకు = ఎచ్చరిక, నీబిరుదు = ఆశ్రితరక్షకుఁడు అనెడి నీబిరుదము — వజ్ర మువలెగట్టిది. కావక = (మమ్ము)రక్షింపక, ఊరకే = వ్యర్థముగా, వలదు = వద్దు, పరాకు = ఎచ్చరిక, నాదురితవార్ధికిన్ = నాపాప సముద్రమునకు, తె ప్పవుగాన్ = తెప్పగా, మనంబులోన్ = మనస్సునందు, నిరంతరము = ఎప్పుడును, తలతుమెకా = తలంతుముసుమా,

తా. భక్తులయందు దయగలవాఁడా! ఆశ్రితరక్షణాదులు దెలుపు నీచరిత ములును, ఆశ్రితరక్షకుడని వజ్రమువలె అభేద్యమైన నీబిరుదును వ్యర్థమగును. అట్లు చేయవలదు. జాగ్రత్తసుమీ! నిన్ను, సముద్రమును దాఁటించు తెప్ప వలెనాపాపములను పోగొట్టు వానినిగా మనసులో ఎప్పుడును తలంతును.

ఉ. తప్పు లెఱుంగలేక దురి ♦ తంబులు సేసితి నంటి నీవు మా
యప్పవు గావుమంటి నిఁక ♦ నన్యులకున్ నుదురంట నంటినీ
కొప్పిద మైన దాసజను ♦ లొప్పినబంటుకు బంటనంటి నా
తప్పుల కెల్ల నీవె గతి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 58

టీ. తప్పులు = దోషములను, ఎఱుంగలేక = తెలిసికొనలేక దురితంబులు = పాపములను, చేసితిన్ అంటి = చేసినాను అని చెప్పితిని. నీవు మాయప్పవు = నాతండ్రివి, కావుము, అంటి=రక్షింపుమని చెప్పితిని, ఇకన్, అన్యులకున్ = ఇతరులకు, నుదురు = నెత్తిని, అంటను, అంటి = తాకనుఅనిచెప్పితిని, నీకుఒప్పిదమైన = తగినట్టివారైన, దాసజనులు = సేవకసమూహములు, ఒప్పిన బంటుకున్ = సమ్మతించి స్వీకరించిన సేవకునికి, బంటను అంటి = సేవకుఁడను అంటిని, నాతప్పులకున్ ఎల్లన్ = నాఅన్నిదోషములకును, నీవె, గతి = దిక్కు.

తా. దశరథరామా ! దోషములని తెలిసికొనలేక పాపములు చేసితి· నీవు మాతండ్రివి ; రక్షింపుము. ఇకమీద ఇతరులకు నుదురు తాకి యంజలి సేయను. దాసులకు దాసుఁడను అనినీతోచెప్పికొంటిని. ఇకనీదాసుల తప్పులెట్లో అట్లేనీదాసులకు దాసుఁడనైన నాతప్పులను దీర్చు దిక్కు నీవేసుమీ.

చ. ఇతఁడు దురాత్ముఁడంచుజను ♦ లెన్నగనాఱడిఁగొంటినేనెపో
పతితుఁడనంటినో పతిత ♦ పావనమూర్తివి నీవుగల్గ నే
నితరుల వేఁడనంటినిహ ♦ మిచ్చిన నిమ్ము పరంబొసంగు
మీయతులితరామనామమధు ♦ రాక్షరపాళి నిరంతరంబు
హృద్గత మని నమ్మికొల్చెదను ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. ఇతఁడు = వీఁడు, దురాత్ముఁడు అంచున్ = దుష్టమనస్సు గలవాఁడు అనుచు, జనులు = లోకులు, ఎన్నగన్ = తలఁపఁగా, ఆఱడిన్ కొం

టిని = నిందపడితిని, నేనెపో = నేనేసుమీ, పతితుఁడను, అంటి = పాపాత్ముఁడను అనిచెప్పితిని. ఓ = రామా! పతిత = పాపాత్ములైనవారిని, పావన = పవిత్రులను జేయునట్టి మూర్తివిఅగు, నీవు, కల్గన్ = కలిగియుండఁగా, నేను, ఇతరులన్ = అన్యులను, వేఁడను అంటిన్ = ప్రార్థింపను అనిచెప్పితిని, ఇహము = ఇహలోకసుఖము, ఇచ్చినన్ = ఇచ్చితివేని, ఇమ్ము, పరంబు = ఇహలోకసౌఖ్యమును, ఒసంగుమీ = ఇచ్చువనైన ఇమ్ము, అతులిత= సాటిలేని, రామనామ = 'రామ' అనెడిపేరుయొక్క, మధుర = తీయనైన అక్షర = అక్షరములయొక్క, పాళి = సమూహము, నిరంతరంబు = ఎప్పుడును, హృద్గతము = మనస్సును బొందినది, నామనస్సునందే యుండునది, అని, నమ్మి కొల్చెదను = సేవించెదను.

తా. నేను దుష్టమనస్సు గలవాఁడనని జనులచేతనిందఁపడితిని, నాయంతట నేనే పతితుఁడ నని నీతో చెప్పికొంటిని. పతితులను పవిత్రులనుగాఁ జేయునవతరించి నీ వుండఁగా పతితుఁడనైననేను నిన్నే వేఁడుదునుగాని మఱియొకరిని వేఁడ ననియు, చెప్పితిని. ఇకనీవొకడవేనాకు స్వామివిగనుక ఇహమిచ్చినను నీవయి య్యవలయును. నేనుమాత్రము నాయంతకు 'రామ' యనెడి తీయనియక్షరములను మనస్సునందు నిలుపుకొని కొలువు చేసెదను.

ఉ. అంచిత మైననీదుకరు ♦ ణామృతసారము నాదుపైని బ్రో
క్షించినఁ జాలు దాన నిర ♦ సించెద నాదురితంబులెల్లఁదూ
లించెద వైరివర్గ మెడ ♦ లించెదఁ గోర్కుల నీదుబంటనై
దంచెదఁ గాలకింకరుల ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 60

టీ. అంచితము = ఒప్పువది, ఐననీదుకరుణా = అయినట్టినీదయ అనెడి, అమృతసారము = అమృతముయొక్కతేట, నాదుపైని = నామీఁద, ప్రోక్షించినన్ = చల్లినయెడల,చాలున్ = అదియే చాలును, దానన్ = దానిచేత, నాదురితంబులు ఎల్లన్ = నాపాపములను అన్నిటిని, నిరసించెదన్ = తిర

స్కరించెద, వైరివర్గము = శత్రుసమూహమును, తూలించెదన్ = చెడునట్లుచేసెద, కోర్కులన్ = రాగములను, ఎడలించెద = విడిచిపోవునట్లుచేసెద, నీదుబంటను ఐ = నీదాసుండనై, కాలకింకరుల్ = యమదూతలను, దంచెద = కొట్టి తరిమెద.

తా. రామా ! ఒప్పిదమైననీదయామృతసారమును నామీఁదఁజల్లిన చాలును. దానిచేతనే నాపాపములను దూలించి, అంతశ్శత్రువు లయినయింద్రియములను చిక్కఁబట్టి, రాగద్వేషములను వదలి, నీదాసుండనై యమకింకరులు వచ్చిరేని కొట్టి తఱిమెదను.

చ. జలనిధు లేడు నొక్కమొగిఁ ♦ జక్కికిదెచ్చె శరంబు, ఱాతినిం
పలరఁగఁ జేసె నాతిగఁ బ ♦ దాబ్జపరాగము, నీచరిత్రముం
జలజభవాదినిర్జరులు ♦ సన్నుతిసేయఁగ లేరు గావునం
దలఁప నగణ్య మయ్యె యిది ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. శరంబు = నీబాణము, జలనిధులు ఏడుఁన్ = ఏడుసముద్రములను, ఒక్కమొగిన్ = ఒక్కసారిగా, చక్కికిన్ = ఒక్కచోటికి, తెచ్చెన్ = తెచ్చెను, పదాబ్జ = తామరలవంటి నీయడుగులయొక్క, పరాగము = ధూళి, ఱాతిన్ = ఱాతిని, ఇంపు = మనోజ్ఞత, అలరంగన్ = ఒప్పునట్లుగా, నాతిగన్ = స్త్రీగా, చేసెను, నీచరిత్రమున్ = నీచరితమును, జలజభవ = బ్రహ్మ, ఆది = మొదలుగాఁగల, నిర్జరులున్ = దేవతలును, సన్నుతిసేయఁగన్ = స్తోత్రముచేయఁగా, లేరు, కావునన్ = కనుక, తలఁపన్ = విచారింపఁగా, అగణ్యము = గణుతింపరానిది.

తా. రామా ! నీబాణము సప్తసముద్రలను ఒక్కచోటికి తీసికొనివచ్చినది. నీపాదపద్మముల రజస్సు ఱాతిని స్త్రీగాఁ జేసినది. ఇట్టినీచరిత్రము బ్రహ్మాదుల కయినను పొగడ శక్యముగాదు గావున దానిని గణుతింప సాధ్యమా ? కాదు.

ఉ. కోఁతికి శక్యమా యసుర ♦ కోటుల గెల్వను గెల్చెఁబో నిజం
బాతని మేన శీతకరుఁ ♦ డౌట దవానలుఁ డెట్టివింత ! మా
సీతపతివ్రతామహిమ ♦ సేవకుభాగ్యము మీకటాక్షముల్
ధాతకు శక్యమా బొగడ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 62

టీ. అసురకోట్లను = కోట్లకొలఁది రాక్షసులను, గెల్వను = గెలుచుటకు, కోఁతికిన్ = ఒకకోఁతికి, శక్యమా = తరమా, గెల్చెన్ పో = గెలువనీ, అతని మేనన్ = ఆవానరుని దేహమునందు, దవానలుఁడు = కాఱుచిచ్చు, శీతకరుఁడు = చంద్రుఁడు, ఔట = అగుట, ఎట్టివింత = ఎంతటి యాశ్చర్యము - మాసీత=మాతల్లియైన సీతాదేవియొక్క, పతివ్రతా = పాతివ్రత్యముయొక్క, మహిమ = గొప్పతనమును, సేవకుభాగ్యము = మిమ్ము సేవించు వానియొక్క భాగ్యవిశేషమును, మీకటాక్షముల్ = మీయొక్క దయను, పొగడన్ = స్తుతించుటకు, ధాతకున్ = బ్రహ్మదేవునికి, శక్యమా = తరముకాదు.

తా. రామా ! ఒకకోఁతి భయంకరులైన రాక్షసులను కోట్లకొలఁదిని గెలుచుట శక్యముకాదు. అది యెట్లో శక్యమైనను కానిమ్ము. కాని, అతనితోకయందు అంటించిన నిప్పువేఁడిమి చూపక చల్లనగుట మఱియు నాశ్చర్యము. ఇంతకు సీతయొక్క పాతివ్రత్యప్రభావమును మీయిరువురిని సేవించినవానిభాగ్యమును మీ కరుణాకటాక్షములును కారణము గనుక ఈమూఁటిని బ్రహ్మదేవునకు పొగడఁదరముకాదు. మఱినాబోఁటులు ఏమని వర్ణింపఁగలరు.

ఉ. భూపలలామ రామ రఘు ♦ పుంగవ రామ త్రిలోకరాజ్యసం
స్థాపనరామ మోక్షఫల ♦ దాయకరామ మదీయపాపముల్
పాపఁగదయ్య రామ నినుఁ ♦ బ్రస్తుతి సేసెద నయ్య రామ సీ
తాపతిరామ భద్రగిరి ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 63

టీ. భూపలలామ = రాజులకు శ్రేష్ఠుఁడవైన, రామ = రామా, రఘుపుంగవ = రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడవగున, రామ = రామా, త్రిలోక = ముల్లోకములయొక్క, రాజ్య = రాజ్యమును, సంస్థాపన = స్థాపించినట్టి, రామ = రామా, మోక్ష = మోక్షమనెడి, ఫల = ఫలమును, దాయక = ఇచ్చునట్టి, రామ = రామా, సీతాపతిరామ = సీతకు పెనిమిటి యైన రామా, నిన్నుఁ బ్రస్తుతిసేసెద = స్తుతించెదను, మదీయపాపముల్ = నాపాపములను, రామ = రామా, పాపవయ్య = పోఁగొట్టుమా.

తా. రామా! నీవు రాజులలోనెల్ల శ్రేష్ఠుఁడవు. మఱి రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడవు. కేవలము రాజశ్రేష్ఠుఁడవే కాదు. ముల్లోకములను కుదురుగానుండునట్లు ఏలునట్టిదిట్టవు. వానికంటె మిక్కిలి అతిశయమోక్షఫలమును యిచ్చువాఁడవు. అన్నిటికిని అతిశయించిన లక్ష్మీస్వరూపయగు సీతాదేవికి భర్తవు. ఇట్టి మితిలేని అతిశయమును గలవాఁడవు గావున కోరినకోర్కె లియ్యవచ్చును. తెలిసినంతవఱకు నిన్నుఁ బొగడెదను. ఆపొగడ్తను బట్టియైనను, నాపాపములను పోఁగొట్టి నన్నుఁ గాపాడుము.

ఉ. నీసహజంబు సాత్త్వికము నీ ♦ విడిపట్టు సుధాపయోధి, ప
ద్మాసనుఁ డాత్మజుండు, కమ♦లాలయ నీప్రియురాలు, నీకు సిం
హాసన మిద్ధరిత్రి, గొడు♦గాకస, మక్షులు చంద్రభాస్కరుల్,
నీసుమతల్ప మాదిఫణి, ♦ నీవె సమస్తముఁ, గొల్చునట్టి నీ
దాసులభాగ్య మెట్టిదయ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 64.

టీ. సాత్త్వికము = సత్త్వగుణము, నీసహజంబు = నీకు, సహజమైనది, సుధాపయోధి = పాలసముద్రము, నీవిడిపట్టు = నీయొక్క విడిదిచోటు, ఆత్మజుండు = నీకొడుకు, పద్మాసనుఁడు = బ్రహ్మ, నీప్రియురాలు, కమలాలయ = లక్ష్మీదేవి, ఈధరిత్రి = ఈభూమి, నీకు, సింహాసనము, ఆకసము = ఆకాశము, గొడుగు, చంద్రభాస్కరులు = చంద్రుఁడును సూర్యుఁ

డును, అక్షులు = కన్నులు, ఆదిఫణి = ఆదిశేషుఁడు, నీసురతల్పము = నీ పూవుపాన్పు, సమస్తముకా = సర్వపదార్థములును, నీవె = నీవే, ఇట్టినిన్ను, కొల్చినట్టి = సేవించునట్టి, నీదాసుల = నీ దాసజనులయొక్క, భాగ్యము = పెంపుసొంపు, ఏట్టిదయా = ఎట్టిదయ్యా.

తా. రామా! సత్వగుణము నీస్వభావము. నీవిడిది పాలసముద్రము. నీకొడుకు బ్రహ్మదేవుఁడు, నీభార్య లక్ష్మి, ఈభూమి నీసింహాసనము, ఆకాశము నీగొడుగు, నీకన్నులు చంద్రసూర్యులు, ఆదిశేషుఁడు నీపూఁబాన్పు, అన్నియు నీసొమ్మే యగును. సర్వమునకును స్వామి వయిననిన్నుఁ గొల్చినభక్తులభాగ్యము ఎట్టిదో చెప్పఁదరమా?

చ. చరణము సోఁకినట్టిసిల ♦ జవ్వనిరూపగు టొక్కవింత, సు
స్థిరముగ నీటిపై గిరులు ♦ దేలిన దొక్కటివింత, గాని మీ
స్మరణఁ దనర్చుమానవులు♦సద్గతిఁ జెందిన దెంతవింత? యీ
ధరను ధరాత్మజారమణ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 65

టీ. ధరాత్మజా = సీతాదేవికి, రమణ = పురుషుఁడైనవాఁడా, చరణముకా = నీపాదమును, సోఁకినట్టిశిల = తాఁకినట్టిఱాయి, జవ్వనిరూపు = యౌవనముగల స్త్రీయొక్కరూపము అగుట, ఒక్కవింత = ఒక యాశ్చర్యము, నీటిపైకా = నీటిమీఁద, గిరులు = కొండలు, సుస్థిరముగకా = మిక్కిలినిలుకడఁగా, తేలినది = తేలుచుండినది, ఒక్కటివింత = మఱియొక ఆశ్చర్యము, కాని, మీస్మరణకా = మిమ్ము స్మరించుటయందు, తనర్చుమానవులు = ఒప్పునట్టిమనుష్యులు, సద్గతికా = మోక్షమును, చెందినది = పొందినది, ఈధరకా = ఈభూమియందు, ఎంత వింత = ఎంత ఆశ్చర్యము.

తా. రామా! పాదములకు తాఁకిన రాతిని స్త్రీగాఁజేయుటయు కొండలను నీళ్ళమీఁద మునుఁగకుండునట్లు నిల్పుటయు, యాశ్చర్యములు

చేసినవిన్ను స్మరించినవానికి నీవు మోక్షమునొసఁగుట ఒకయాశ్చర్యము కానేరదు.

ఉ. దైవము తల్లిదండ్రి తగు♦భ్రాత గురుండు సఖుండు నిన్నె కా
భావన సేయుచున్నతఱిఁ ♦ బాపము లెల్ల మనోవికారదు
ర్భావితుఁ జేయుచున్నవి కృ♦పామతివై నను(ఁ గావుమీ జగ
త్పావనమూర్తి భద్రగిరి♦దాశరథీ కరుణాపయోనిధీ. 66

టీ. జగత్పావనమూర్తి = లోకములను పవిత్రము చేయురూపముగల వాఁడా, దైవముతల్లి, తండ్రి, తగుభ్రాత = తగునట్టిభ్రాత, గురుండు = గురువు, సఖుండు = స్నేహితుఁడు, నిన్నె = నీవే, కాఁగ = అగునట్టు, భావనసేయుచున్నతఱిఁ = భావించుచున్న సమయమునందు, పాపములు ఎల్లఁ = పాపములన్నియును, మనో = మనస్సుయొక్క, వికార = వికారముచేత, కృపామతి వి అయి = దయగలమనస్సు గలవాఁడవై, నన్నుఁ, కావుమీ = రక్షింపుమా.

తా. రామా! నేను దైవముగాను, తల్లిదండ్రులుగాను, గురువుగాను, స్నేహితుఁడుగాను, భావించుచుండఁగా నాపూర్వపాపములన్నియుఁ జేరి నామనస్సును కలఁచి దుష్టభావములు కల్పించి చెఱుపుచున్నవి. లోకులపాపములను బోఁగొట్ట నవతరించినవాఁడవు, కనుక నాపాపములను బోనణచి నన్ను కాపాడుమా.

ఉ. వాసవరాజ్యభోగ్యసుఖ ♦ వార్ధిని దేలు ప్రభుత్వ మబ్బినా
యాసకు మేర లేదు కన ♦ కాద్రిసమానధనంబుఁ గూర్చినం
గాసును వెంటరాదు కని ♦ కానక చేసినపుణ్యపాపముల్
వీసరపోవనీవు పద ♦ వేలకుఁ జాలు భవంబు నొల్ల నీ
దాసుని గాఁగ నేలికొను ♦ దాశరథీకరుణాపయోనిధీ. 67

టీ. వాసవ=ఇంద్రునియొక్క, రాజ్య=దొరతనమును, భోగ=అనుభవించుటవలని, సుఖ=సౌఖ్యము అనెడి, వార్ధిని=సముద్రమందు, తేలు ప్రభుత్వము=తేలునట్టి దొరతనము, లబ్బినా=లభించినప్పటికిని, ఆసకున్, మేరలేదు=మితి కలుగదు, కనకాద్రి=బంగారుకొండతోడ, సమాన=సమానమైన, ధనంబున్=ద్రవ్యమును, కూర్చినన్ = సేకరించినను, కాసును=కాసుకూడ, వెంటరాదు = వెంబడిరాదు, కని= తెలిసియు, కానక = తెలియకయు, చేసిన = చేసినట్టి, పుణ్యపాపముల్, వీసరపోవనీవు = వెలితిపడనియ్యవు, పదివేలకున్ = పదివేల అనర్ధములకును, చాలున్=అవి చాలియుండును. భవంబున్ = పుట్టుకను, ఒల్లన్ = ఇష్టపడను, నీదాసుని గాఁగన్ = నీసేవకునిగా, ఏలుకొను = రక్షింపుము.

తా. రామా! ఇంద్రభోగమును ఇంద్రుని యైశ్వర్యముకలిగినను, ఆశకు మితిలేదు. బంగారు కొండంతధనము కూర్చి పెట్టినను పోవునపుడు ఒక కాసుకూడ వెంట రాదు. తెలిసియో తెలియకయో చేసిన పుణ్యపాపములలో, చుట్టును ఆవరించుకొని కొంచెమైనను తప్పించుకొనుటకు అవకాశమియవు. మఱియెన్ని యనర్థములయినను కలిగింపఁజాలును. కనుక పుణ్యపాపములు సేసి జన్మము లెత్తుటకు నాకు ఇష్టములేదు. నీదాసునిగా చేపట్టి జన్మము లేకుండఁ గాపాడుమా.

ఉ. సూరిజనుల్ దయాపరులు♦సూనృతవాదులలుబ్ధమానవుల్
వీరపతివ్రతాంగనలు ♦ విప్రులు గోవులు వేదముల్ మహీ
భారముఁ దాల్పఁగా జనులు ♦ పావన మైనపరోపకారస
త్కార మెఱుంగ లే రకట ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. సూరిజనుల్ = పండితసమూహములును, దయాపరులు = దయగలవారును, సూనృతవాదులు = సత్యముపలుకువారును, అలుబ్ధమానవుల్ = లోభము లేనిమనుష్యులును, వీరపతివ్రతాంగనలు= వీరత్వముతో పతివ్రతలై

యందుం స్త్రీలును, విప్రులు=బ్రాహ్మణులును, గోవులు, వేదములు, మహీభారము=భూమియొక్క బరువును, తాల్పఁగాన్ = ధరింపఁగా, జనులు = సామాన్యులైనతక్కినజనులు, పావనము=పవిత్రము, ఐనపరోపకార, ఐనట్టిపరోపకారమునకు, సత్కారము = సత్కరించుటః, ఎఱుంగలేరు= తెలియలేరు, వారికి ప్రతిసత్కారము సేయ నేరకున్నారనుట. అక్కట=అయ్యో !

తా. రామా ! పండితులు, దయాళువు, సత్యసంధులు, లోభములేని వారు, మిక్కిలి పతివ్రతలయిన స్త్రీలు, బ్రాహ్మణులు, గోవులు, వేదములు ఈభూజనులను ఉద్ధరించుచున్నవి. ఇట్టి ఉపకారపరులను తక్కినజనులు ప్రత్యుపకారముచేసి పూజించుటధర్మము. అయినను అది జనులు తెలియకున్నారు.

ఉ. వారిచరావతారమున ♦ వారిధిలోఁ జొరఁబాఱి క్రోధవి
 స్తారగుఁడైనయానిగమ ♦ తస్కరవీరనిశాచ రేంద్రునిం
 జేరి వధించి వేదముల ♦ చిక్కడలించి విరించికిన్ మహో
 దారత నిచ్చి తీవెకద ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 69

టీ. వారిచర + అవతారమునన్ = మత్స్యమైన అవతారమందు, వారిధిలోన్=సముద్రములోనికి, చొరఁబాఱి= వేగముగాచొచ్చి, క్రోధవిస్తార=మిక్కిలియైనకోపమును, పొంది, నిగమ = వేదములయొక్క, తస్కర=దొంగిలించినవాఁడైన, వీర=వీరుఁడగు, నిశాచర + ఇంద్రునిన్ = రాక్షసశ్రేష్ఠుఁడైన సోమకాసురుని, చేరి=పొంది, వధించి = చంపి, వేదములచిక్కు = వేదములగజిబిజిని, ఎడలించి = తీసి, విరించికిన్ = బహ్మకు, మహా ఉదారతన్=మిక్కిలిదాతృత్వముతో, ఈవె=నీవే, ఇచ్చితికద=ఇచ్చినవాఁడవుగదా-

తా. రామా ! మత్స్యావతారమునందు సముద్రములోపల వేగముగా చొచ్చి మిక్కిలికోపాతిశయము గలిగినవాఁడై వేదములను దొంగిలికొనిపోయిన వీరుఁడైన మేటిరాక్షసుఁడగు సోమకాసురుని పట్టిచంపి వేదములచి

క్కి విడఁదీసి బ్రహ్మకు మరలవానిని మిక్కిలియౌదార్యముతో నిచ్చినవాఁడవు నీవేకాని మఱెవ్వరును గారు. అట్టినీవునన్నును గాపాడఁదగును.

చ. కరమనురక్తి మంథరము ♦ కవ్వముగా నహిరాజు త్రాడుగా
దొరఁకొని దేవదానవులు♦దుగ్ధపయోధి మథించుచున్న చో
ధరణి చలింప లోకములు♦తల్లడ మందఁగఁ గూర్మమైధరా
ధరము ధరించి తీవెకద ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 70

టీ. కరము = మిక్కిలి, అనురక్తిన్ = అనురాగముతో, దేవ = దేవతలును, దానవులు = రాక్షసులును, మంథరము=మంథరపర్వతమును, కవ్వముగాన్, అహిరాజు = సర్పములకు రాజయినవాసుకి, త్రాడుగాన్ = పూని, దుగ్ధపయోధిన్ = పాలసముద్రమును,మథించుచున్నచోన్ = చిలుకుచుండఁగా, ధరణి=భూమి, చలింపన్ = ఐడఁకఁగా, లోకములు = జగములు, తల్లడమందఁగన్ = తల్లడిల్లఁగా, కూర్మమువు = తాఁబేలు అయి, ధరాధరమున్ ఆమంథరపర్వతమును, ఈవె = నీవెధరించితికద = యెత్తితివికదా.

తా. రామా ! దేవతలును రాక్షసులును మంథరపర్వతమును కవ్వముగాను సర్పరాజగువాసునికి కవ్వపుఁద్రాడుగాను జేసి పాలసముద్రమును చిలుకుచుండఁగా అపుడాకొండతటాలున మునుఁగుటచేత భూమి లోకములు తల్లడిల్లుటఁజూచి కూర్మావతారము నెత్తి కొండను వీఁపుమీదఁదాల్చినవాఁడవు నీవే కదా.

ఉ. ధారుణిఁ జాఁపఁ జుట్టినవి♦ధంబునఁ గైకొని హేమనేత్రుఁడ
వ్వారిధిలోన డాఁగినను ♦ వానివధించి వరాహమూర్తివై
ధారుణిఁదొంటికైవడిని ♦ దక్షిణశృంగమునన్ ధరించి వి
స్తార మొనర్చి తీవెకద ♦ దాశరథీకరుణాపయోనిధీ. 71

టీ. ధారుణిన్ = భూమిని, చాఁపన్ = చాఁపను, చుట్టినవిధంబునన్ = మడిచినతీరుగా, హేమనేత్రుఁడు = హిరణ్యాక్షుఁడు, కైకొని = చుట్టి, ఎత్తుకొని, అవ్వారిధిలోనన్ = ప్రసిద్ధమయిన సముద్రమునందు, డాఁగినను = దాఁచుకొనఁగా, వానిన్ = ఆహిరణ్యాక్షుని, వధించి = చంపి, వరాహమూర్తివై = పందియాకారము గలవాఁడవై, (హిరణ్యాక్షుఁడు చుట్టి కొంపోయిన) భూమిని, దక్షిణశృంగమునన్ = కుడికొమ్మునందు, కుడిపంటికొఱయందు, ధరించి = తాల్చి, మఱల చాపుగా, ఈవె = నీవే, ఒనర్చితివి కద = చేసితివిగదా, చేసినవాడవునీవే.

తా. దశరథరామా! హిరణ్యాక్షుఁడు భూమిని చాపచుట్టగాచుట్టి యెత్తికొని సముద్రములోనికిఁ బోయి దాఁచుకొనఁగా, నీవువానిని జంపి, వరాహమూర్తిదాల్చి కుడిపంటికోరతో భూమిని ఎత్తుకొనివచ్చి మునుపటివలె చాపుగా పఱపు నొందియుండునట్లు చేసినవాఁడవు నీవే కాని మఱెవరునుగారు. కనుక నన్నును అట్లనే ఉద్ధరింపుము.

చ. పెటపెట నుక్కుఁగంబమున ♦ భీకరదంతనఖాంకురప్రభా
పటలము గప్పనుప్పతిలి ♦ భండనవీధి నృసింహభీకర
స్ఫుటపటుశక్తి హేమకశి ♦ పున్ విదళించి సురాళిపట్టి నం
తటఁ గృపఁ జూచి తీవె కద ♦ దాశరథీకరుణాపయోనిధీ.

టీ. ఉక్కుకంభమునన్ = ఇనుపస్తంభమునందు, పెటపెట = పెటపెటమని శబ్దించునట్లు, భీకర = భయంకరమైన, దంత = పండ్లయొక్కయు, నఖ + అంకుర = గోటిమొనలయొక్కయు, పటలము = సమూహము, వీధిన్ కప్పన్ = కప్పుకొనఁగా, ఉప్పతిలి = పుట్టి, భండన = యుద్ధప్రదేశమునందు, నృసింహ = నరసింహావతారముయొక్క, భీకర = భయంకరమైనదియు, స్ఫుట = స్పష్టమయినదియు, పటు = కటువైనదియు, అగుశక్తిన్ = సామర్థ్యముచేత, హేమకశిపున్ = హిరణ్యకశిని, విదళించి = చీల్చి,

అంతటన్ = పిమ్మట, సురారిపట్టిన్ = (రాక్షసునికొడుకైన) ప్రహ్లాదుని, కృపన్ = దయతో, ఈవెకా = నీవే,చూచితివేకద = చూచితివేకదా(నృసింహావతారమెత్తి హిరణ్యకశిపునిచీల్చి ప్రహ్లాదుని గాపాడినవాఁడవు నీవేకానితరులెవ్వరును గారు.)

తా. రామా! నీవు ఉక్కుస్తంభమున వెటవెటమని నరసింహమూర్తివై పుట్టి, నీపండ్లయొక్కయు మొగ్గలవంటి గోళ్ళయొక్కయు తెల్లనికాంతులునిన్నుఁ గ్రమ్మఁగా భయంకరమైన శక్తిచే హిరణ్యకశిపుని త్రొమ్మిచీల్చి చంపి పిదప వానికొడుకైన ప్రహ్లాదుని గాపాడినవాఁడవేకదా నన్నును అట్లే గాపాడుము.

చ. పదయుగళంబు భూగగన♦భాగములన్ వెసనూని విక్రమా
స్పద మగునబ్బలీంద్రు నొక♦పాదమునం దలక్రిందనొత్తిమే
లొదవజగత్త్రయంబు బురు♦హూతునకియ్యవటుండవై నచి
త్సదమలమూర్తివీవెకద♦దాశరథీ కరుణాపయోనిధీ. 73

టీ. పదయుగళంబు = పాదముల జంటను, భూ = భూమియొక్కయు, గగన = ఆకాశముయొక్కయు, భాగములన్ = ప్రదేశములందు,(ఒక కాలుభూమియందును, మఱియొక కాలు ఆకాశమందును,) వెసన్ = శీఘ్రముగా, ఊని = నిలిపి, విక్రమ = పరాక్రమమునకు, ఆస్పదము = స్థానము, అగునబ్బలీంద్రున్ = అయినట్టి ఆబలిచక్రవర్తిని, ఒకపాదమునన్ = ఒక కాలిచే, క్రిందన్ = క్రిందుగా, తలన్ = తలను, ఒత్తి=అదిమి, మేలు = శ్రేయస్సు, ఒదవన్ = కలుగఁగా, పురుహూతునకున్ = ఇంద్రునికి, జగత్త్రయంబున్ = లోకములుమూఁటిని; ఇయ్యన్ = ఇచ్చుటకు, వటుండవు = వడుగవు, ఐన, చిత్ = జ్ఞానమును, సత్ = ఉనికియు-లేక సత్యమును, అయిన, అమల = నిర్మలమగు,మూర్తివి = విగ్రహముగలవాఁడవు,నీవెకద = నీవేకాదా.

తా. ఒక పాదము భూమియందును మఱొకటి ఆకాశమునందును పెట్టి యిట్లు రెండుపాదములచే లోకమాక్రమించి మహాపరాక్రమవంతుఁడైన బలిచక్రవర్తితలమీఁద నొకపాదముపెట్టి పాతాళమునకు అడఁగఁద్రొక్కి మేలగునట్లు ముల్లోకములను ఇంద్రునకు యిచ్చుటకై వటువుగా బుట్టిన సచ్చిదానందమూర్తివి నీవేకాని మఱియెవ్వరును గారు. గనుక నన్నుఁగాపాడుమా.

చ. ఇరువదియొక్కమారులు ధర ♦ ణీశుల నెల్లవధించి తత్కళే
బరరుధిరప్రవాహమునఁ ♦ బైతృకతర్పణ మొప్పఁ జేసి భూ
సురవరకోటికిన్ ముదము ♦ సొప్పడ భార్గవరామమూర్తివై
ధరణినొసంగితీవె కద ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 74

టీ. ఇరువదియొక్కమారులు = ఇరువదియొక్క పర్యాయములు, ధరణీశులన్ = రాజులను, ఎల్లన్ = అందఱిని, వధించి = చంపి, తత్ = వారియొక్క, కళేబర = దేహములయొక్క, రుధిర = నెత్తుటియొక్క, ప్రవాహమునన్ = వెల్లువచేత, పైతృకతర్పణము = పితరులకు జలతర్పణము, ఒప్పన్ = తగునట్లు, చేసి, భూసురవరకోటికిన్ = బ్రాహ్మణశ్రేష్ఠుల సమూహమునకు, ముదము = సంతోషము, చొప్పడన్ = కలుగునట్లు, భార్గవరామమూర్తివై = భార్గవరాముఁడుగా అవతరించినవాఁడవై, ధరణిన్ = భూమిని, ఈవె = నీవే, ఒసంగితికద = దానముచేసితివి గదా.

తా. రామా! రాజులనందఱిని ఇరువదియొక్క పర్యాయములు చంపి, వారిదేహముల నెత్తుటివెల్లువలచేత పితరులకుజలతర్పణమిచ్చి వారివద్దనుండి జయించిన భూమిని బ్రాహ్మణసమూహమునకు సంతోషముకలుగునట్లు దానముచేసిన పరశురాముఁడవు నీవే యగుదువు.

చ. దురమునఁ దాటకం దునిమి ♦ ధూర్జటివిల్ దునుమాడి సీతనుం
బరిణయమంది తండ్రి పనుపన్ ఘనకాననభూమి కేఁగి దు

స్తరపటుచండ కాండకులి ♦ శాహతి రావణకుంభకర్ణభూ
ధరములఁ గూల్చితీవెకద ♦ దాశరథీకరుణాపయోనిధీ. 75

టీ. దురమునక్ = యుద్ధమున, తాటకక్ = తాటకను, తునిమి = చంపి, ధూర్జటివిల్ = శివునివిల్లు, తునుమాడి = విఱిచి, సీతన్ = సీతాదేవిని, పరిణయము అంది = పెండ్లాడి, తండ్రి, పనుపన్ = అడవికి పంపఁగా, ఘన = గొప్పదైన, కాననభూమికిన్ = అరణ్య ప్రదేశమునకు, ఏగి = పోయి, దుస్తర = కడవరానిదియు, పటు = పటుత్వముగలదియు, చండ = తీక్ష్ణమైనదియు, అగు, కాండ = బాణమనెడి, కులిశ = వజ్రముయొక్క, ఆహతిన్ = దెబ్బచేత, రావణకుంభకర్ణ = రావణుఁడు కుంభకర్ణుఁడు అను, భూధరములన్ = కొండలను, ఈవె = నీవే, కూల్చితి వెకద = కూలవైచితివికదా.

తా. రామా! యుద్ధమున తాటకను చంపి, శివునివిల్లువిఱిచి, సీతను పెండ్లాడి, తండ్రిపంపఁగా కారడవికిపోయి, వజ్రాయుధముచేత కొండలను గూల్చునట్లు వారింపరాని వాఁడిబాణమున రావణకుంభకర్ణులను గూల్చినవాఁడవు నీవేయగుదువు.

చ. అనుపమయాదవాన్వయసు ♦ ధాబ్ధిసుధానిధి కృష్ణమూర్తినీ
కనుజుఁడుగా జనించి కుజ ♦ నావళి నెల్ల నడంచి రోహిణీ
తనయుఁ డనంగ బాహుబల♦దర్పమునన్ బలరామమూర్తివై
తనరినవేల్పు వీవెకద ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 76

టీ. అనుపమ = సాటిలేని, యాదవ అన్వయ = యాదవవంశము, అనెడి సుధా అబ్ధి = పాలసముద్రమునకు, సుధానిధి = చంద్రుఁడగు (పాలసముద్రమునఁ బుట్టిఁగఁజేయు చంద్రునివలె యాదవవంశమును వర్ధిల్లఁజేయువాఁడై) కృష్ణమూర్తిన్ = కృష్ణుఁడు, నీకున్, అనుజుఁడుగాన్ = తమ్ముఁడు అగునట్లుగా, రోహిణీతనయుఁడు అనఁగన్ = రోహిణీదేవికుమారుఁడు అని జనులాడఁగా, జనించి = పుట్టి, బాహుబల = భుజములబలిమిచేతనైన, దర్పమునన్ =

గర్వముచేత, కుజన + అవళిఁ ఎల్లన్ = దుష్టులసమూహమును అంత యు, అడంచి = అడఁగఁ ద్రొక్కి, బలరామమూర్తివై = బలరామావతార మెత్తినవాఁడవై, తవరినవేల్పవు = ఒప్పునట్టిదేవుఁడవు, ఈవె కద = నీవే కదా.

తా. రామా! యాదవవంశతిలకుఁడైన కృష్ణుఁడు తమ్ముఁడుగా, రో హిణీదేవికడుపునఁబుట్టి భుజబలాతిశయముచేత దుష్టసమూహముల నెల్లరూ పుమాపి బలరాముఁడుగా నవతరించినదేవుఁడవు నీవేయగుదువు.

చ. సురలునుతింపఁగాఁ ద్రిపుర♦సుందరులన్ వరియింపబుద్ధరూ
పరయఁగఁదాల్చి తీవు త్రిపు♦రాసురకోటి దహించునప్పుడా
హరునకుఁ దోడుగా వరశ♦రాసనబాణముఖోగ్రసాధనో
త్కర మొనరించి తీవె కద♦దాశరథీకరుణాపయోనిధీ. 77

టీ. అరయఁగన్ = విచారింపగా, సురలు = దేవతలు, నుతింపఁ గాన్ = పొగడఁగా, త్రిపురసుందరులన్ = త్రిపురములందలి స్త్రీలను, వరి యింపన్ = వరించుటకై, బుద్ధరూపు = బౌద్ధమూర్తిని, ఈవు = నీవు, తాల్చితి = ధరించితివి, త్రిపుర = త్రిపురములలోవసించు, అసురకోటికిన్ = రాక్షస సమూహమును, దహించునప్పుడు, ఆహరునకున్ = శివునకు, తోడు గాన్ = సాహాయ్యముగా, వర = శ్రేష్ఠమైన, శరాసన = విల్లు, బాణ = బాణము, ముఖ = మొదలైన, ఉగ్ర = భయంకరమగు, సాధన = పరికరము యొక్క, ఉత్కరము = సమూహము, ఈవే = నీవే, ఒనర్చితికదా = చేసితి వికాదా.

తా. దేవతలు ప్రార్థింపఁగా త్రిపురములందలి స్త్రీలను వరించుకొఱ కు బౌద్ధవిగ్రహము దాల్చినవాఁడవు నీవే. ఆత్రిపుర రాక్షస సమూహములను కాల్చునపుడు శివునికి విల్లుఅమ్ము మొదలయిన సాధనములను సవరించి సా హాయ్యము చేసినవాడును నీవే. ఇట్లు దుష్టులను నిగ్రహించి శిష్టులను రక్షిం చునీవు నన్నును రక్షింపుమా.

ఉ. సంకరదుర్గమై దురిత ♦ సంకుల మైన జగంబుఁజూచి స
ర్వాంకషలీల నుత్తమ తు♦ రంగము నెక్కి కరాసిఁబూని వీ
రాంకవిలాస మొప్పఁగలి♦ కాకృతి సజ్జనకోటికిన్ నిరా
తంక మొనర్చితీవెకద ♦ దాశరథీకరుణాపయోనిధీ. 78

టీ. సంకర = వర్ణసంకరముచేత, దుర్గమై = ప్రవేశింపరానిదై, దురిత = పాపముచేత, సంకులము = వ్యాపించినది, ఐనజగంబు = అయినట్టిలోకమును, చూచి, సర్వంకష = అన్నిటిని ఒరయుచున్న, లీలన్ = విలాసముతో, ఉత్తమరంగము = మేలయినగుఱ్ఱమును, ఎక్కి, కర + అసిన్ = చేతికత్తిని, పూని = తాల్చి, వీర + అంకవిలాసము = వీరఅంకవీరుండనుట, పరాక్రము, (ఒప్పన్ = ఒప్పుచుండఁగా, కలిక ఆకృతిన్ = కల్కి ఆకారముతో (కల్క్యవతారమెత్తి) సజ్జనకోటికిన్ = సత్పురుష సమూహమునకు, నిరాతంకము = ఆటంకములేమి, ఈవె = నీవె, ఒనర్చెదుకద = చేయబోయెదవుగదా.

తా. రామా! వర్ణసంకరము మిక్కిలి బలీయమైన పాపమునిండియున్న జగమును జూచి మిక్కిలి లీలతో, గొప్పగుఱ్ఱము నెక్కి, చేతగత్తిదాల్చి, పరాక్రమవిలాసము మెఱయఁగా కల్కిమూర్తివై సజ్జనులకు దురాచారవర్ణ సంకరాదిప్రతిబంధకములు లేకుండునట్లు ఇఁక చేయగలవాడవు నీవే యగుదువు.

చ. మనమునఁనూహపోహణలు♦మర్వకమున్నె కఫాదిరోగముల్
దనువునఁనంటి మేనిబిగి♦దప్పకమున్నె నరుండుమోక్ష సా
ధనమొనరింపగాఁ వలయు♦దత్త్వవిచారము మానియుండుట
ల్తనువునకున్ విరోధమిది♦దాశరథీ కరుణాపయోనిధీ. 79

టీ. మనమునన్ = మనస్సునందు, ఊహాపోహణలు = ఊహాపోహములు మఱ్వకమున్నె = మరచిపోకమునుపే, కఫాదిరోగముల్ = కఫము మొదలు

యిన తెవుళ్ళు, తనువునకా = దేహమునందు, అంటి = తగులుపడికలిగి, దేవి బిగి = దేహము యొక్కపటుత్వము, తప్పకమున్నె, నరుండు = మనుష్యుడు, మోక్షసాధనము,మోక్ష = మోక్షమునకు, సాధనము = సాధించు ఉపాయము, ఒనరింపకలయును = చేసికొనగావలయును, తత్వ = వస్తువుల కలపూవును, విచారము = పరిశీలనము, మానియుండుటల్ = వదలియుండుకార్యములు, తనువునకుకా = దేహమునకు, అవి, విరోధము = విరుద్ధమైనది.

తా. రామా! మనస్సునకు ఊహించు శక్తియుఁ దలంచుకొనుశక్తియు నశింపకమునుపును, కఫము మొదలైనరోగములు దేహమున వ్యాపించి పటుత్వము తప్పకమునుపును, మనుష్యుఁడు తత్త్వవిచారము చేసి మోక్షము నకుఁదగినసాధనములను చేసుకొనవలయును. పిదప చేసికొనుటకు శక్యము కాదు. తత్త్వవిచారము సేయకుండుట ఆత్మ స్వరూపమునకు విరుద్ధము గును.

చ. ముదమున కాటపట్టు,భవ♦మోహమదద్విరదాంకుశంబు,సం
పదలకొటారు, కోరుకుల ♦ పంట, పరంబున కాది, వైరుల
న్నదన జయించుత్రోవ, పవ♦దబ్ధికి నావ, గదా సదా భవ
త్పదమలనామసంస్మరణ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 80

టీ. భవత్ = నీయొక్క, సత్ = శ్రేష్టమును, అమల = నిర్మలమునైన, నామ = నామముయొక్క, సంస్మరణ = మిక్కిలిస్మరించుట, ముదమునకుకా = సంతోషమునకు, ఆటపట్టు = స్థానము, భవ = పుట్టుకయును, మోహ = అజ్ఞానమును అనెడి, ద్విరద = ఏనుగులకు, అంకుశంబు = అంకుసము, సంపదల కొటారు = సంపత్తులు చేర్చియుండెడి కొట్టు, కోర్కులనెల్లసఫలముగాఁజేయువదనుట, పరంబునకుకా = పరలోకమునకు, ఆది = మొదలు, వైరులకా = శత్రువులను, అదనకా = సమయము జూచి, జయించు

జైత్ర = గెలుచుమార్గము, విపత్ + అబ్ధికిన్ = ఆపదయనెడి సముద్రమునకు, నావ = ఓడ, (సముద్రమును దాటించు ఓడవలె ఆపదలను పోఁగొట్టునది) కదా = అగును.

తా, రామా ! నిర్మలమైన నీనామమును స్మరించుట సంతోషము కలిగించును; అంకుశముచే ఏనుఁగును అణఁచునట్లు ఎవతెగల యందుజన్మపరంపరను అణఁచును; సకలసంపదలను ఇచ్చును; కోరికల నెల్ల సఫలము గావించును; పరలోకమునకు మూలము; పగవారిని గెలుచుటకు సాధనమైనది; సముద్రమును దాటించునోడవలె ఆపదలను పోఁగొట్టును.

చ. దురితలతానుసారిభవ ♦ దుఃఖకదంబము రామనామభీ
కరతరహేతిచేఁ దెగి వ ♦ కావకలై చనకుండ నేర్చునే
దరికొని మండుచుండుశిఖ ♦ దార్కొనినన్ శలభాదికీటకో
త్కరము విలీనమై చనదె ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 81

టీ. దురిత = పాపమనెడి, లతా = తీఁగను, అనుసారి = అనుసరించుచున్న, భవ = పుట్టుకలనెడి, దుఃఖకదంబము = దుఃఖసమూహము, రామనామ = రామనామముఅనెడి, భీకరతర = మిక్కిలి భయంకరమైన, హేతిచేన్ = కత్తిచేత, తెగి, వకావకలై = ఛిన్నభిన్నమై, చనకుండ నేర్చునే = పోకుండఁ జాలునా, దరికొని = రగులుకొని, మండుచుండుశిఖిన్ = జ్వలించుచున్నఅగ్నిని, దార్కొనినన్ = తారసింపఁగా, శలభ = మిడుతలు, ఆది = మొదలైన, కీటక = పురుగుల, ఉత్కరము = సమూహము, విలీనమై = మిక్కిలి అడఁగిపోయినదై, చనదె = పోదా, నశించియేపోవునని భావము.

తా. రామా ! పాపము పయికయిరాఁగా దానితోఁగూడ పాఁగు దుఃఖాత్మకమైన జన్మపరంపర, కత్తిచేత తీఁగ త్రెంపబడునట్లు, రామనామముచే నశించి పటాపంచలై, రగిలిమండుచున్న అగ్నియందుబడిన మిడుతలు మొదలైన పురుగులవలె రూపుమాసి పోవును.

చ. హరిపదభక్తినింద్రియజ♦యాన్వితుఁ డుత్తముఁ డింద్రియంబు
లన్ ।మరుగక నిల్పనూఁదిన♦మధ్యముఁ డింద్రియపారవశ్యు
డై। పరఁగినచో నికృష్టుఁ డని పల్కఁగ దుర్మతినైన నన్ను నా
దరమున నెట్లు కాచెదవొ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 82

టీ. హరిపదభక్తిన్ = విష్ణువుపాదములందలిభక్తిచేత, ఇంద్రియ= ఇంద్రియములను, జయ = గెలుచుటతోడ, అన్వితుఁడు = కూడినవాఁడు, ఉత్తముఁడు = శ్రేష్ఠుఁడు, ఇంద్రియంబులన్ = ఇంద్రియములందు, మరుగక = లీనుఁడుగాక (ఇంద్రియములు పోయినదారినిపోక) నిల్పన్ = దానిని నిగ్రహించుటకు, ఊఁదినను = ప్రయత్నించినయెడల, మధ్యముఁడు = నడితరపువాఁడు, ఇంద్రియ=ఇంద్రియములకు, పారవశ్యుడై=అధీనుఁడై, పరఁగినచోన్ = ప్రవర్తించినయెడల, నికృష్టుఁడు = అధముఁడు, అని, పల్కఁగన్ = చెప్పఁగా, దుర్మతిని = దుష్టబుద్ధిని, ఇంద్రియములకు లోనైనవాఁడను, ఆదరమునన్ = ఆదరువుతో, ఎట్లు, కాపాడెదవో.

తా. దశరథరామా ! విష్ణుపదభక్తితో ఇంద్రియములను గెలిచినవాఁడు ఉత్తముఁడు; ఇంద్రియములకు లోనుగాక నిగ్రహింపఁ ప్రయత్నించినవాఁడు మధ్యముఁడు; ఇంద్రియములకు అధీనుఁడైనవాఁడు అధముఁడు. ఈ మువ్వురిలో దుష్టబుద్ధినైన నేను అధముఁడను గనుక రక్షింపఁదగినవాఁడను గాను. అయినను నన్నెట్లురక్షించెదవో తెలియదు.

చ. వనకరి చిక్కె మైనసకు ♦ వాచవికింజెడిపోయె మీను తా
వినికికిఁ జిక్కెఁ జిల్వకను♦వేఁదుఱుఁ జెందెను లేళ్ళు తావిలో
మనికి నశించెఁ దేఁటి తర♦మా యిరుమూఁటిని గెల్వనైదు సా
ధనముల నీవె కావఁ దగు♦దాశరథీ కరుణాపయోనిధీ. 83

టీ. వనకరి = అడవియేనుఁగు, మైనసకున్ = దేహమునందలి చాపల్యమునకు- (ఏనుఁగును పట్టువాండ్రు ఆకర్షించుటకై విడుచు ఆఁడుఏనుఁగు

చేపామునజూచి కామించియనుట,) చిక్కెన్ = చిక్కుపడెను, మీను = చేప, వాచవికిన్ = నోటిరుచికి (గాలమునందుగ్రుచ్చిన యెరయందలిరుచికి,చెడిపోయెన్ = తగులుబడిచెడెను. చిల్వ = పాము, తాన్ = తాను, వినికికిన్ = వినుటకు, (పాములవాఁడు ఊఁదుస్వరమును వినుటకు) చిక్కె = చిక్కుపడెను. లేళ్ళు, కనువేఁదుఱు = కంటిపిచ్చి, చెందెను = పొందెను (చక్షురింద్రియమునకులోనయ్యె) తేఁటి=తుమ్మెద, తావిలో = వాసనలో, మనికిన్ = ఉండుటచేత, నశించెను. (ఘ్రాణేంద్రియమునకు లోనయ్యె) పూఁదేనెవాసనకై తామర పూవులో చొచ్చి అది ముడుచుకొనఁగా లోపల చిక్కుకొనెననుట. ఇన్నియూటిని = ఐదింటిని (ఐదుఇంద్రియములను) గెల్వన్ = జయించుటకు, తరమా = శక్యమా, ఐదుసాధనములన్ = పంచవిధములైన ఉపాయములచేత, నీవె కావదగున్ = నీవేకాపాడవలయును.

తా. దాశరథీ! అడవిలో, ఏనుగు ఆఁడుఏనుఁగునుజూచియు, చేఁపగాలమునందలియెరచవికిని, పాము పాములవానిఊఁదుస్వరమును వినుటకును,లేఁడి కనుపిచ్చిచేతను, తుమ్మెద తామరలోని పూఁదేనెవాసనకును లోనయ్యి చిక్కుకొనుచున్నవి. ఆఱుఇంద్రియములను గెలువనెవరితరము? కనుక ఇంద్రియలోలుఁడైననాకును మోక్షము గలుగుట కష్టము గావున పంచేంద్రియముల నిన్నుఁగొల్చు పంచవిధకైంకర్యములచేత ఇంద్రియముల నడఁచి నన్ను కాపాడుమా.

చ. కరములుమీకు మ్రొక్కులిడఁ గన్నులు మిమ్మునెచూడ జిహ్వ
మీ, స్మరణఁదనర్పవీనులుభవత్కథలన్ వినుచుండనాసమీ
యఱుతను బెట్టుపూసరుల కాసగొనం బరమార్థసాధనో
త్కరమిదిచేయవే కృపను దాశరథీ కరుణాపయోనిధీ. 84

టీ. కరములు = చేతులు, మీకున్, మ్రొక్కులిడన్=దండములు పెట్టఁగాను, కన్నులు, మిమ్మునె, చూడన్ = చూడఁగాను, జిహ్వ =

నాలుక, మీ స్మరణకా = మిమ్ము స్మరించుటచేత, తనర్పక = ఒప్పఁగాను, వీనులు = చెవులు, భవత్ + కథల్ = మీ దైవచరిత్రములను, వినుచుండఁగ = వినుచుండఁగాను, నాస = ముక్కు, మీయఱుతను = మీపాదపద్మనందు, పెట్టు పూవులకు = పెట్టునట్టి పూదండలకు, అసగొనగ = అసకుమఁగాను, అది = ఇట్లు అయాఅవయవములు మీకు అయాకార్యములు సేయుట, పరమార్థ = సరియైన, సాధన = పురుషార్థములను సాధించెడి యుపాయము యొక్క, ఉత్కరము = సమూహము, (ఐదుఅవయవములకు చెప్పిన అయిదు వ్యాపారములే పురుషార్థములను సాధించుటకు వుపాయము.)

తా. చేతులు మీకు మ్రొక్కుటయు, కన్నులు మిమ్ముచూచుటయు, నాలుక మీనామమును జపించుటయు, చెవులుమీకథలను వినుటయు, ముక్కు మీపాదమునందలి పూదండలను గోరుటయుననెడి యీయైదువ్యాపారములే మోక్షమునకు సిద్ధికరమైనసాధనములు.

చ. చిరతరభక్తి నొక్కతులసీదళ మర్చనసేయువాఁడు ఖే
చరగరుడోరగప్రముఖసంఘములో వెలుఁగన్ సదాభవ
త్స్ఫురదరవిందపాదములఁ బూజలొనర్చినవారికెల్లఁ ద
త్పర మటచేతిధాత్రిగద దాశరథీ కరుణాపయోనిధీ. 85

టీ. చిరతరభక్తిన్ = బహుకాలముగా నున్నభక్తిలో, ఒక్కతులసీదళము = ఒక్క తులసిరేకు, అర్చనసేయువాఁడు = సమర్పించువాఁడు, ఖేచరులు గరుడులు ఉరగులు అను వీరియొక్క సమూహములోపల, వెలుఁగున్ = ప్రకాశించును, సదా = ఎప్పుడును, భవత్ = నీయొక్క, స్ఫురత్ = ప్రకాశించుచున్న, అరవింద = తామరలవంటి, పాదములన్ = అడుగులను, పూజలు ఒనర్చినవారికెల్లన్ = పూజించినవారి కందఱికిని, తత్పరము = ఆమోక్షము, అరచేతిధాత్రి = అఱచేతియుసిరికవలె కదా = అగును.

తా. రామా! బహుకాలము భక్తితోడ ఒక్కటులనీవరీమును నీకు సమర్పించినవాఁడు ఖేచరులు, గరుడులు, ఉరగులుఅను, వీరిలో నొక్కఁడై ప్రకాశించును. ఇఁక ఎప్పుడును నీపాదారవిందములను పూజ చేయువారికం దటికి మోక్షము కరతలామలకమే కదా.

ఉ. భానుఁడుతూర్పునందుఁగను♦పట్టినఁబావకచంద్రతేజముల్
హీనతఁ జెందినట్లు జగ♦దేకవిరాజిత మైననీపద
ధ్యానము సేయుచున్నఁ బర♦దైవమరీచులడంగకుందునే
దానవగర్వనిర్దళన ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 86

టీ. దానవ = రాక్షసులయొక్క, గర్వ = గర్వమును, నిర్దళన = హరించువాఁడా, భానుఁడు = సూర్యుఁడు, తూర్పునందున్ = తూర్పుదిక్కునందు, కనుపట్టినన్ = కనఁబడఁగా, పావక = అగ్నియొక్కయు, చంద్ర = చంద్రునియొక్కయు, తేజముల్ = కాంతులు, హీనతచెందినట్లు, జగదేక = లోకమునకుముఖ్యముగా, విరాజితము = ప్రకాశించునది,ఐన నీపదధ్యానము = అయినట్టి నీపాదములను ధ్యానించుట, చేయుచున్నన్ = చేయుచుండఁగా, పరదైవమరీచులు = ఇతరదైవములకాంతులు, అడంగకుందునే = అణఁగిపోవకుందునా.

తా. సూర్యుని కాంతికి అగ్ని మొదలగు వానికాంతు లడఁగునట్లు జగత్తంతయు ప్రకాశించుచున్న నీపదధ్యానముయొక్క ప్రకాశమునకు ఇతరదేవతల ప్రకాశములు అడఁగిపోవును.

ఉ. నీమహనీయతత్త్వరస♦నిర్ణయబోధకథామృతాబ్ధిలోఁ
దాముముఁగుంకులాడక వృ♦థాతనుకష్టముఁజెందిమానవుం
డీమహిలోకతీర్థముల♦నెల్ల మునింగిన దుర్వికారహృ
త్తామసపంకముల్ విడునె♦దాశరథీ కరుణాపయోనిధీ. 87

టీ. నీ, మహనీయ = గొప్పదైన, తత్త్వరస=తత్త్వసారముయొక్క, నిర్ణయ = నిశ్చయముగల, సిద్ధాంతముగలిపినట్టి, బోధ = జ్ఞానముకలిగిన, కథా = కథలనెడి, అమృతాబ్ధిలోన్ = అమృతమయమైన సముద్రమునందు. తాన్ = తాను, మును = ముందు, క్రుంకులాడక = మునుఁగక, వృథా = వ్యర్థముగా, అతనుకష్టమున్ = మిక్కిలిసంకటమును, జెంది = పొంది, మానవుండు = మనుష్యుఁడు, ఈమహిలోక తీర్థములన్ = తీర్థములందంతటను, మునింగినన్ = క్రుంకఁగా, దుర్వికార = చెడువికారములుగల, హృత్ = హృదయముయొక్క, తామస = తమోగుణసంబంధియైన కార్యములనెడి, పంకముల్ = రొంపులు, విడునె = విడిచిపోవునా.

తా. రామా! నీమహత్త్వముయొక్క సారస్యమిట్టిదని నిర్ణయించి తెలుపునీదివ్యచరిత్రమనెడి యమృత సముద్రమందు ముందుగ్రుంకులిడిననే దుర్వికారమైనహృదయమందలి తామసములనెడి రొంపులు తీసిపోవునుగాని కేవలము ఈ భూలోకమునందలి తీర్థములందు మునిఁగినయెడల అవి తీసిపోవవు.

ఉ. కాంచనవస్తుసంకలిత ♦ కల్మష మగ్నిపుటంబు పెట్టి వా
రించినరీతి నాత్మ నిగి ♦ డించిన దుష్కరదుర్మలత్రయాం
బంచితభక్తియోగదహ ♦ నార్చిఁ దగుల్పక పాయునే కన
త్కాంచనకుండలాభరణ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 88

టీ. కనత్ =ప్రకాశించుచున్న, కాంచన=బంగారుమయమైన, కుండల = కుండలములు, ఆభరణ = సొమ్ముగాఁగలవాఁడా, కాంచనవస్తు = బంగారు పదార్థమునందు, సంకలిత = మిక్కిలి తగిలిన, కల్మషము = మాలిన్యము, అగ్నిపుటంబుపెట్టి=అగ్నిపుటమువేసి,వారించినరీతిన్=తొలఁగించినవిధమున, దుష్కర = చేయరాని దుర్మలత్రయంబు = చెడ్డదియైనమూఁడుమలములను (మనోవాక్కాయములమూఁటియొక్క మాలిన్యములను) అంచిత = ఒ

వ్వుచున్న, భక్తియోగమనెడి, దహన = అగ్నియొక్క, అర్చిక్ = జ్వాలయందు, తగుల్పక = విడిచిపోవుట.

తా. రామా ! బంగారులోని మాలిన్యము అగ్నిపుటమువల్ల పోవునట్లు ఆత్మయందుఁగల మూడుమలములును నీయందలి భక్తియోగముచేత నే నశించునుగాని మఱొకవిధమున నశింపదు.

ఉ. నీసతి పెక్కుఁగల్మలిడ ♦ నేర్పరి,లోక మకల్మషంబుగా
నీసుత సేయు పావనము, ♦ నిర్మిత కార్యధురీణదక్షుఁడై
నీసుతుఁడిచ్చు నాయువులు, ♦నిన్ను భజించినఁగల్గకుండునే
దాసుల కీప్సితార్థములు ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 89

టీ. నీసతి = నీభార్య, పెక్కుకల్మలు = అనేకసంపదలు, ఇడక్ = ఇచ్చుటకు, నేర్పరి = నిపుణురాలు, నీసుత = (నీపాదములందుఁ బుట్టుటచే) నీకూఁతురైన గంగ, లోకము = జగము, అకల్మషంబు కాక్ = నిర్దోషము గునట్లుగా, పావనము సేయుక్ = పవిత్రముగాఁజేయును, నీసుఁతుడు = నీకొడుకైన బ్రహ్మ, నిర్మితకార్య = నిర్మాణకృత్యముయొక్క,(సృష్టికార్యముయొక్క) ధురీణ = భారముగల, దక్షుఁడై = నేర్పరియై, ఆయువులు = ఆయుష్యములు, ఇచ్చును, నినుక్ = (ఇట్టిభార్యయు కూఁతురును కొడుకునుగల) నిన్ను, భజించినక్ = కొలువఁగా, దాసులకుక్ = నీభక్తులకు, ఈప్సిత = కోరికలు, కల్గకుండునే = లభింపకపోవునా.

తా. రామా ! నీభార్యయైనలక్ష్మి సమస్తసంపదల నిచ్చుటకు నిపుణురాలు. నీకూఁతురైన గంగ ముల్లోకములందును ప్రవహించి లోకములందలిదోషములను పోఁగొట్టి పవిత్రముగాఁజేయును.నీకొడుకైనబ్రహ్మసృష్టికార్యమంతయు నిర్వహింప సమర్థుఁడై ఆయువులనిచ్చును. ఇట్టి పుత్రకళత్రాదులుగల నిన్ను భజించిన నీభక్తులకు కోరినకోర్కులు నెరవేరకపోవు.

ఉ. వారిజపత్రమందిడిన♦వారివిధంబున వర్తనీయమం
దారయ రొంపిలోనఁ దను♦వంటనికుమ్మరిపుర్వురీతి సం
సారమునన్ మెలంగుచు వి♦చారగుఁడై పరమొందుఁగాదె స
త్కార మెఱింగి మానవుఁడు♦దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. వారిజపత్రమందు = తామరాకునందు, ఇడినవారివిధంబునన్ = ఉంచినజలముతీరిని, ఆరయన్ = విచారింపఁగా, రొంపిలోనన్ = బురదయందు, తనువు = దేహము, అంటనికుమ్మరపుర్వురీతిన్ = తగులుకొనని కుమ్మరపురుగు విధమునను, సంసారమునను = సంసారమందు, మానవుఁడు = మనుష్యుఁడు, మెలంగుచున్ = ప్రవర్తించుచు, విచారగుఁడై = తత్త్వవిచారమును పొందినవాఁడై, సత్కారము = పూజ, (నిన్ను పూజించుటను) ఎఱింగి = తెలిసి, పరమున్ = మోక్షమును, ఒందున్ కాదె = పొందునుగదా.

తా. రామా! తామరాకునందలి నీటిబొట్టు ఆతామరాకును యెట్లు అంటుకొనదో, రొంపిలో కుమ్మరపురుగు మెలఁగినను దానిదేహమునకు బురదఅంటుకొనక యెట్లుండునో, యట్లే పురుషుఁడైనవాఁడు సంసారమందు ప్రవర్తించుచుండినను తత్త్వవిచారమును పొంది సంసారమున తగులుపడక మోక్షమును పొందును గదా.

ఉ. ఎక్కడితల్లిదండ్రి సుతు♦లెక్కడివారు కళత్రబాంధవం
బెక్కడ జీవుఁ డెట్టితను♦వెత్తినఁ బుట్టుచుఁ బోవుచున్నవాఁ
డొక్కఁడె పాపపుణ్యఫల♦మొందిన నొక్కఁడెకానరాడువే
ఱొక్కఁడుఁ వెంటనంటిభవ♦మొల్లనయా కృపఁజూడవయ్యనీ
తక్కరిమాయలం దిడక♦దాశరథీ కరుణాపయోనిధీ. 91

టీ. ఎక్కడితల్లిదండ్రి = తల్లియు తండ్రియు ఎక్కడివారు. (తల్లిదండ్రి అని చెప్పుకొనుటకాని నిజముగా వారితో సంబంధమేమియులేదు)

సుతులు = కొడుకులు, ఎక్కడివారు = వారితోడిసంబంధమెక్కడిది. కళ
త్రబాంధవంబు = పెండ్లామనెడి చుట్టరికము, ఎక్కడ = ఏమిసంబంధము,
ఏలనఁగా, జీవుడు = దేహధారి, ఎట్టితనువు = ఎట్టిదేహమును, ఎత్తినన్ =
ధరించినను, (ఎంతటిగొప్పజన్మము ఎత్తినవాఁడైనను,) ఒక్కడె = తాను
ఒకఁడే, పుట్టుచున్ = జన్మించుచును, పోవుచున్ = మరణించుచును, ఉ
న్నవాడు (తల్లితండ్రి, కొడుకులు, పెండ్లము అని యిందఱు ఒకజీవునికి మి
క్కిలి సంబంధించినవారుగా కనబడుచున్నారు. గాని నిజము విచారింపగా
వాడు పుట్టినప్పుడు ఒక్కఁడుగానే పుట్టివచ్చుచున్నాఁడు. చచ్చునప్పుడు
ఒక్కఁడుగానే చచ్చిపోవుచున్నాడు. అప్పుడుకూడ పెండ్లము బిడ్డలెవరు
ను వచ్చుటయులేదు. పోవుటయులేదు. కాన తక్కినవారితోడిసంబంధ
మేమి శాశ్వతము అని భావము. పాపపుణ్యఫలము = తాను చేసిన పాప
ములకును పుణ్యములకును కలుగుఫలము, ఒందినన్ = పొందఁగా (అనుభ
వించునప్పుడు) ఒక్కఁడే = తాను ఒక్కఁడేకాని, ఆఫలమును యొవరును
అనుభవింపరు. వెంటనంటన్ = వెంటనే పోవుటకు, వేఱు ఒక్కఁడున్ =
మరియొక్కడుఁగాని, కానరాఁడు = కనఁబడఁడు. (పుట్టినగాని చచ్చినగాని
పుణ్యపాపఫల మనుభవించినఁగాని తా నొక్కఁడేయగును) కాబట్టి, భవ
ము = పుట్టుక, ఒల్లనయా = ఇచ్చగింపనయ్యా, (శాశ్వత సంబంధము లేక
ఎందుకును పనికిమాలిన తలిదండ్రులకడుపున బుట్టి పెండ్లమును గట్టుకొని
బిడ్డలను గనుచుండెడి యీసంసారము నిస్సారమే కనుక అది వాక్కిష్టము
లేదనుట.)నీతక్కరిమాయలందు = నీకపటపు మాయలందు,ఇడక = నన్ను పె
ట్టక (నాతో లీలలు చూపక) కృపన్ = దయతో, చూడవయ్య =
చూడుమీ.

తా. రామా! తల్లిదండ్రులు, కొడుకులు, పెండ్లము అనువారు క
ర్మానుగుణముగా నడుమ వచ్చినవారేకాని శాశ్వతముగా సంబంధించియుం
డువారుగారు. ఏలనఁగా ఒకఁడు యేజన్మమెత్తినపుడుగాని పుట్టునపుడును చ

చ్చునపుడును పుణ్యపాపఫలము లనుభవించునపుడును తా నొక్కఁడే యగును
గాని తలిదండ్రులు మొదలైనవారు వానితో కూడ వచ్చుటగాని పోవుట
గాని అనుభవించుటగాని లేదు. కాఁబట్టి అట్టివారిసంబంధము గలసంసార
ము నాకక్కఱ లేదు. నీవు నాతో వేసుకలు సేయక నిజముగా సంసార
మునుండి తప్పించి నన్నుఁ గాపాడుమా. [రుల్

చ. దొరసినకాయముల్ ముదిమిఁ దోఁచినఁ జూచి ప్రభుత్వముల్సి
మెఱుపులుగాఁగఁ జూచి మఱి మేదినిలోఁ దమతోడివారు ముం
దరుగుటఁ జూచిచూచి తెగునాయువెఱుంగక మోహపాశము
ల్దెఱుఁగనివారి కేమిగతి దాశరథీ కరుణాపయోనిధీ. 92

టీ. దొఁరసిన కాయముల్ = కలిగిన దేహములు, ముదిమి = వార్ధక
ము, తోఁచినన్ = తోఁపఁగా, చూచి, ప్రభుత్వముల్ = దొరతనములు, సి
రుల్ = సంపదలు, మెఱుపులుగాఁగన్ = మెఱపుతీఁగలవలె, చూచి = తెలిసి
కొని, మఱి = మఱియు, మేదినిలోన్ = భూమియందు, తమతోడివారు =
తమతోఁగూడ పుట్టి పెరిఁగినవారు, ముందు = తమకు మునుపు, అరుగుట =
పోవుటను (చచ్చుటను) చూచిచూచి, తెగుఆయువున్ = నశించునట్టి
ఆయుష్యమును (ఆయువు నశించిపోవునని) ఎఱుంగక = తెలిసికొనక, మో
హపాశముల్ = అజ్ఞానపుత్రాళ్లు (ప్రపంచ విషయములందు త్రాళ్లవలె బంధిం
చు అజ్ఞానము) తెఱుఁగనివారికిన్ = తగ్గనివారికి, ఏమిగతి = ఏమిదిక్కు.

తా. రామా! శరీరములు ముదిసిపోవుట చేతను దేహము అస్థిరమ
నియు, ప్రభుత్వాదులు నశించుటచే సంపదలు అస్థిరములనియు, తమతోడి
వారు ముందుగా నేచచ్చి యుండుటచే తాము చావవలసినవారనియు, చ
క్కఁగా తెలియుచుండినను ఆయువు నశించునని తెలియక అస్థిరములైన
యాదేహాదులయందే అజ్ఞానముయొక్క పాశములచే కట్టుపడుచున్నారే!
ఇట్టివారికి కలుగఁగలస్థితి యేమి? యని భావము.

చ. సిరిగలనాఁడు మైమఱచి♦చిక్కిననాఁడుఁదలంచిపుణ్యముల్
పోరిఁ బోరిఁ జేయనైతినని♦పొక్కినఁగల్గునె గాలిచిచ్చుపైఁ
గెరలినవేళఁ దప్పిగొని ♦ కీడ్పడువేళ జలంబు గోరి త
త్తరమునఁ ద్రవ్వినం గలదె♦దాశరథీ కరుణాపయోనిధీ. 93

టీ. సిరి = సంపద, కలనాఁడు = కలిగియుండినదినములందును, మైమ రచి = దేహముతెలియుట తప్పి, చిక్కిననాఁడు = ఉన్న దినములందును, త లంచి = ఆలోచించి, పుణ్యముల్ = పుణ్యకార్యములను, పోరిఁబోరిఁ = మాటిమాటికి, చేయనైతిని అని = చేయక పోయితినిఅని, పొక్కినఁ = త పింపఁగా, కల్గునె = ఫలము గలుగునా (ఇందుకు దృష్టాంతము) గాలి, చి చ్చుపై = అగ్గిమీఁద, కరలినవేళఁ = విజృంభించినప్పుడు (ఇల్లు మొదలగు వానిని కాల్పఁబూనిన అగ్నిని పుట్టినప్పుడే చల్లార్పక దానిపై గాలియు తగిలి మిక్కిలి రగులుకొన్న సమయమున) దప్పిగొని, కీడ్పడువేళఁ = గ్రుక్కుడు సమయమందును, జలంబుఁ = నీటిని, కోరి = ఆసించి, తత్తరమున = = తడఁబాటుతో, త్రవ్వినఁ = భూమిలో త్రవ్వఁగా, కలదే = నీళ్ళుకలుగు నా? (అట్లే సంపద లుండినకాలమున పుణ్యములు సేయక అది పోయిన వెనుక చేయకపోతిమేయని చింతించుటచే ఫలములేదనుట.)

తా. సంపదయుండిన కాలమందును, సంపదచే మిత్తిల్లి ఒడలు మఱచి యుండినకాలమందును, ఆలోచించి పుణ్యకార్యములుమాటికి చేయ కపోతినే యని దారిద్ర్యము వచ్చిన వెనుక చింతించుట, గాలిచేమిక్కిలి రేఁ గిననిప్పును ఆర్పుటకును, బాగాదప్పిగొని నప్పుడును, జలమునకై భూమిని వే గపడి త్రవ్వుటయెట్లో అట్లే వ్యర్థమగును.

ఉ. జీవన మింకఁ బంకమునఁ ♦ జిక్కినమీనుచలింపకెంతయుం
దాపున నిల్చి జీవనమె ♦ తద్దయుఁ గోరువిధంబుచొప్పడం

దావలమైనఁగాని గుఱి ♦ దప్పనివాఁడు తరించువాఁడయా
తావకభక్తియోగమున ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 94

టీ. జీవనము = నీళ్ళు, ఇంకఁ = ఇంకిపోఁగా, బంకమునఁ = బురదయందు, చిక్కినమీనము = చిక్కుపడినచేఁప, ఎంతయుఁ = ఎంతమాత్రమును, చలింపక = కదలక, తావునఁ = తానున్నచోటనే-ఉండి, జీవనమె = నీటినే-కోర బ్రతుకునే, తద్దయుఁ = మిక్కిలి, కోరువిధంబు = కోరునట్టిరీతి, చొప్పడ = కలుగునట్లుగా, తావలమైనదానిఁ = స్థానమైనదానిని, (తనకు ఆధారమైనదానిని, తనకు ఉజ్జీవకమైన నిన్నుఅనుట) గుఱిదప్పనివాఁడు = గురితప్పనివాఁడు, (తనకు ఆధారభూతుఁడైన నీయందేగుఱియుంచి ఆగుఱినితప్పక నిన్నే ధ్యానించుచుండువాఁడు) తావక భక్తియోగమునఁ = నీదైనభక్తితోడి కూడికచే, తరించువాడయా = సంసారమును దాటువాఁడు అయ్యా.

తా. చేఁప, నీళ్ళు ఎండిపోయినబురదలో చిక్కుకొన్నను, ఆచోటు విడిచి కదలక అందే నిలిచి నీళ్ళనే తుదకు కోరునట్లు నీయందలి చింతనముతోనే గుఱియుంచి యెన్నికష్టములు వచ్చినను దానిని వదలక యుండువాఁడు అట్లుండుటచే నీయెడల భక్తియుదయించి ఆభక్తియోగమున సంసారమును దాటునని తాత్పర్యము.

చ. సరసునిమానసంబు సుర ♦ సజ్ఞుఁ డెఱుంగును ముష్కరాధముం
డెఱిఁగి గ్రహించువాఁడె కొల ♦ నేకనివాసము గాఁగ దర్దురం
బరయఁగ నేర్చునెట్లు విక ♦ చాబ్జమరందర సైకసార భో
క్తృరము మిళిందమొందు క్రియ ♦ దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. సరసునిమానసంబు = రసజ్ఞునిమనస్సును, సరసజ్ఞుఁడు = మిక్కిలి రసము దెలిసినవాఁడు, ఎఱుంగును = తెలియును, ముష్కర + అధముండు = మూర్ఖుఁడైన నీచుఁడు, గ్రహించువాఁడె = గ్రహింపఁగలఁడా, ఇందుల

ప దృష్టాంతము:-దర్దురము = కప్ప, కొలను = సరస్సు, ఏక నివాసముగాఁగన్ = ఒక్కచో నునికిపట్టుగాఁగా, (కొలఁకునందే ఎప్పుడును ఎడతెగక యుండునదైనను) వికచ = అకొలఁకునందు, వికసించిన, అబ్జ = తామరలయొక్క, మరందరస = పూఁదేనె ద్రవముయొక్క, ఏక = ముఖ్యమైన, సౌరభ = వాసనలయొక్క ఉత్కరము = సమూహమును, మిళింద = (దూరముననుండు) తుమ్మెద, పొందుక్రియన్ = పొందురీతిని, ఎట్లు = ఏరీతిని, అరయఁగనేర్చు = విచారించి తెలిసికొననేర్చును, (తుమ్మెద తెలిసికొనునట్లు తాను ఎంతమాత్రమును తెలిసి కొననేరదనుట.)

తా. రామా! కప్ప సరస్సులోనే యెప్పుడు వాసము చేయుచుండునదైనను అందువిరిసిన తామరలయందలి పూఁదేనెవాసనలను తెలియఁజాలదు. తుమ్మెదయో, దానిని తెలిసి యనుభవించును. ఇట్లే రసికుని మనస్సులోనిభావమును రసికుఁడే తెలిసికొని యానందింప గలఁడుగాని మూఢుడైన యల్పుఁడు తెలిసికొనఁజాలఁడు.

ఉ. నోఁచినతల్లి దండ్రికి ద • నూభవుఁడొక్కఁడె చాలు మేటిచే,
చాఁచనివాఁడు, వేఱొకఁడు • చాఁచిన లేదనకిచ్చువాఁడు,నో
రాఁచి నిజంబకాని పలు • కాడనివాఁడు రణంబులోన మేన్
దాఁచనివాఁడు భద్రగిరి • దాశరథీ కరుణాపయోనిధీ. 96

టీ. నోఁచినతల్లిదండ్రికిన్ = పూర్వజన్మమందు పుణ్యవ్రతములునోఁచినట్టి తల్లిదండ్రులకు, చే = చేయి, చాఁచనివాఁడు = యాచింపనట్టివాడనుట, వేఱు ఒకఁడు = మఱియొకఁడు, చాఁచినన్ = (తన్నుగూర్చి) చేయి చాఁపఁగా (తన్నుయాచింపగా) లేదు అనక యిచ్చువాఁడు = వాఁడు యాచించినది యిచ్చునట్టివాఁడును, నోరుఆఁచి = అడ్డగించి, నిజంబ = నిజమే, సత్యమే, కానిపలుకు = కానట్టిమాటను, ఆడనివాడు = చెప్పనివాఁడును, అబద్ధము చెప్పుటకు, నోరు మూసికొనునేకాని నోరు తెరచి నిజమే చె

ప్పవాఁడనుట, రణంబులోనన్ = యుద్ధమునందు, మేన్ = ఒడలిని, దాచనివాఁడు = మాటుచేయనివాఁడు, ఇట్టివాఁడైనమేటి = శ్రేష్ఠుఁడగు, తనూభవుఁడు = కొడుకు, ఒక్కఁడే, చాలున్ = చాలును (యిట్టి లక్షణములు లేని కొడుకులు ఎందఱు పుట్టినను పుట్టనట్లే యని భావము.)

తా. ఒకరిని యాచింపనివాఁడును, ఒకరు తన్ను యాచింపగా లేదన కిచ్చువాఁడును నోరఁదెరచి యబద్ధము చెప్పనివాఁడును, యుద్ధమందు వెనుక దీయనివాఁడును, అగుకొడుకు భాగ్యముచేసిన తల్లిదండ్రులకు ఒక్కఁడే కలిగినఁ జాలును. పెక్కండ్రు వలదు.

ఉ. శ్రీయుతజానకీరమణ ♦ చిన్మయరూప రమేశ రామ నా
రాయణ పాహి పాహి యని ♦ ప్రస్తుతిఁ జేసితి నామనంబునం
బాయక కిల్బిష వ్రజ వి ♦ పాటన మందఁగఁ జేసి సత్కళా
దాయిఫలంబు నాకియవె ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 97

టీ. శ్రీయుత = కాంతితోఁ గూడినవాఁడా, జానకీరమణ = సీతాదేవికి పెనిమిటి యైనవాఁడా, చిత్ + మయ = జ్ఞానమయమైన, రూప = స్వరూపముగలవాఁడా, రమా = లక్ష్మికి పతియైనవాఁడా, రామ = అందఱిని రమింపఁజేయువాఁడా, నారాయణ = నారములను సకలచేతనాచేతనములను వాసస్థానముగాఁగలవాఁడా, పాహిపాహి యని = కావుము కావుము అని, ప్రస్తుతిన్ చేసితి = స్తోత్రముచేసితిని, నామనంబునన్ = నామనస్సునందు, పాయక = విడువక, కిల్బిష = పాపములయొక్క, వ్రజ = సమూహములయొక్క, విపాటనము = ఖండించుటను, అందఁగన్ చేసి = లభించునట్లుచేసి (నాపాపములను నాశముచేసియనుట) సత్కళా = మంచికళను, దాయి = ఇచ్చునట్టి, ఫలంబున్ = ఫలమును, నాకు, ఇయవే = ఇమ్ము.

ఉ. ఎంతటిపుణ్యమో శబరి ♦ యెంగిలిగొంటివి వింతగాదె నీ
మంతన మెట్టిదో యుడుత ♦ మేని గరాగ్రనఖాంకురంబులన్

సంతసమందఁ జేసితివి ♦ సత్కులజన్మము లేమి లెక్క వే
దాంతముగాదె నీమహిమ ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 98

టీ. శబరియెంగిలిన్ = శబరికొఱికి చవిచూచుటచే ఎంగిలియైనపండ్లను, గొంటివి = తీసికొంటివి (భక్షించితివి) ఎంతటిపుణ్యమో = అదిచేసికొన్నపుణ్యముఎంత అతిశయించినదో, వింతకాదె = ఇదిఆశ్చర్యముకదా, (దేవతలు ఇచ్చునట్టి శ్రేష్ఠపదార్థములను గ్రహింపనినీవు, అల్పురాలైన శబరియెంగిలిని తినుటచూడఁగా, దానిపుణ్యము మిక్కిలియాశ్చర్యమైనదనుట) నీమంతనము = నీరహస్యము, (నీకుఉడుతమీఁద ప్రేమాతిశయము కలుగుటకు రహస్యము,) ఎట్టిదో = ఎటువంటిదో, ఉడుతమైని = ఉడుత దేహమున, కరాగ్ర = వేళ్లయొక్క, నఖ + అంకురములన్ = గోటి మొనలచేత, సంతసము అందన్ = సంతోషపడునట్లు, చేసితివి = గోళ్లతోనివిరి ఉడుతను సంతోషపెట్టితివనుట. సత్కులజన్మములు = మంచివంశమున పుట్టుకలును, ఏమిలెక్క = నీకేమిలక్ష్యము(నీవు వంశమును జాతినిపాటింపవుఅనుట) నీమహిమ = నీమహాత్మ్యము. వేదాంతముగాదె = వేదాంతమేకదా, నీమహిమ జాతిని కులమును జూడక రక్షించునట్టివాడవైతివని భావము.

తా. శబరియెంగిలిని తింటివి. అది యెంతపుణ్యము చేసికొన్నదో ఆశ్చర్యమగానున్నది. ఉడుతమైని మునిగోళ్లతో గీఁటిసంతోషపెట్టితివి. దానిపై నింతవాత్సల్యము కలుగుటకు రహస్యమేమో తెలియకున్నది. విచారించిచూడఁగా నీవుజాతిని కులమును పాటించువాఁడవు కావు. ఔను నీమహత్త్వము వేదాంతప్రతిపాద్య మగునంత విస్తారమైనది. కాన నీరక్షణమునకును శిక్షణమునకును కారణములు మముబోఁటులకు తెలియవు.

ఉ. బొంకనివాఁడె యోగ్యుఁడరి♦బృందములెత్తినచోటఁ జివ్వకుఁ
జంకనివాఁడె జోదు రభ ♦ సంబున నర్థకరంబు సాఁచినం
గొంకనివాఁడె దాత మిముఁ♦గొల్చి భజించినవాఁడెపోనిరా
తంకమనస్కుఁడెన్నఁగను ♦ దాశరథీ కరుణాపయోనిధీ.99

టీ. బొంకనివాఁడె = అబద్ధము చెప్పనివాఁడే, యోగ్యుఁడు, అరిబృందములు = శత్రుసమూహములు, ఎత్తినచోటన్ = దండెత్తి వచ్చినయెడల, చివ్వకున్ = యుద్ధమునకు, జంకనివాఁడె = వెనుకదీయనివాఁడే, జోదు = యోధుఁడు, రథసంబునన్ = వేగముగా, అర్థి = యాచకుఁడు, కరంబు = చేతిని, చాఁచినన్ = చాఁపఁగా. కొంకనివాఁడె = ఇచ్చుటకు మిణుకరింపనివాఁడే, దాత, మిముల్ = మిమ్ము, కొల్చి = సేవించి, భజించినవాఁడె = ధ్యానము చేసినవాఁడే, నిరాతంక = ఆతంకము లేని, మనస్కుఁడు = మనస్సు గలవాఁడు) (నిన్నుఁ గొలిచినవానికి మనసు నిర్మలముగా నుండునని భావము)

చ. భ్రమరము కీటకంబుఁగొని • పాల్పడి ఝుంకరణోపకారియై
భ్రమరముగా నొనర్చునని • పల్కుటఁ జేసి భవాదిదుఃఖసం
తమస మెడల్చి భక్తిసహి • తంబుగ జీవుని విశ్వరూప త
త్త్వమున ధరించు టే మరుదు • దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. భ్రమరము = తుమ్మెద, కీటకంబు = పురుగును, కొని, పాల్పడి = దానికై పూని, ఝుంకరణ + ఉపకారియై = ఝుంకారముచేత ఉపకరించి, భ్రమరముగాన్ = తుమ్మెదగా, ఒనర్చునని = చేయునని, పల్కుటఁ జేసి = చెప్పుటచేత (జనులాడుకొనుటచేత) జీవునిన్, భవ = పుట్టుక, ఆది = మొదలుగాఁగల, దుఃఖసంతమసము = దుఃఖములనెడి చీఁకటిని, ఎడలించి = పోఁగొట్టి, భక్తిసహితంబుగన్ = భక్తితోఁగూడ - లేక 'భక్తిజనితంబుగన్' అను పాఠమున, (భక్తి ఉదయింపఁగా) విశ్వరూపతత్త్వమునన్ = నీయొక్క విరాడ్రూపస్వరూపమునందు, ధరించుట = తాల్చుట, ఏమి, అరుదు = ఆశ్చర్యము, (నీతో సమానమైన ఆకారము గలవానినిగా చేయుట ఏమివింత) ఒక కేవలజంతువైన తుమ్మెద, పురుగును తనవలె తుమ్మెదగాఁ జేయుట లోకమున తెలియుచుండఁగా నీవు జీవుని దుఃఖములం బోఁగొట్టి, భక్తి కలిగించి. వానికి నీతోడి సారూప్యమును ఒసఁగుట ఆశ్చర్యము కాదని తాత్పర్యము,

చ. తరువులుపూచి కాయలగుఁ దత్కుసుమంబులుపూజగా భవ
చ్చరణము సోఁకి దాసులకు ♦ సారములౌ ధనధాన్యరాసులై
కరిభటఘోటకాంబరని ♦ కాయములై విరజానదీసము
త్తరణ మొనర్చుఁ జిత్రమిది ♦ దాశరథీ కరుణాపయోనిధీ. 101

టీ. తరువులు = చెట్లు, పూచి = పుష్పించి, కాయలగుక్ = కాయలం గాచును, తత్ + కుసుమంబులు = ఆపూవులు, పూజగా = (కోసి) పూజార్థముగా, భవత్ + చరణము = నీపాదమును, సోఁకి = దాకి, దాసులకుక్ = నీభక్తులకు, సారములు = శ్రేష్ఠములు, ఔ ధనధాన్యరాసులై = అగునట్టిధనధాన్యములకుప్పలై, కరి = ఏనుఁగులు, భట = బంటు, ఘోటక = గుఱ్ఱములు, అంబర = వస్త్రములు. వీనియొక్క, నికాయములై = సమూహములై, విరజానదీ = పరమపదపు ఎల్లగానుండు విరజఅనుపేటిని, సముత్తరణము = దాటుటను, ఒనర్చుక్ = చేయును. ఇది = నీపాదములు సోఁకినపూవులు, చిత్రము = ఆశ్చర్యము.

తా. రామా! చెట్లయందలి పూవులు ఆట్లేయుండినయెడల కాయలగును. వానిసేకోసి నీపాదములందు పూజార్థముసమర్పింపఁగా అవి నీయడుగులు సోఁకఁగానే మేలైనధనధాన్యములును ఏనుఁగులు, బంట్లు, గుఱ్ఱములు, వస్త్రములు మొదలైనవిగా ఇహలోకమున పరిణమించి పరమపదమును కలిగించును.

ఉ. పట్టితిభట్టరార్యగురు♦పాదములిమ్ముయినూర్ధ్వపుండ్రముల్
పెట్టితి మంత్రరాజ మొడిఁ♦బెట్టితి నయ్యమకింకరాళికిం
గట్టితి బొమ్మ మీచరణ♦కంజములందుఁ దలంపు నెట్టిపోఁ
దట్టితిఁ బాపపుంజముల♦దాశరథీ కరుణాపయోనిధీ. 102

టీ. భట్టరార్యగురుపాదములను = గురువులగు భట్టరాచార్యుల వారియొక్క పాదములను, పట్టితిక్ = చేపట్టితిని(వారి శిష్యుఁడ నైతి) ఈమె

యిన్ = ఈదేహమున, ఊర్ధ్వపుండ్రముల్ = తిరుమణి శ్రీచూర్ణములను, పెట్టితిని, మంత్రరాజము = మంత్రశ్రేష్ఠమైన తిరుమంత్రమును, ఒడిఁబెట్టితిన్ = గ్రహించితిని, దానిచేత, ఆయమకింకరాళికిన్ = ఆ యమదూతల సమూహమునకు, బొమ్మన్, కట్టితిని = జయించితి, మీచరణకంజములందు = మీపాదారవిందములందు, తలంపుపెట్టి = మనస్సునుంచి, పాపపుంజములన్ = పాపసమూహములను, పోన్ + తట్టితిని = పోవునట్లు ఎగజిమ్మితిని.

తా. భట్టరాచార్యులవారి శిష్యుడనై, తిరుమణి శ్రీచూర్ణములు ధరించి, తిరుమంత్రముపదేశమొంది, నరకము తొలగించుకొని మీపాదారవిందములను ధ్యానించుచు, పాపములను పోగొట్టుకొన్న వాడనైతిని.

ఉ. అల్లన లింగమంత్రిసుతుఁ డత్రిజగోత్రజు డాదిశాఖ కం
చెర్లకులోద్భవుం డనఁ బ్రసిద్ధుడనైభవదంకితంబుగా
నెల్లకవుల్ నుతింప రచియించితి గోపకవీంద్రుఁడన్ జగ
ద్వల్లభ నీకు దాసుఁడను దాశరథీ కరుణాపయోనిధీ. 108

టీ. జగద్వల్లభ = జగన్నాథా, లింగమంత్రి సుతుఁడు = లింగమంత్రికొడుకు, అత్రిజగోత్రుఁడు = ఆత్రేయగోత్రము గలవాఁడు, ఆదిశాఖ = ఋగ్వేదశాఖవాఁడు, కంచెర్ల కులోద్భవుఁడు = కంచెర్లకులమున బుట్టినవాఁడు, అనన్ = అనఁగా, ప్రసిద్ధుఁడనై, భవదంకితముగాన్ = నీకుఅంకితముగా, ఎల్లకవుల్, నుతింపన్ = పొగడఁగా, రచియించితిని = ఈశతకము చేసితిని, గోపకవీంద్రుఁడన్ = గోపకవి శ్రేష్ఠుఁడను, నీకున్, దాసుడను.

తా. రామా! నేను లింగమంత్రికుమారుఁడను. నాది ఆత్రేయగోత్రము. ఋగ్వేదముశాఖ. కంచెర్లకులము. పేరు గోపకవి. నీకు దాసుఁడను. కవులందఱును పొగడునట్లుగా ఈశతకమును రచించి నీకు అంకితము సేసితిని.

దాశరథీశతకము సమాప్తము.

వ్యవహారబోధిని

మొదటి భాగము.

ఈగ్రంథమునందు, నవీనపద్ధతుల ప్రకారము ఎలిమెంటరీ పాఠశాలలలోఁ జదువు బాలురకును ఉపాధ్యాయులకును వ్యవహారేచ్ఛగల ప్రతిమనుష్యునకును మిక్కిలి నుపయోగించు వ్యావహారిక విషయములు న్యాయశాస్త్ర పద్ధతుల ననుసరించి విపులముగ వ్రాయబడియున్నవి. ధనవంతులు డబ్బు నప్పిచ్చుటచేతను, ధనహీనులు ధనమునప్పుగాఁ దెచ్చుకొనుటచేతను సర్వసాధారణముగ వ్యవహారవిషయిక జ్ఞానము ప్రతివారికిని ఆవశ్యకమయియున్నది. వ్యవహార ప్రాతిపదికములగు ప్రామిసరీ నోట్లు, తనఖాపత్రములు, క్రయదస్తావేజులు, కవులుచిత్తులు, ఖరారునామాలు మున్నగు కట్టుబాటు పత్రములను విధించుకొనునప్పుడు న్యాయవాదుల సహాయములు మెండు. వారు ప్రతిస్వల్పవ్యవహారమునకును పట్టణవాస్తవ్యులగు న్యాయవాదుల యొద్దకేగి సంప్రతించుట కడు ప్రయాసము. అట్లు సంప్రతించనియెడల వ్యాజ్యకారణములగు దస్తావేజులలో నవకతవక లుండుటయు, అందుచేత నష్టకష్టములు సంభవించును. ఈబాధతొలఁగుటకు న్యాయవాదులయొద్దకే పోయి సంప్రతించి వ్రాసికొందమన్న వ్యయప్రయాసలకు హేతువగును. ఇంతటిదుస్తరమగు బాధతొలఁగించుటకును అద్దములో మొగమును జూచుకొనునట్లు ఎట్టికాగితమును వ్రాసికొనవలసివచ్చినను విస్పష్టముగాఁ దెలిసికొనుటకును, సులభసాధకమగు నీచిన్న "వ్యవహారబోధిని" యను గ్రంథమును రచించి ప్రచురింపఁబడినది.

వెల 0—5—0.

వలయువారు:—రామా అండ్ కో,

హెడ్డాఫీసు—ఏలూరు, కృష్ణాజిల్లా.

బ్రాంచి:-తిర్లపాడు, నెల్లూరుజిల్లా.

వ్యవహారబోధిని

రెండవ భాగము.

ఈ చిన్న పొత్తమునందు ప్రతివారును న్యాయస్థానములలో పొందదగిన పరిహారములకు సంబంధములగు అన్ని విషయములయందును జ్ఞానము కలిగించుటకు తగిన అంశములన్నియును విపులముగా వ్రాయబడియున్నవి. ఇయ్యది ధనికులకును బీదలకును ఉపయోగము కలుగజేయు పుస్తకము. ధనికులు పరాధీనము చేయబడిన తమ సత్వమును రాబట్టుకొనుటకు న్యాయస్థానములలో ఏయేచర్యలు జరుపుకొనవలయునో వాటిని గూర్చి వకీళ్లద్వారా తామే ఏపనులు చేయించుకొనవలయునో యీయంశములు స్పష్టముగా తెలియగలవు.

బీదలు, తమఇతరులయొద్ద ద్రవ్యము నప్పుపుచ్చుకొని వానికి తీర్చుటలో నాలస్యమగునెడల వారు కోర్టుకుపోయి కలిగించెడు వ్యవహారపుచిక్కులను గ్రహించుకొని నష్టము రాకుండ కాపాడుకొనుటకు తగినమార్గములు. ఈగ్రంథము చదువువారలకు చక్కగబోధకమగును. కావున అందఱును కొని యుపయోగించుట కనుకూలముగ నుండునట్లు స్వల్పక్రయ మేర్పరుపబడినది.

వెల 0—6—0

వలయువారు:—రామా అండ్ కో,
హెడ్డాఫీసు—ఏలూరు, కృష్ణాజిల్లా.
బ్రాంచి—తర్లపాడు, నెల్లూరుజిల్లా